సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొని అమ్మ వార్ల కృపకు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. భక్తులంతా దర్శనానంతరం క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినందున ఇతరత్రా ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు.

సంపుటి 09, సంచిక: 60 | బుధవారం | 28-01-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



### సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తాం
- కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచాం : భట్టి


03



### రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

- ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం
- నాటి పాలకుల స్వార్థ పూరిత నిర్ణయాల వల్లే వ్యవస్థ భ్రష్టు పట్టింది
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

03



### తిరోగమనంలో సంక్షేమం.. పెరుగుతున్న అసమానత

- ఆర్థిక స్థితిపై కేంద్ర సర్కార్ మండిపాటు
- 2025లో రూపాయి ఆసియాలో అత్యంత పేలవ పనితీరు కనబరచిన కరెన్సీ : కాంగ్రెస్

05

# నేటి నుంచి నామినేషన్లు...

## ఫిబ్రవరి 11న మున్సిపాలిటీ ఎన్నికలు

- రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఒకే విడతలో ఎన్నికలు
- 13న కౌంటింగ్
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని వెల్లడి




మున్సిపాలిటీలు : 116
కార్పొరేషన్లు : 7
మొత్తం వార్డులు : 2,996
మొత్తం ఓటర్లు : సుమారు 52.43 లక్షలు
పోలింగ్ కేంద్రాలు : 8,203
(పారదర్శకత కోసం 100 శాతం వెబ్ కాస్టింగ్).

ప్రజాపక్షం/హైదరాబాద్ :

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, జనవరి 30 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు ఇచ్చారు. ఈనెల 31న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించ



నున్నారు. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉండగా, అదే రోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, తరువాయి 2లో

### మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్..

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం జనవరి 28
నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జనవరి 30, (సాయంత్రం 5 గంటల వరకు)
నామినేషన్ల పరిశీలన జనవరి 31
నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఫిబ్రవరి 03, (మధ్యాహ్నం 3 గంటల వరకు)
పోలింగ్ తేదీ ఫిబ్రవరి 11 (ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు)
రీ-పోలింగ్ (అవసరమైన చోట) ఫిబ్రవరి 12
ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఫిబ్రవరి 13
మేయర్లు, చైర్మన్ల పరోక్ష ఎన్నిక ఫిబ్రవరి 16.

# భారత్–యూరప్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ:** భారత్–యూరప్ దేశాలమధ్య రెండున్నర దశాబ్దాలపాటు చర్చల (మధ్యలో కొంత విరామం) తర్వాత న్యూఢిల్లీ వేదికగా మంగళవారం కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదిరింది. భారత్–యూరోపియన్ యూనియన్ నాయకులమధ్య జరిగిన సదస్సులో యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోడర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్య ఈ మైలురాయి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో జతగా కలిసి ఉన్న భద్రత, రక్షణ సహకార ఒప్పందాలపై కూడా నాయకులు సంతకాలు చేశారు. వచ్చే ఏడాది నాటికి ఒప్పందం అమలు దశకు చేరుకుంటుంది.ఈ ఒప్పందం వల్ల 27 దేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్ కూటమి ప్రజలు, ప్రపంచంలోనే అత్యధికంగా 140 కోట్లు జనాభాగల మొదటిదేశం భారత్ మధ్య సరుకుల స్వేచ్ఛా వాణిజ్యానికి, భారత దేశ నైపుణ్యాన్ని ఎగుమతి చేయడానికి, ఇరువై పులా లక్షల ఉద్యోగాల తరువాయి 2లో

ఈ ఒప్పందంతో రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు ఎయిర్‌క్రాఫ్ట్‌లు,స్పేస్ క్రాఫ్ట్‌లు వంటి అనేక వస్తు సేవల ఎగుమతులపై ఎలాంటి టారిఫ్‌ల సమస్యలూ ఉండవు. ఉమ్మడి భద్రతా భాగస్వామ్యం నెలకుంటుంది. ప్రస్తుతం మోటారు వాహనాలపై హెచ్చుమోతాదులో ఉన్న టారిఫ్‌లు క్రమంగా తగ్గిపోతాయి. యూరప్ నుండి వచ్చే వైన్,బీరు, ఆలివ్ ఆయిల్‌లపై భారతదేశం సుంకాల్లో కోత పెడుతుంది. భారత్ నుండి ఎగుమతి చేసే టెక్స్‌టైల్,లెదర్,సముద్ర ఉత్పత్తులు, హస్తకళా ఉత్పత్తులు,రత్నాలు, ఆభరణాలపై సుంకాలు ఉండవు. టీ,కాఫీ,సుగంధ వస్తువులు,ప్రాసెస్డ్ ఫుడ్‌లకు ఒప్పందంతో ప్రయోజనం కలుగుతుంది. పాల ఉత్పత్తులు, పప్పులు, కోళ్ళపరిశ్రమ,కొన్ని పళ్ళు,కూరగాయలకు రక్షణలు ఉంటాయి. భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య వృత్తి నిపుణుల స్వల్పకాలిక ప్రయాణాలపై కూడా ఆంక్షలు సడలిస్తారు.



మంత్రుల రహస్య భేటీ అంటూ

## విషప్రచారం చేయొద్దు

- సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం
- మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

'ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య జరిగే ప్రతి చర్చకు రాజకీయాలను ఆపాదిస్తూ 'రహస్య భేటీ' అని విష ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంత్రుల భేటీపై సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంత్రి తరువాయి 12లో

'నరేగా, సర్, యుజిసి' నిబంధనలపై

# నిర్మాణాత్మక చర్చ జరపాల్సిందే

- అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాలు డిమాండ్
- 'విబి–జి రామ్ జి' చట్టాన్ని వెనక్కి తీసుకోమన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశం ముందు ఉంచిన చట్టాలపై 'రివర్స్ గేర్' చేయలేమని వెల్లడి



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభ, రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ జరగనుంది. అలాగే ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రెండు విడతలుగా జరిగే బడ్జెట్ సమావేశాలు తొలి దశ బుధవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అనంతరం కొద్దిరోజుల విరామం తర్వాత మార్చి 9న మళ్లీ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 2వ తేదీతో బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. కాగా, మంగళవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు యుపిఎ కాలం నాటి ఎంజిఎన్ఆర్ఇజిఎ పునరుద్ధరణ, కొనసాగుతున్న ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), భారతదేశ విదేశాంగ విధానం, కొత్త యుజిసి మార్గదర్శకాలపై వివాదం వంటి అనేక అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. అయితే, కొత్తగా ప్రవేశపెట్టిన 'విబి–జి రామ్ జి' చట్టాన్ని తరువాయి 2లో




### సిఎస్ఎస్‌లో కేంద్రం వాటా పెంచాలి

- 'కగార్'పై సమగ్ర నివేదిక ఇవ్వాలి
- అఖిలపక్ష సమావేశంలో సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ:** కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు, రైతు వ్యతిరేక విత్తన బిల్లు ఉపసంహరణకు సిపిఐ డిమాండ్ చేసింది. కేంద్ర పథకాలు (సిఎస్ఎస్)లో వాటాను 75:25కు పెంచాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్రాలకు వీలు కల్పించాలని సూచించింది. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, ప్రజల జీవనోపాధికి భద్రత కోసం ప్రలకు సంబంధించిన అన్ని కీలక అంశాలపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ తేల్చిచెప్పారు. ఆపరేషన్ కగార్ పేరిట తరువాయి 2లో




# ఐదు రోజులే పనిచేస్తాం

- ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసేదాకా విశ్రమించేది లేదు
- బ్యాంకు ఉద్యోగుల హెచ్చరిక
- ఎస్‌బిఐ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించిన ఉద్యోగులు
- ఐదు రోజుల పని దినాల అమలు వల్ల ఉద్యోగుల పనితీరు జీవన సమతుల్యత మెరుగు : బి.ఎస్ రాంబాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు సాధించే వరకు విశ్రమించేది లేదని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీని ఐదు రోజుల పనిదినాలను వెంటనే అమలు చేయాలని బ్యాంక్ ఉ ద్యోగులు మంగళవారం హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బిఐ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో బిఎస్. రాంబాబు, ప్రొఫెసర్ తరువాయి 12లో



## పులుల గణన సర్వే సక్సెస్


- 6రోజుల పాటు శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వాహణ
- ములుగు మినహా 32 జిల్లాల్లో సర్వే పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పులుల గణన సర్వే (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్–2026) విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 19 నుంచి 25 వరకు ఆరు రోజులపాటు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ సర్వే చేపట్టారు. సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో ములుగు జిల్లాను మినహాయించి, 32 జిల్లాల్లోని అన్ని బీట్‌లలో సర్వే పూర్తి చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా 15 తరువాయి 12లో

# ఫ్రాన్స్ టీనేజర్లకు సోషల్ మీడియా నిషేధం

హైస్కూల్స్‌లో ఫోన్లు నిషేధం : బిల్లు ఆమోదం




**పారిస్ :** ఫ్రాన్స్ దేశంలో 15 ఏళ్ళ లోపు వయసు గల టీనేజర్లకు సోషల్ మీడియాను, హైస్కూళ్ళలో ఫోన్ల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ మేరకు ఫ్రెంచ్ పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది. పాఠశాల విద్యా సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీ నుండీ ఈ చట్టం ఫ్రాన్స్‌లో అమలులోకి వస్తుంది. ఈ విషయంలో రాబోయే నెల నాటికి యూరప్‌లో ఫ్రాన్స్ దేశం ఒక మార్గదర్శిగా ఉంటుందని అధికారపార్టీ నాయకులు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలు దేశాలు టీనేజర్లకు సోషల్ మీడియాను దూరం చేసే చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. టీనేజర్లపై టిక్‌టాక్,యూట్యూబ్,మెటాలు తీవ్ర మానసిక, శారీరక ప్రభావాలు చూపిస్తున్నాయని నివేదికలు వస్తున్న తరుణంలో ఈ వేదికలన్నీ సమీక్షకు గురవుతున్నాయి. ఈ వేదికలు చూపిస్తున్న ప్రభావంపై సర్వేలు, పరిశోధనలు కూడా కొనసాగుతున్నా. ఆస్ట్రేలియా తర్వాత టీనేజర్లకు సోషల్ మీడియాను కఠినంగా నిషేధించిన దేశం ఫ్రాన్స్‌దేశమే. సోమవారం అర్థరాత్రి ఫ్రాన్స్ జాతీయ చట్టసభలో ఎంపిలు తరువాయి 12లో



# వనజాతరకు వెళ్లొద్దాం

- నేటి నుంచి మేడారం మహాజాతర
- పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన రాష్ట్రప్రభుత్వం
- విదేశాల నుంచి తరలివస్తున్న భక్తులు

ప్రజాపక్షం/హనుమకొండ

రెండేళ్ల కోసారి అత్యంత వైభవంగా జరగనున్న మేడారం మహాజాతరకు సర్వం సిద్ధ మైంది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర ఘనంగా జరగనుంది.లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కల గకుండా ప్రభుత్వం 8 జోన్లు, 42 సెక్టర్లుగా జాతరను విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది మేడారంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతరలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఎఐ సహకారంతో అత్యాధునిక డ్రోన్లు, సిసి కెమెరాలతో నిఘాకు సన్నద్ధం తరువాయి 12లో



# అమెరికాలేని యూరప్ స్వీయరక్షణ ఓ కల

యూరప్‌కు నాటో అధినేత మార్క్ రట్టే హెచ్చరిక



**స్ట్రాస్‌బర్గ్ :** అమెరికా సైనిక అండదండలు లేకుండా యూరప్ స్వీయ రక్షణ సాధించడం కల మాత్రమేనని నాటో కూటమి ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే యూరప్ దేశాలకు ప్రత్యక్ష హెచ్చరిక చేశారు. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడం లేదా నయానో భయానో స్వాధీనం చేసుకోవడం, అఫ్ఘనిస్థాన్‌లో అగ్రభాగాన నిలబడి నాటో దళాలు పోరాడలేదని ట్రంప్ చేసిన ఆరోపణలతో ఇటీవల దుమారాలు చెలరేగిన నేపథ్యంలో తాజాగా యూరోపియన్ పార్లమెంట్ సమావేశంలో మార్క్ రట్టే మరోసారి యూరప్‌ను అమెరికా దారిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "అమెరికాకు నాటో అవసరం ఉంది, నాటోకు అమెరికా అవసరం ఉంది, అమెరికా లేకుండా యూరప్ మనుగడ సాధ్యం కాదు, అలాంటి స్వీయ రక్షణ కలలు కనడమే అవుతుంది, ఒకవేళ ఎవరైనా మళ్లీ ఆలా ఆలోచిస్తే అలా కలలు కంటూనే ఉండండి, అది సాధ్యం కాదు" అన్నారు. అమెరికా సైన్యంపై ఆధారపడటం తగ్గించుకోవాలని యూరప్ దేశాలలో పెరుగుతున్న ఆలోచనలు, 'యూరోపియన్ ఫ్రీలోడింగ్' పేరుతో అమెరికా చేస్తున్న ఎద్దేవా నుండి బయటపడేందుకు ఆసియా దిగ్గజాలైన భారత్-చైనాలతో సంబంధాలు విస్తరణకు యూరప్ యత్నాలు వంటి కొత్త ఆలోచనల నేపథ్యంలో రట్టే చేసిన తాజా హెచ్చరిక మళ్లీ కలకలం రేపింది. అమెరికా సహాయం లేకుండా సైనిక పరంగా యూరప్ తన కాళ్లమీద తను నిలబడొచ్చుకోవాలన్న వాదనను రట్టే తోసిపుచ్చారు. "అమెరికా అణు ఛత్రం కింద యూరప్ రక్షణ పొందుతోంది, అమెరికా మనతో లేదంటే ఈ అణు ఛత్రాన్ని, ఒక హామీదారుణ్ణి కోల్పోతాం" అన్నారు. రక్షణకు ఐదుశాతం కేటాయించాలని యూరోపియన్ యూనియన్ దేశాలు గత ఏడాది అంగీకారానికి వచ్చాయని, కానీ అందుకు రెట్టింపు 10 శాతం మేరకు వారు రక్షణ రంగానికి కేటాయించాల్సి వస్తుందని, అణ్వాయుధాలు నిర్మించుకోవడానికి లక్షలకోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని రట్టే హెచ్చరిస్తూ, "మీకు శుభం కలుగు గాక!" అన్నారు. దీనిపై ఫ్రాన్స్ విదేశీమంత్రి జీన్ నోయల్ బారోట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, యూరప్ తన రక్షణ బాధ్యతలు తాను తీసుకోగలదన్నారు. రట్టే ఇదియ పార్లమెంటులో మాట్లాడుతూ, నాటో కూటమి చట్టంలోని ఆర్టికల్-5కు అమెరికా కట్టుబడి ఉందని అన్నారు. యూరప్ తన రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని అమెరికా కోరుకుంటున్నదని, యూరో-అట్లాంటిక్ భద్రత అమెరికా కోరుకుంటోందని, యూరప్ భద్రతను కూడా కోరుతోందని, అందువల్ల మొత్తంగా నాటో అన్ని ప్రయోజనాలను ఆశిస్తోందని అన్నారు.

ట్రంప్ అట్లాంటిక్ సంబంధాలు దావోస్ వేదికగా ప్రపంచానికి మరింత స్పష్టంగా అర్థమైన మరునాడే గ్రీన్‌లాండ్ భవిష్యత్తుపై ట్రంప్-మార్క్ రట్టే మధ్య ఒక ఒప్పందం కుదిరింది. తమ దేశం తరపున ఏ విధంగా నాటో అధినేత ఒప్పందం చేసుకుంటారని డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టె ఫ్రెడరిక్సన్ ప్రశ్నించారు. అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న రట్టే ట్రంప్‌ను డాడీ అని సంబోధించి, "మీరు మంచి పని చేస్తున్నారు" అని ప్రశంసించిన యూరప్ దేశాలకు ఇప్పటికే కోపం తెప్పించారు. దావోస్‌లో ట్రంప్-రట్టే మధ్య సమావేశం మళ్ళీ యూరప్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, యూరప్ భద్రత హామీలపై చర్చకు పురిగొల్పింది.

## అత్యంత బలహీన దశలో ఖమేనీ పాలన!

ట్రంప్‌కు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం



**జెరూసలెం :** ఇరాన్-అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు పెద్దగా వార్తల్లోకి రాకపోయినప్పటికీ, శక్తిమంతమైన అమెరికా విమానవాహక యుద్ధనౌక 'అబ్రహం లింకన్' ఇరాన్‌కు సమీపంలో ఉన్న సముద్రజలాల్లో కేంద్రీకృతమై ఉండటంతో పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. మరోవైపు ఇరాన్‌లో ఏం జరుగుతోందో వేగు ద్వారా ట్రంప్ ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. పశ్చిమదేశాల పత్రికల కథనం ప్రకారం, ట్రంప్‌కు ఇరాన్ పరిస్థితులను గూఢచారి వర్గాలు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నాయి. మానవహక్కుల సంఘాల రూపంలో అక్కడ అమెరికా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌లో 1979లో రాజు షా పరిపాలన కుప్పకూలడానికి ముందున్న పరిపాలనాపరమైన బలహీన పరిస్థితులు ఇప్పుడు ఖమేనీ పాలనలో కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయన్నది ట్రంప్‌కు వేగుల ద్వారా లభించిన సమాచారం. చర్చలకు ఇదే సరైన సమయమని సలహాదారులు చెబుతున్నప్పటికీ ట్రంప్ ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. ఖమేనీ ఇప్పుడు సురక్షిత ప్రదేశంలో ఒక బంకరులో ఉన్నారు. తాత్కాలికంగా పాలనా బాధ్యతలన్నీ ఆయన కుమారుడు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో అసంతృప్తి తగ్గకుండా కొనసాగుతోందని ట్రంప్‌కు లభించిన సమాచారం. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ నివేదిక ప్రచురించింది. "ట్రంప్ అంతిమలక్ష్యం మాత్రం ఖమేనీ ప్రభుత్వాన్ని తొలగించడమే" అని రిపబ్లికన్‌పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహం టైమ్స్ పత్రికకు చెప్పారు. "ఈరోజు వారు దేశంలో ఆందోళన చేస్తున్న ప్రజలను చంపడం మానేయవచ్చు, కానీ వచ్చేనెలలో కూడా వారు అధికారంలో కొనసాగితే అప్పుడైనాగానీ ప్రదర్శకులను హతమారుస్తారు. అందువల్ల ఖమేనీ పాలన అంతం కావాల్సిందే" అని లిండ్సే గ్రాహం అన్నారు.

# దక్షిణ కొరియాపై ట్రంప్ ఆగ్రహం.. 10 శాతం అదనపు సుంకాలు పెంపు

**వాషింగ్టన్ :** దక్షిణ కొరియాపై అమెరికా సుంకాలు పెంచింది. అమెరికాకు ఎంతో మిత్రదేశమైనప్పటికీ దక్షిణ కొరియా గత ఏడాది కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందానికి కట్టుబడలేదని, ఒప్పందానికి అనుగుణంగా ప్రవర్తించడంలేదని ట్రంప్ ఆగ్రహించారు. ఈ నేపథ్యంలో సుంకాలను 25 శాతానికి పెంచారు. ఇప్పటివరకూ దక్షిణ కొరియా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై ఉన్న 15 శాతం సుంకాలను ఇప్పుడు 25 శాతానికి పెంచారు. ఐతే దక్షిణ కొరియా దీనిపై స్పందిస్తూ, ఈ నిర్ణయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని, ఈ విషయంలో తాము తక్షణ చర్చలు కోరుతున్నామని పేర్కొంది. ఆటోమొబైల్స్, చిత్రిక పట్టిన కలప, ఫార్మాస్యూటికల్స్ సహా దక్షిణ కొరియా నుండి వచ్చే ఇతర అనేక దిగుమతి వస్తువులపై ట్రంప్ సుంకాలను పెంచారు. రెండు దేశాలమధ్య సుంకాలలో పరస్పర సమతౌల్యం కొరవడిందని ఆయన పేర్కొన్నారు. తమ దేశం నుండి దక్షిణ కొరియా చాలా ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుండగా, తామే తక్కువ సుంకాలు వసూలు చేస్తున్నామన్నారు. తాము ఒప్పందానికి కట్టుబడి సత్వర చర్యలు తీసుకుని టారిఫ్‌లు తగ్గించుకోగా, దక్షిణ కొరియా మాత్రం టారిఫ్‌లను తగ్గించకుండా, ఒప్పందం ప్రక్రియను జాప్యం చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. ప్రస్తుతం కెనడాలో పర్యటిస్తున్న దక్షిణ కొరియా పరిశ్రలమంత్రి కిమ్ జంగ్ క్వాన్ సత్వరం అమెరికాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అమెరికా వాణిజ్యమంత్రి హోవార్డ్ లుత్నిక్‌తో ఆయన సమావేశమవుతారు. గత ఏడాది అక్టోబరులో దక్షిణ కొరియాతో ట్రంప్ ఒక వాణిజ్య ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంతోపాటు అమెరికాలో 350 బిలియన్ డాలర్లు )(256 బిలియన్ పౌండ్లు) పెట్టుబడులు కూడా ఆ దేశం సమకూర్చేందుకు సంసిద్ధమైంది. ఈ ఒప్పందం అమలు ప్రక్రియ ప్రారంభమైన నెలలోనే దక్షిణ కొరియా నుండి దిగుమతయ్యే కొన్ని వస్తువులపై టారిఫ్‌లు తగ్గించేందుకు కూడా రెండు దేశాలమధ్య ఒప్పందం కుదిరింది. గత ఏడాది నవంబరు 26 న జాతీయ అసెంబ్లీలో ఈ ఒప్పంద తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని ఆ దేశ ప్రభుత్వం సమీక్షిస్తోంది.



చైనాతో ఒప్పందం చేసుకుంటే నూటికి నూరు శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు రోజుల క్రితమే కెనడా ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఐతే చైనాతో తమ దేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కొనసాగించడంలేదని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ అన్నారు. అంతకుముందు గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించే ఆలోచనను వ్యతిరేకించే ఎనిమిది యూరప్ దేశాలపైన భారీగా సుంకాలు విధించేందుకు ట్రంప్ ప్రకటన చేసి బెదిరించారు. గ్రీన్‌లాండ్‌పైన కూడా సుంకాలు విధించారు. నాటోతో కూడా సంబంధాలు దెబ్బతినడమే కాకుండా యూరప్ దేశాలు ఎదురు తిరగడంతో దావోస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటన చేశారు.

## మిన్నెసోటాపై దూకుడు తగ్గించిన ట్రంప్

రాష్ట్రం వదిలి వెళ్లనున్న ఐసిఇ ఉన్నతాధికారులు


**మిన్నెపొలిస్ :** మిన్నెపొలిస్‌లో అక్రమ వలస నేరస్థుల ఏరివేత పేరుతో ఇప్పటికే ఇద్దరిని ఐసిఇ అధికారులు కాల్చి చంపడంతో తీవ్ర ఒత్తిడికి గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన వైఖరి మార్చుకున్నారు. మిన్నెసోటాపై దూకుడు తగ్గించి వెనక్కు తగ్గి, ఆ రాష్ట్రం నుండి ఉన్నతస్థాయి ఫెడరల్ అధికారులను కొంతమందిని వెనక్కు వచ్చేయాలని ఆదేశించారు. దీంతో సరిహద్దు గస్తీ కమాండర్ గ్రెగరీ బొవినో, ఇతర ముఖ్య అధికారులు మిన్నెసోటా నుండి వెళ్లిపోయేందుకు రంగం సిద్ధమైంది. వారంతా వెళ్లిపోయాక ట్రంప్ నియమించిన బోర్డర్ జార్ టామ్ హోమన్ మిన్నెపొలిస్‌లో క్షేత్రస్థాయిలో విచారణా చర్యలు ప్రారంభిస్తారు. ఈనెలలోనే ఇద్దరు మరణించడంతో కాల్పులపై తక్షణం దర్యాప్తు చేయాలని సెనేటర్లు ట్రంప్‌పై ఒత్తిడి పెంచారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ కూడా తీవ్రస్థాయిలో ట్రంప్‌పై ధ్వజమెత్తారు. సర్వత్రా ఈ విషయంలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.మిన్నెసోటాలో ఇరవైరోజులుగా ఆందోళనలు జరుగుతుంటే ఈనెల 24న అలెక్స్ ప్రెట్టీ (37)ని నికొల్లెట్ అవే వద్ద సరిహద్దు గస్తీ ఏజంట్లు కాల్చి చంపడంతో ప్రజాగ్రహం రెట్టింపయ్యింది. అమెరికన్ జాతీయుడైన అలెక్స్ ఐసియు నర్సుగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఎలాంటి నేర చరిత్ర లేదు. ఆయనకు గన్ లైసెన్సు ఉన్నాగాని, ఏనాడూ దానిని వెంట తీసుకువెళ్లలేదు. అతడు తుపాకీతో బెదిరించినట్లు అధికారులు చెబుతుండగా వీడియోల్లో మాత్రం ఆయన చేతుల్లో ఏమీ కనిపించడంలేదు. మిన్నెసోటాలో మోహరించిన వందల మంది ఫెడరల్ అధికారులను వెనక్కు పంపాలని ప్రజలు కోరుతున్నారు. అమెరికా దేశ మూల విలువలపై దాడులు పెరిగిపోతున్నాయని, పార్టీలకు అతీతంగా ప్రజలు అప్రమత్తం కావాలని బరాక్ ఒబామా తన సందేశంలో హెచ్చరించారు.

## హమాస్ నిరాయుధీకరణపై హడావిడి

**టెల్‌అవీవ్ :** గాజాలో గత ఏడాది అక్టోబరులో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత సజీవ నిర్జీవ బందీలను స్వాధీనం చేసే ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం(జనవరి 26)తో ముగిసింది. గాజాలో హమాస్ వద్ద బందీగా ఉండిపోయిన చిట్టచివరి ఇజ్రాయెలీ పౌరుడు, ఉగ్రవాద నిర్మూలన పోలీసు అధికారి రాన్ గ్విలీ మృతదేహ అస్థికలు స్వదేశానికి చేరాయి. 2023 అక్టోబరు ఏడో తేదీన రాన్ గ్విలీని ఉగ్రవాదులు బందీగా తీసుకుపోయారు. ఈ విషయాన్ని నెతన్యాహూ ప్రభుత్వం ధృవీకరించింది. రాన్ గ్విలీ మృతదేహ అస్థికలను స్వాధీనం చేసుకోవడంలో హమాస్ బృందాలు సహాయం చేశాయని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇక ఇజ్రాయెల్‌కు వాగ్దానం చేసినవిధంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేయాల్సి ఉందని ఆక్సియోస్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. గాజాలో శాంతి సాధనకు ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళికలో భాగంగా మొదటి విడత ఇజ్రాయెల్-హమాస్ మధ్య పరస్పరం బందీల మార్పిడి, ఖైదీల విడుదల ప్రక్రియ పూర్తి కావాలి. వాస్తవానికి నిర్దేశిత సమయంలోపు ఈ మొదటి దశ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇజ్రాయెలీ బందీలు ఎక్కడ ఉన్నారో తమకు జాడ తెలియడంలేదని, వారి మృతదేహాలను వెలికి తీయడానికి పెద్ద పెద్ద యంత్రాలు కావాలని హమాస్ బృందాలు పట్టుపట్టాయి. ఆ తర్వాత ఉమ్మడి గాలింపు చర్యల్లో ఒక్కొక్క మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఇక తదుపరి రెండో దశలో గాజాలో ఉన్న హమాస్ ఉగ్రవాదులను బయటకు పంపేయడం, వారిని నిరాయుధీకరించడం, అంటే వారి ఆయుధాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియపై ఇక హడావిడి మొదలవుతుంది. తాము ఆయుధాలు స్వాధీనం చేసే ప్రశ్నే లేదని, పాలస్తినా ప్రభుత్వానికే తాము ఆయుధాలు స్వాధీనం చేస్తామని హమాస్ వర్గాలు భిన్న ప్రకటనలు చేస్తున్నాయి. ఈ రెండో దశలో రఫా క్రాసింగ్‌ను రాకపోకల కోసం ప్రారంభించడం, లెక్కకు మిక్కిలిగా అంతర్జాతీయ సహాయాన్ని గాజా ప్రజల కోసం ఆ ప్రాంతంలోకి అనుమతించడం, గాజా పునర్నిర్మాణ ప్రక్రియ ఎజెండాలో ఉన్నాయి.

## నగదు రహిత చికిత్సలకు ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయండి..

ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల జెఎసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో అన్ని రకాల జబ్బులకు అపరిమిత, నగదు రహిత వైద్య సేవలను అందేలా చూడాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కలిపి సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరూ నెలవారీగా వారిగా కాంట్రిబూషన్‌ను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో జెఎసి ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఇహెచ్‌ఎస్) అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఇన్‌పేషెంట్ అవుట్‌పేషెంట్ నగదు రహిత చికిత్స కోసం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ అమలులో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు హెల్త్ కార్డులను అంగీకరించకపోవడం, ఆసుపత్రి బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం ఉండటం వల్ల ఇహెచ్‌ఎస్ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఉద్యోగుల కాంట్రిబూషన్‌ను సంబంధించి లబ్ధిదారుల సంఖ్య, వయస్సు, ప్రత్యేక సేవలను బట్టి (ఐచ్ఛికంగా)నిర్ణయించడం సమంజసంగా ఉంటుదన్నారు. తెలంగాణ ఉద్యోగుల జెఎసి ప్రతిపాదనపై సిఎస్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత విభాగాల అధికారులతో సంప్రదించి తుది నివేదికను ఇచ్చేలా చర్యలు చేపట్టనున్నట్టుగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు కె.రామకృష్ణ, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, గరికె ఉపేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

సృష్టికి బ్రహ్మాండమైన అవకాశాలు లభిస్తాయి. భారత రైతులకు, చిన్న పరిశ్రమలకు, సేవారంగానికి ఈ ఒప్పందం కొత్త ద్వారాలు తెరవనున్నది. గతంకంటే భిన్నంగా భారత సరుకులపై సుంకాల భారాలు తద్వారా వాటి ధరలు గణనీయస్థాయిలో తగ్గిపోతాయి. ఎఫ్‌టిఎ సహా మొత్తం 13 ఒప్పందాలతో ప్రపంచంలో 200 కోట్లమందితో కూడిన ఒక విస్తారమైన ఉమ్మడి మార్కెట్ ఆవిర్భవించడంతోపాటు ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో నాలుగో వంతు మార్కెట్ ('25 శాతం)గా నమోదు కానున్నది. అమెరికా-యూరోపియన్ యూనియన్ మధ్య ఆర్థిక, ప్రాదేశిక, రక్షణ భద్రతాపరమైన అంశాల్లో తీవ్ర ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో ప్రత్యామ్నాయ కృషిలో భాగంగా కుదిరిన ఈ ఒప్పందం యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. 27 దేశాల యూరోపియన్ యూనియన్ కూటమి-భారతదేశం మధ్య రాబోయే ఐదు సంవత్సరాలకుగాను ఒక ఉమ్మడి సమగ్ర వ్యూహాత్మక ఎజెండా అమలు చేస్తారు. నిబంధనలతో కూడిన ప్రపంచక్రమాన్ని రూపొందించాలన్న దార్శనిక దృక్పథంతో భారత్-యూరప్ కూటమి మధ్య మొత్తం 13 ఒప్పందాలు కుదిరాయి.

ఈ ఒప్పందంతో రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు ఎయిర్‌క్రాఫ్ట్‌లు,స్పేస్‌క్రాఫ్ట్‌లు వంటి అనేక వస్తు సేవల ఎగుమతులపై ఎలాంటి టారిఫ్‌ల సమస్యలూ ఉండవు. ఉమ్మడి భద్రతా భాగస్వామ్యం నెలకుంటుంది. ప్రస్తుతం మోటారు వాహనాలపై హెచ్చుమోతాదులో ఉన్న టారిఫ్‌లు క్రమంగా తగ్గిపోతాయి. యూరప్ నుండి వచ్చే వైన్, బీరు, ఆలివ్ ఆయిల్‌లపై భారతదేశం సుంకాల్లో కోత పెడుతుంది. భారత్ నుండి



ఎగుమతి చేసే టెక్స్‌టైల్, లెదర్, సముద్ర ఉత్పత్తులు, హస్తకళా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలపై సుంకాలు ఉండవు. టీ, కాఫీ, సుగంధ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్‌లకు ఒప్పందంతో ప్రయోజనం కలుగుతుంది. పాల ఉత్పత్తులు, పప్పులు, కోళ్ల పరిశ్రమ, కొన్ని పండ్లు, కూరగాయలకు రక్షణలు ఉంటాయి. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య వృత్తి నిపుణుల స్వల్పకాలిక ప్రయాణాలపై కూడా ఆంక్షలు సడలిస్తారు.

**మదర్ ఆఫ్ ఆల్ డీల్స్**

**ప్రపంచ సుస్థిరతకు ఇదొక కొత్త నమూనా**

ఒప్పందం అనంతరం ఢిల్లీలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఉర్సులా వోండర్ లేయన్ మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని అన్ని ఒప్పందాలకు కేంద్ర బిందువుగా "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్"గా అభివర్ణించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ సహకారం ఉత్తమ సమాధానం అన్నారు. "మేం ఒప్పందం చేసుకున్నాం, అన్ని ఒప్పందాలకు కేంద్ర బిందువులాంటి ఒప్పందం చేసుకున్నాం, 200 కోట్ల మంది ప్రజలకు ఒక మార్కెట్‌ను సృష్టించాం అన్నారు. ఇది రెండు మహా వ్యవస్థల గాథ, ప్రపంచంలో రెండవ, నాలుగవ ఆర్థిక వ్యవస్థలు చేసుకున్న ఒప్పందం, ఈ రెండు వ్యవస్థలు భాగస్వామ్యాన్ని ఎంచుకున్నాయి, ఇది ప్రపంచానికి ఉత్తమ సందేశం అని ఉర్సులా చెప్పారు. యూరోపియన్ యూనియన్ చేసే ఎగుమతులకు ఏటా చెల్లించాల్సిన సుంకాలలో 400 కోట్ల యూరోలమేరకు ఒప్పందం వల్ల కోత పడుతుందని అన్నారు. భారత్, యూరప్ దేశాలలో అనేక లక్షల మంది కార్మికులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. "ఈ రెండు వ్యవస్థలూ కేవలం ఆర్థిక వ్యవస్థలను మాత్రమే బలోపేతం చేసుకోవడంలేదు, ప్రస్తుత అభద్రతా ప్రపంచంలో ఇరు దేశాల ప్రజలకు భద్రత కూడా ఇస్తున్నాం, ఈనాడు ప్రపంచంలో రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలు మొదటిసారి భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని ప్రారంభించాయి" అని చెప్పారు.

యూరోపియన్ యూనియన్ ఒక కూటమి, భారతదేశం ఒక అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇయుతో భారతదేశ వస్తు వ్యాపారం 136 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఎగుమతులు 76 బిలియన్లు, దిగుమతులు 60 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఒప్పందాన్ని చరిత్రాత్మకమైనదిగా పేర్కొన్నారు. ఆంటోనియో కోస్టా మాట్లాడుతూ, పురాతన అనుబంధంగల భారత్-యూరప్ మధ్య ఈనాడు కుదిరిన ఒప్పందం చరిత్రాత్మకమైనదని, ఈ ఒప్పందం ప్రపంచ శ్రేయస్సు కోసమేనని అన్నారు. పత్రికాగోష్ఠిలో మోదీ మాట్లాడుతూ, ప్రపంచ క్రమం ఇప్పుడు పెద్ద గందరగోళంలో పడిందని, ఇలాంటి పరిస్థితుల్లో భారత్-యూరోపియన్ యూనియన్ భాగస్వాములు అంతర్జాతీయ వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూరుస్తారన్నారు. "ఈనాడు భారతదేశం చరిత్రలోనే అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేసింది, ఈ ఒప్పందంతో భారతదేశ రైతులకు, చిన్న పరిశ్రమలకు కొత్త ద్వారాలు తెరచుకుంటాయి, తయారీ రంగంలో సరికొత్త అవకాశాలు వృద్ధి చెందుతాయి, సేవారంగంలో కొత్త అవకాశాలు పుట్టుకువస్తాయి, సరికొత్త, భాగస్వామ్యాలను పెంపొందిస్తాయి, ప్రపంచవ్యాప్తంగా సరఫరాల వ్యవస్థ పటిష్టవంతమవుతుంది, దీని అర్థం ఏమిటంటే, ఇది కేవలం ఒక ఒప్పందం మాత్రమే కాదు, అంతర్జాతీయ వ్యవస్థను సుస్థిరీకరిస్తుంది, ఉమ్మడి సంపద వృద్ధికి, ప్రగతికి ఇదొక సరికొత్త నమూనా ప్రణాళిక" అని నరేంద్రమోదీ అన్నారు.

ఆంటోనియో కోస్టా మాట్లాడుతూ, ఈ ఒప్పందంకోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నామన్నారు. ఉమ్మడి సంపద సృష్టికి ఈ రెండు వ్యవస్థలు భాగస్వామ్యంగా ఉంటాయన్నారు. ఐతే భద్రత లేకుండా సంపద సృష్టి,ప్రగతి సాధ్యం కాదన్నారు. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య భాగస్వామ్య సహకారం ప్రపంచ శ్రేయస్సుకోసమేనన్నారు. ఆయుధాలతో యుద్ధం చేస్తే శాంతి రాదని అన్నారు. నిరాయుధంగా దేశాలు జీవిస్తేనే న్యాయం చేకూరుతుందన్నారు. ఉక్రేన్‌లో శాంతి రావాలని తమ సదస్సు ఉద్ఘాటించిందని ఆయన చెప్పారు. ఉక్రేన్‌లో శాంతి సాధనకు ఇదే సరైన సమయమన్నారు. మొత్తం 18 సంవత్సరాలపాటు చర్చల కృషి జరిగిన తర్వాత ఈనాడు తుది ఒప్పందం కుదిరింది. 2007లో ఈ చర్చలు ప్రారంభమయ్యాయి, మధ్యలో కొంత చాలా విరామం వచ్చింది, ఆ తర్వాత 2022లో మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. సొంత మిత్రులపైనే విరుచుకుపడి, తన మన భేదాలు మరచిపోయిన ట్రంప్ కారణంగా ఈ ఒప్పందం మళ్ళీ శరవేగంగా ప్రాణం పోసుకుని కొత్త చరిత్ర రాసింది. ఇరు పక్షాలు సంతకాలు చేసి ఈ క్రమాన్ని పూర్తి చేయడానికి లాంఛనాలు పూర్తి చేయడానికి ఆరు నెలలు సమయం పడుతుందని పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది.

రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, స్పేస్‌క్రాఫ్ట్ వంటి చాలా ఎగుమతులపై సుంకాలుండవు. పైగా 2.50 లక్షల కోటా వాహనాలపై ప్రస్తుతం ఉన్న 110 శాతం సుంకాలు 10 శాతానికి తగ్గిపోతాయి.

## వాటా పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

అమాయక గిరిజనులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆక్షేపించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పార్లమెంటు, ప్రజల ముందర ఉంచాలని, పారదర్శకతకు, జవాబుదారీతనానికి హామీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ఎస్‌ఐఆర్)... ఓట్ల తొలగింపు ప్రక్రియగా మారిపోయిందని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్యంలో పాలకులను ఓటర్లు ఎన్నుకుంటారు కానీ మన దేశంలో అందుకు విరుద్ధంగా ఓటర్లను పాలకులు ఎంపిక చేసుకుంటున్నారు. ఎన్నికల సంఘం... నిర్మూలన కమిషన్‌గా వేగంగా మారిపోతోంది' అని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం విధించిన ఆంక్షలతో రూ.21వేల కోట్లకుపైగా ఉన్న తీవ్రమైన వనరుల వ్యత్యాసాన్ని తగ్గించేందుకుగాను కేరళ రాష్ట్రానికి ప్రత్యేక కరువు ప్యాకేజిని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుందుడుకు చర్యలనుగానీ వెనిజులా, గ్రీన్‌లాండ్ స్వాధీనానికి బెదిరింపులు వంటి అంతర్జాతీయ పరిణామాలను వ్యతిరేకించే స్థితిలో లేకపోవడం మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని నీరుగారుస్తోందని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్ల వేతనాలు తక్షణమే పెంచాలని ఆయన సీపీఐ తరపున మరోమారు డిమాండ్ చేశారు. వేతన చెల్లింపుల్లో జాప్యంకేటాయింపుల్లో కోతలు, పని దినాల్లో తగ్గింపు వంటివి గ్రామీణుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతిస్తున్నాయన్నారు. వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం దృష్ట్యా ఉపాధి కల్పించే కీలక యంత్రాంగంగా ఎంఎన్‌ఆర్‌ఈజీఏ ఉన్నదని, దీనిని తక్షణమే తిరిగి అమల్లోకి తేవాలని సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు.

## నిర్మాణాత్మక చర్చ జరపాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వెనక్కి తీసుకోదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టం చేశారు. పార్లమెంట్ ఇప్పటికే దేశం ముందు ఉంచిన చట్టాలపై 'రివర్స్ గేర్' చేయలేమని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రధాన దృష్టి బడ్జెట్‌పైనే ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా సభ్యులు ఇతర అంశాలను లేవనెత్తవచ్చని పేర్కొంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జెపి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజుతో సహా పలువురు సీనియర్ మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుండి వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన శాసన సభ ఎజెండాను ప్రభుత్వం ఇవ్వకపోవడంపై కాంగ్రెస్, సిపిఐ(ఎం)తో సహా ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. దీనికి ప్రతిస్పందిస్తూ, ఎజెండాను తరువాత పంచుకుంటామని రిజిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సభ్యులు ఈ అంశాలపై చర్చించవచ్చని ప్రభుత్వం సూచించగా, సంబంధిత మంత్రుల సమాధానాలను అనుమతించే నిర్మాణాత్మక చర్చలను కోరుతూ సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ధన్యవాద తీర్మానం సందర్భంగా చర్చలు పరిమితంగా ఉన్నాయని, ప్రతిపక్షాల వివరణాత్మక చర్చ డిమాండ్‌ను తీర్చలేవని ఆయన వాదించారు. సమావేశం అనంతరం కిరణ్ రిజుజు మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటరీ నిబంధనల ప్రకారం బడ్జెట్ సమావేశాల్లో చర్చలు ప్రధానంగా బడ్జెట్ చుట్టూనే ఉండాలని అన్నారు. 'అఖిలపక్ష సమావేశంలో చాలా మంది సభ్యులు అనేక అంశాలను లేవనెత్తారు. మేము వాటిని గమనించాము. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సమయంలో, బడ్జెట్ చర్చల సమయంలో కూడా వివిధ అంశాలను లేవనెత్తవచ్చని నేను సభ్యులకు తెలియజేశాను. ఇది బడ్జెట్ సెషన్ కాబట్టి, ప్రధాన దృష్టి బడ్జెట్‌పైనే ఉంటుంది' అని ఆయన అన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన తర్వాత, ధన్యవాద తీర్మానం ప్రవేశపెడతామని, అందులో అన్ని పార్టీలు పాల్గొంటాయని ఆయన అన్నారు. సూచనలను వినడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని రిజిజు అన్నారు. డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), వామపక్ష పార్టీలకు చెందిన అనేక మంది ప్రతిపక్ష ఎంపిలు ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో 'సర్'పై వివరణాత్మక చర్చను డిమాండ్ చేశారు. అయితే, ఈ అంశంపై మరో చర్చను రిజిజు తోసిపుచ్చారు. గతంలో రెండు సభలలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చల సమయంలో దీనిపై విస్తృతంగా చర్చించామని అన్నారు. ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను పరిష్కరించడానికి ఉద్దేశించిన యుజిసి కొత్త నిబంధనల గురించి కూడా పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని వర్గాలు తెలిపాయి. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షిరామ్) అధ్యక్షుడు, ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ కొత్త మార్గదర్శకాలను సమర్థించారు. పెరుగుతున్న వివక్ష సంఘటనలకు ప్రతిస్పందనగా అవి రూపొందించబడ్డాయని చెప్పారు. ఓట్ల దొంగతనం, సర్, రైతుల వరి సేకరణ, ఎంజి నరేగా పునరుద్ధరణ వంటి అంశాలను తమ పార్టీ లేవనెత్తుతుందని కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ అన్నారు. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయాల దుర్వినియోగంపై చర్చ జరగాలని డిఎంకె, టిఎంసి, వామపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేశాయని వర్గాలు తెలిపాయి. అయితే టిడిపి అమరావతి రాజధాని బిల్లు అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతుందని తెలిపింది. భారత్-ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు, 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని కూడా పార్టీ కోరుకుంటున్నట్లు పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. భారత విదేశాంగ విధానంపై సమగ్ర చర్చ అవసరంపై ప్రతిపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉందని సిపిఐ(ఎం) నాయకుడు బ్రిట్టాస్ అన్నారు.

## నామినేషన్లు (మొదటి పేజీ తరువాయి)



అలాగే కార్పొరేషన్‌ల మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,996 వార్డులకుగాను సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 16,031 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. ఎన్నికల భద్రతపై లా అండ్ ఆర్డర్ అదనపు డిజి మహేశ్ భగవత్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కఠిన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. 1,926 సెన్సిటివ్, 1,300 అత్యంత క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. నిర్మల్, భైంసా, బోధన్, నిజామాబాద్ ప్రాంతాల్లో కమ్యూనల్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో రూ.50 వేల వరకు నగదు మాత్రమే అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఉంటే రసీదులు తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెబ్ కాస్టింగ్, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు తనిఖీల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు.




## తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 2026 క్యాలెండర్‌ను ఛత్రినాక చౌరస్తాలో ఉప్పుగూడ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కర్ణటి యాదయ్యగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.12 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో గీత కార్మికులకు ఉన్న సొసైటీలను 1/70 చట్టం కింద రద్దు చేసిన హక్కులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ఉద్యమ నిర్మాత బొమ్మగాని ధర్మ భిక్షం గౌడ్ మార్క్సిజం, లెనినిజం, కమ్యూనిజం సైద్ధాంతిక పునాదిగా స్థాపించి 1957లో ఉద్యమాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాపర్తి నరసింహ గౌడ్, బుడ్డోలం శ్రీశైలం గౌడ్, రవీందర్ గౌడ్, కొప్పుల మహేందర్ గౌడ్, లైనోల రవీందర్ గౌడ్, గడ్డమీది సుశీల గౌడ్, గడ్డమీది హరినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల హక్కులను కాపాడుతాం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగస్తుల హక్కులను కాపాడుతామని, ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు పరిరక్షిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్‌ను డాక్టర్ చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా మైనారిటీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి అవి అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫరూక్ హుస్సేన్, కార్యదర్శి డాక్టర్ వహీద్‌షా ఖాద్రి, కోశాధికారి ఎం.ఎ.రషీద్, నాయకులు జావేద్ అహ్మద్, తక్షుద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్సీ తక్కళ్లపల్లికి జరిగిన అవమానంపై

## చర్యలకు మండలి చైర్మన్‌కు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎబిఎన్ డిబేట్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావుకు జరిగిన అవమానంపైన చర్యలు తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మదుసూదనచారి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్.రమణ,నవీన్ కుమార్‌రెడ్డి బృందం శాసన మండలి చైర్మన్ కార్యాలయంలో గుత్తాసుఖేందర్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుసూదనచారి మాట్లాడుతూ రవీందర్ రావు పై జరిగిన దాడిని శాసనమండలి సభ్యులపైన జరిగిన దాడిగా బావించి తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరారు. భవిష్యత్ లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

## బిఆర్‌ఎస్, బిజెపి స్కాముల పార్టీలు

### తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతి కోసం పనిచేసే స్కీంల పార్టీ అయితే, బిఆర్‌ఎస్, బిజెపిలు పారిశ్రామిక వేత్తలకు దొచిపెట్టే స్కాముల పార్టీ అని తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీలో నటులు ఎక్కువయ్యారనీ, కవులు, కళకారుల నాటకాలకు ప్రస్తుతం రవీంద్రభారతీ వేదికగా ఉందని, ఆ తర్వాత స్థానం తెలంగాణభవన్‌కే దక్కుతుందని చురకలు అంటించారు. రవీంద్రభారతిలో సభ వేదిక అందుబాటులో లేకపోతే, తెలంగాణ భవన్‌కి వెళ్లాలని సూచించారు. రానున్నరోజుల్లో తెలంగాణభవన్‌లో రాజకీయాలు వదిలిపెట్టి, నాటకాలు వేసుకోవాలని కెటిఆర్, హరీష్‌రావులకి సూచించారు. బిఆర్‌ఎస్ హయంలో పదేళ్లు రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం అమలులో ఉందని, న్యాయం కోసం నిరసన చేస్తే అరెస్టులు ఉండేవని, వీళ్ళు రాజ్యాంగం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ నేతల అబద్ధాలు రాస్తే రామకోటి, చెప్పుకుంటే పోతే భగవద్గీత అంత ఉంటుందని సాయికుమార్ విమర్శించారు.



### కుంభకోణాలను అడ్డుకోవాలని

## గవర్నర్‌కు బిఆర్‌ఎస్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి ఒబి గనులు, సోలార్ పవర్ కుంభకోణాలను అడ్డుకోవాలని, ఈ రెండు వ్యవహారాలలో జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు గవర్నర్‌ను కోరారు. కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ఫిర్యాదు చేసింది. సింగరేణి కుంభకోణం జరిగిందని, ఈ వ్యవ హారంలో జోక్యం చేసుకోని విచారణకు ఆదేశించాలని గవర్నర్‌ను కోరింది. సమావేశనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ సింగరేణి కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ పేరుతో నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ల విషయంలో గతంలో ఎన్నడూ లేని 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అంటే సైట్ మీదకు రావాలని, అక్కడికి వచ్చినట్టుగా సర్టిఫికెట్ తీసుకోవాలనే నిబంధన పారదర్శకతకు పాతరవేసి, ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. భారత దేశంలో ఎక్కడ ఏ కోల్, బొగ్గు గనిలో లేని నిబంధనను ఇక్కడనే ఎందుకు విధించారన్నారు. దీనికి సంధించి ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తే ఇప్పటి వరకు విడుదల చేయలేదని కెటిఆర్ మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితాఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనచారి, ఎంపి రవి చంద్ర, ఎమ్మెల్సీలు వాణి దేవి, ఎల్.రమణ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల వేలం అడ్డుకుంటాం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ భూములను వేలం వేస్తే వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలతో కలిసి అడ్డుకుంటామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వామపక్ష, ఇతర పార్టీల, ప్రజా సంఘాల హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వామపక్ష, డెమోక్రటిక్ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన గత పది సంవత్సరాలలో వరంగల్ మహానగరంలో అనేక సంవత్సరాల నుండి ప్రజలు కాపాడిన ప్రభుత్వ భూములలో కబ్జాలు చేయడం, పార్టీల భవనాలు కట్టడం, నాయకులే తీసుకోవడం జరిగిందని, కుడా ద్వారా నిర్మించిన కాంప్లెక్స్ (బస్టాండ్ వద్ద) రిలీజ్ ఇవ్వడం మొదలగు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు జరిగాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వ భూములను రక్షించాలని, గత పాలకులు చేసిన తప్పుడు లీజులను రద్దు చేయాలని, ప్రభుత్వ భూములు, కుడా భూముల అమ్మకాలను నిలిపి వేయాలని, రాబోవు తరాలకు ప్రజల అవసరాలకు ఉండేలా పకడ్బందిగా హద్దులు ఏర్పాటు చేసి రక్షించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. బాలసముద్రంలో పార్కులో నిబంధనలు ఉల్లంఘించి బిఆర్‌ఎస్ కార్యాలయానికి అక్రమంగా నిర్మాణం చేశారన్నారు. బాలసముద్రంలో ఉన్న మరికొన్ని పార్కుల స్థలాలను చుట్టూ ఉన్న రోడ్లను కూడా కబ్జా చేస్తున్నారన్నారు. కూరగాయల మార్కెట్ దగ్గర ఖాళీ ప్లాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ దగ్గర, మరో ఖాళీ ప్లాటు అన్యాక్రాంతమైనట్లు ఉందన్నారు.



ప్రజల భూములు మాయమై పోతున్నాయని, కొత్త బస్టాండ్ దగ్గర కూడా కాంప్లెక్స్ నిర్మాణం చేసి నాయకులకు కారు చౌకగా లీజుకి ఇచ్చినారని, ఈ లీజులకు అంతం లేదని అన్నారు. సుప్రభా హోటల్, చెన్నై మాల్ వెనుక భాగంలో పార్క్ రోడ్డును ఆక్రమించినట్లు ఉందని, మిగిలిన స్థలాన్ని కూడా నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమించి, కబ్జాదారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలుస్తున్నదన్నారు. గత పాలకులు 500 మంది ఆర్టీసీ కార్మికులు పనిచేస్తున్న టైర్ రీట్రేడింగ్ కంపెనీని మూసివేసి కార్మికులను కరీంనగర్ కు బలవంతంగా బదిలీ చేసి ఆనాటి నాయకులు ఈ 5 ఎకరాల స్థలాన్ని 99 సంవత్సరాల సుదీర్ఘ కాలం లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. వడ్డేపల్లి బతుకమ్మ కుంట ప్రభుత్వ భూమి, అది ఇటీవల మాయమై పోతున్నదని, అక్కడే ఉన్న దశాబ్దాల నుండి ఉన్న స్మశాన వాటిక ప్రభుత్వ భూమి అక్రమార్కుల ఆకలికి మాయమైపోయిందన్నారు. వరంగల్ మహానగరంలో 200 పైన చెరువులు, కుంటలు ఉండేవి. ఇవి కూడా కబ్జాలకు గురైనాయని,తక్షణమే చెరువు, కుంటలు ఎఫ్.టి.ఎల్. హద్దులు నిర్ణయించి, చెరువు కుంటలను కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. "కూడా" మునిసిపాలిటీ అధికారులు నగరంలో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వే చేసి కాంపౌండ్లు పెట్టి రక్షించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షుడు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలంకు, లీజులకు తెర లేపిందని, వీటన్నింటిపై విచారణ చేపట్టామని, వాటిపైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న ఇండ్ల స్థలాలకు ప్రభుత్వం తరుపున న్యాయం చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకై ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పార్లమెంట్ నియోజక వర్గ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్ రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, కాంగ్రెస్ నాయకులు రాయపురం సాంబయ్య, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ కన్వీనర్ పుల్లూరు సుధాకర్, ప్రజా వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ తిరునగరి శేషు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




### ప్రజల ప్రాణాలు కాపాడడంలో

## హైడ్రా పాత్ర అభినందనీయం

### సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర ఆస్తులు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడంలో హైడ్రా పోషిస్తున్న పాత్ర అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ట్విట్టర్ వేదికగా ఓక ట్విట్ చేశారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు నగర సౌందర్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఆయువుపట్టులైన చెరువుల రక్షణ, పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆలోచనలను హైడ్రా ఆచరణలో పెడుతోందన్నారు. ఆ క్రమంలో మీర్ ఆలం చెరువు పునరుద్ధరణ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న పలువురు ఇంజనీర్లు, కార్మికులు అనుకోని ఆపదలో చిక్కుకోగా రంగంలోకి దిగి, వారి ప్రాణాలను కాపాడిన హైడ్రా సిబ్బందికి సిఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### సింగరేణి కార్మికుల

## సంక్షేమానికి పెద్దపీట

### డిప్యూటీ భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల కోసం తాజాగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఉద్యోగుల మారుపేరు అంశానికి సంబంధించి త్వరంగా పరిష్కారిస్తామన్నారు. అదేవిధంగా మెడికల్ ఇన్వాల్యుయేషన్‌లో వాళ్లకున్న జబ్బులకు సంబంధించి బోర్డులోఉన్న అన్ని విధాల పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కోల్ ఇండియ నిబంధన మేరకు సింగరేణిలో అధికారుల సంబంధించిన అన్ని సౌకర్యాలను భరిస్తుందో అదేవిధంగా సింగరేణి కార్మికులకు కూడా అన్ని సౌకర్యాలు (టాక్స్) కల్పించడం కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. సింగరేణి ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడానికి ఐఫోర్ కమిటీ నిర్ణయించి సహకారం చేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగులందరికీ దేశంలో ఎక్కడా లేని రీతిలోరూ.1.25 కోట్లతో కల్పించిన ప్రమాద బీమా సౌకర్యం దేశవ్యాప్తంగా ఒక నమూనా పథకంగా గుర్తింపు పొందిందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కోసం రూ.40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయడం జరిగిందని వెల్లడించారు. కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు.సింగరేణిలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2,539 పోస్టులను భర్తీ చేశామని, వీటిలో 798 ఎక్స్ టర్నల్ పోస్టులు ఉండగా... 1,741 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందనీ పేర్కొన్నారు. క్యాథ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా సింగరేణి ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. 2024–25 లో సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాలు (రూ. 6,394 కోట్లు) సాధించగా అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద కార్మికులకు రూ.802 కోట్లు, పొరుగు సేవల సిబ్బందికి రూ.5,500 చొప్పున లాభాల వాటా చెల్లించడం జరిగిందని తెలిపారు.

### రెవెన్యూ వ్యవస్థలో

## సమూల మార్పులకు శ్రీకారం

### మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన అత్యుత్తమ సేవలను అందించడమే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత 10 ఏళ్లలో ఆనాటి పాలకుల స్వార్ధపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని విమర్శించారు.ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామన్నారు. అ భవన నిర్మాణంతో పాటు 5ఏళ్లు నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువుశంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

## చదువుతోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి కోమటిరెడ్డి

### రూ.8 కోట్లతో బొట్టుగూడ పాఠశాల నిర్మాణం



**ప్రజాపక్షం/నల్లగొండ :** అవకాశం ఉంటే విద్యాశాఖ మంత్రిగా కార్పొరేట్ పాఠశాలలను మూసివేయాలని ఉందని, విద్యను కార్పొరేట్ చేసేసి వ్యాపారం చేస్తున్నారని అందరి పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తేనే విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 8కోట్లకు పైగా వ్యయంతో జిల్లా కేంద్రంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎలాంటి వసతులు లేకుండా నిర్వహిస్తున్న బొట్టు గూడ పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టి, 2500 గజాల స్థలంలో అన్ని అత్యాధునిక వసతులతో బొట్టుగూడ ప్రాథమిక,ఉన్నత పాఠశాలను నిర్మించడం జరిగిందని, పేదవాడు చదువుకోవాలని, చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని మంత్రి అన్నారు. సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా ఒక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా వాల్డాఫ్ విద్యా విధానాన్ని ఈపాఠశాలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. పాత సిలబస్‌తో పాటు, సిబిఎస్ఇ కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ బొట్టు గూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్ష్యులు హఫీజ్ ఖాన్,ప్రతీక ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీని సందర్శించిన జపాన్ బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్ దేశంలోని అయిచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యులతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫోరం బృందం తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. ఫోరం చైర్మన్ హిరిహితో కోండో, తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎంఎల్‌ఏల బృందానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి అధికారులు స్వాగతం పలికారు. స్పీకర్ ఛాంబర్‌లో సమావేశమై తెలంగాణ అయిచి రాష్ట్ర సభ్యుల బృందం, వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు. భారతదేశం జపాన్ దేశాల మధ్య మొదటి నుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని స్పీకర్ ప్రసాద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవన్నారు. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలిలో 40 మంది సభ్యులు ఉన్నారని, శాసనసభ సభ్యులను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారని వివరించారు. తెలంగాణ శాసనసభలో చర్చలు అర్థవంతంగా జరుగుతున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

# సర్టిఫికెట్లు సమర్పించాలని 'సర్' వేధింపులు

### బతుకు దెరువు కోసం వలస వెళ్లినవారే బిజెపి ప్రభుత్వ లక్ష్యం

### ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పెషల్ ఇన్‌సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బతుకు దెరువు కోసం వలస వెళ్లిన వారిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ విమర్శించారు. చనిపోయిన తమ తండ్రి బర్త్ సర్టిఫికెట్లు సమర్పించాలని కొర్రీలు పెడుతూ మహిళలను వేధిస్తున్నారని మండిపడ్డారు. జీవించే హక్కు కోసం భవిష్యత్తులో ఐద్వా పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభల మూడవ రోజు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుందరరామన్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి మహిళలపై దాడులను తీవ్రతరం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని నిరూపించుకునే విధంగా డాక్యుమెంట్లను సమర్పించాలనే నిబంధనలు పెట్టడాన్ని తప్పుపట్టింది. 'సర్' పేరుతో బీహార్‌లో ఎన్నికలకు ముందు 65 లక్షల మంది ఓట్లను తొలగిస్తే అందులో 45 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారన్నారు.వాతావరణ మార్పుల ప్రభావం మహిళలను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నదని, అనేకసార్లు ప్రకృతి విపత్తుల కారణంగా మహిళలకు నివసించేందుకు చోటు కూడా లభించని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసం అనేక రాష్ట్రాల్లో అడవులను నరికేస్తుంటే వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవించి, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, తద్వారా స్వచ్ఛమైన గాలి, తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయన చెప్పారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి, మహిళల బతుకులపైన బిజెపి దాడి చేస్తోందన్నారు.కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ అభయ హస్తం పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలు పొదుపు చేసిన రూ.600 కోట్లను తిరిగి బాధితులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. విబిజిరామ్‌జి చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

## పలు తీర్మానాలు ఆమోదం

ఐద్వా మహాసభ మూడవ రోజు పలు తీర్మానాలను ఆమోదించింది. ఉన్నత విద్యను కాషాయీకరణ, వాణిజ్యీకరణ, కేంద్రీకరణకు వ్యతిరేకంగా,మహిళా వ్యతిరేక కార్మిక చట్టాలు. జాతీయ కార్మిక విధానం 2025ను రద్దు చేయాలని, మహిళలకు సురక్షితమైన సరసమైన రుణ హక్కు ఉండాలని, మహిళల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాధించిన విజయాలను అభినంధిస్తూ, పర్యావరణ క్షీణతను ప్రతిఘటించాలని, ఆదివాసీల హక్కులపై దాడిని వ్యతిరేకించాలని, దళిత మహిళలకు సమానత్వం, గౌరవం, న్యాయం కల్పించాలని, పాఠశాలల విలీనం, మూసివేతకు వ్యతిరేకంగా ఐద్వా మహాసభ తీర్మానం చేసింది.



## దివ్యాంగులకు ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్సీ సత్యంతో కలసి ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు:** దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ నుండి వికలాంగులకు మునుగోడు నియోజక వర్గానికి మంజూరైన 6 టీవీఎస్ జుపిటర్ స్కూటీలు,నాలుగు బైసైకిళ్లను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరి మీద ఆధారపడకుండా తమ స్వశక్తితో ఆత్మస్థైర్యంతో బతకాలని అన్నారు.దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సహాయక సహకారాలు అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు,నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. మంగళవారం తెలంగాణ దివ్యాంగుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్స్, ఎలక్ట్రికల్ మోటార్ త్రీ వీలర్స్ బైక్స్‌ను, హెల్మెట్లను వారు పంపిణి చేసి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల, వయోవృద్ధుల సాధికారక శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూతనందించేందుకు ఈ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రేఖల మమత తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపుసాధించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేములవీరేశంఆకాంక్షించారు. మంగళవారం నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన స్కూటీలు, ల్యాప్‌టాప్‌లను అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు ఆయన పంపిణీచేశారు.ఈసందర్భంగాఆయనమాట్లాడుత్తూదివ్యాంగుల విద్యా ప్రోత్సాహం,ఉపాధి అవకాశాల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిపిఎం మోహన్ రెడ్డి,ఎంపీడీవోవెంకటేశ్వర రావు ,ఐసిడిఎస్‌సిడి పిఓ అస్రా అంజుమ్,ఎంఈఓ మేక నాగయ్య, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య పాల్గొన్నారు.

## 30 నాటికి పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు నమోదు : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 30 నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరూ పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు నమోదయ్యేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ లతో పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు, ఇంజనీరింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం,మరుగుదొడ్ల నిర్మాణానికి పనులను ఆయా ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందని,త్వరితగతిన పనులు పూర్తి చేసే బాధ్యత ఎంఈఓ లపై ఉందన్నారు. ఈ ఏడాది మార్చి8 వరకు ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్దిష్ట గడువులోపు పూర్తిచేయాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్,ఆర్అండ్‌బి ఈఈ.శ్రీధర్ రెడ్డి,ఈడబ్ల్యుడిసి ఈఈ బాల ప్రసాద్ హాజరయ్యారు.

## డయేరియా కేసులు పూర్తయ్యే వరకూ శిబిరం: కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మోతె మండలం సిరికొండ గ్రామంలో డయేరియా కేసులు పూర్తిగా నివారించే వరకు ఆరోగ్య శిభిరం నిర్వహించాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. జడ్‌పి సిఈఓ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పెండెం వెంకటరమణ, తహశీల్దార్ వెంకన్న, ఎంపిడిఓ ఆంజనేయులు, మెడికల్ అధికారి భవాని, ఆర్‌డబ్లుఎస్ అధికారులు, పంచాయితీ కార్యదర్శి భూలక్ష్మి లతో కలెక్టర్ ఛాంబర్ నుండి మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయితీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది 24/7 విధుల్లో ఉండాలని ఆదేశించారు. వ్యాధుల వ్యాప్తిని అడ్డుకునేందుకు స్వచ్ఛమైన త్రాగునీటి వినియోగం, పారిశుధ్య నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత అలాగే ముందస్తు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గత గురువారం రోజున సిరికొండ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విరోచనాలతో బాధపడుటను ఆశా కార్యకర్త గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం పిహెచ్‌సి మోతెకు పంపించి చికిత్స అందించారు. గత 3 రోజులలో 50 మందికి చికిత్సను అందించడం జరిగిందని, వీరంతా మిరపతోటలో పనికి వెళ్ళి అక్కడ కలుషితమైన నీటిని త్రాగడం వలన అస్వస్థతకు గురవటం గుర్తించామని, నీటి నమూనాలను పరీక్షల కొరకు పంపించడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కి వివరించారు. అధికారులు, గ్రామస్తులు సమన్వయం చేసుకుంటూ అస్వస్థతకు గురైన ప్రజలు త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు.

### రానున్న రెండేళ్లలో 30 లక్షల మంది

# నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలో రానున్న రెండు సంవత్సరాలలో 30 లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ మొదటి అంతస్తును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో చేపట్టిన న్యాక్ భవనాలలో నల్లగొండ న్యాక్ మొదటిదని తెలిపారు. న్యాక్ కేంద్రం ద్వారా వివిధ రకాల కోర్సులలో ముఖ్యంగా ఎలక్ట్రీషన్, ప్లంబర్ , మెకానిక్, వెల్డర్, డెకరేషన్, కార్పెంటర్, సి సి టీవీ, కంప్యూటర్ తదితర విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,రాబోయే కాలంలో మరిన్ని కోర్సులలో శిక్షణను ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్మిక శాఖ కారంతో న్యాక్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో 84 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ను ఇదివరకే ప్రారంభించుకోవడం జరిగిందని,రూ.5కోట్ల లతో వివిధ రకాల కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు సెట్విన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రపతి ద్వారా అవార్డు పొందిన ఇన్స్ట్రక్టర్ స్నేహలతను శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ద్వారా నిర్మాణ రంగంలో జిల్లా యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. న్యాక్ డిజిఎం నాయక్, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, న్యాక్ ఇంజనీరింగ్ అధికారులు,ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.





## ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బ్యాంకింగ్ రంగంలో వారంలో ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని నల్లగొండ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి కత్తుల ఈశ్వర్ కుమార్ డిమాండ్ చేశారు.యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఎస్‌బిఐ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వారంలో ఐదు రోజుల పని దినాల విధానంను అమలు చేయాలనే న్యాయమైన డిమాండ్ సాధనకై చేపట్టిన దేశవ్యాప్త స్ట్రైక్‌కు బ్యాంకు ఉద్యోగులు నిరసన పాల్గొని సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు సుమన్, శ్రమీక్, రాజశేఖర్, అలీముద్దీన్, యాదయ్య,,జీవన్, నర్సింహా, దిలీప్, ప్రవీణ్, రాజు, శివ,ప్రియాంక, సంధ్య, సతీష్ రెడ్డి, యుగేందర్,రామ్మోహన్, శ్రవణ్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మునిసిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్‌నేత , దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో జరగబోయే దేవరకొండ మునిసిపల్ ఎన్నికల్లో 20కి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలవాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన త్వరాత సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని, ఆర్థికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ మునిసిపాలిటి పరిధిలో ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని, ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ప్రజల ఆశీర్వాదంతో రానున్న మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంజూరైన స్కూటీలు, వీల్ చైర్లు, స్మార్ట్ ఫోన్లను దివ్యాంగులకు, వికలాంగులకు మంత్రి చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అన్ని సీట్లు కాంగ్రెస్ కైవసం



### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపాలిటీ సాధారణ ఎన్నికలలో నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీల వార్డు కౌన్సిలర్లు, చైర్మన్లు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో యాదవ కమ్యూనిటీ, 5వ వార్డులో బీసీ కమ్యూనిటీ భవనాలకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీల మౌలిక వసతులు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ దాదాపు రూ.50 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి వంద లీటర్ల మంచినీటిని పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ భవనాలు, ప్రజా అవసరాల ప్రతి ఒక్కటి తీర్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతమైన మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సహస్ర శతఘటాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ భూస్థాపితం ఖాయం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని, బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా భూస్థాపితం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడానికి బీఆర్ఎస్, బీజేపీలు అంతర్గత ఒప్పందం చేసుకున్నాయని చామల ఆరోపించారు. 'బీఆర్ఎస్ తన ఉనికిని పణంగా పెట్టి బీజేపీకి అవయవదానం చేసింది. ఎనిమిది స్థానాల్లో బీజేపీ గెలుపునకు సహకరించి, స్వయంగా గుండు సున్నా చుట్టుకుంది,' అని విమర్శించారు. కేసీఆర్ అహంకారంతో ఎన్నికలకు వెళ్లారని, కానీ ప్రజలు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనకు జై కొట్టారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్య అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయని ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావుల అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నారని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నా బయటకు తెలుస్తుందని కవిత చెప్పడం చూస్తుంటే, వారి కుటుంబంలో ఒకరిని ఒకరు ఓర్చుకోలేని పరిస్థితి ఉందని అర్థమవుతోంది. గెలుపుపై ధీమాతో 'ఓవర్ కాన్ఫిడెన్స్' ప్రదర్శించవద్దు. ప్రజలతో మమేకమై పనిచేయాలి. చివరగా, పదేళ్ల కాలంలో ప్రగతి భవన్ దాటని కేసీఆర్ పాలనకు, ప్రజల మధ్య తిరుగుతున్న రేవంత్ రెడ్డి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని' చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సిపిఐ మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం పగిళ్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ నెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాలయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతులు, త్రాగునీరు అండర్ గ్రౌండ్, డ్రైనేజ్, పారిశుధ్యం, సిసి రోడ్ల నిర్మాణం కోసం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమం నిర్వహించి అనునిత్యం ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రజా సమస్యల కోసం రాజీ లేకుండా, ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగ గకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వారిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, కొండూరు విప్లవ్, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, దాసరి మనోహర్, బోయ మంకులు, గుండె బోయిన భాస్కర్, నీల బిక్షపతి, దాసరి కృష్ణ, బెదరికోట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





## మాయమైపోతున్న మానవత్వం... డబ్బుల కోసం క్రూరత్వం!

### రూ.1300 కోసం మహిళ హత్య...
### అనంతరం మహిళ మెడలో బంగారం అపహరణ...
### ఇంటి వెనకాలే మహిళల పూడ్చివేత..

**ప్రజాపక్షం/హాలియా:** డబ్బుల కోసం మనిషి మానవత్వమే మరిచి మృగంలా మారుతున్నాడనే దానికి హాలియాలో రెండు రోజుల క్రితం జరిగిన వృద్ధ మహిళ హత్యనే అందుకు నిదర్శనం.నా అనేవారు ఎవరూ లేరు...కట్టుకున్న భర్త, కడుపున పుట్టిన పిల్లలు లేరు...కాటికి కాలు చాచిన వయసులోనూ శరీరం సహకరించుకున్నా...రెక్కాడితే కానీ డొక్కాడదని తెలిసిన ఆవృద్ధ మహిళ రోజు కూలి పనులకు పోయేది.వచ్చిన కొద్దో గొప్పో డబ్బులను దాచుకొని ఏదైనా చేతకాని సమయంలో ఆసరా అవుతాయని ఆశించింది...అలా ఆశించడమే ఆమె పాలిట యమపాశమైంది. ఇక విషయంలోకి వస్తే అత్యంత విషాదాంతమైన వృద్ధమహిళ హత్య హాలియాలో సంచలనగా మారింది. హాలియాకు చెందిన సుంకిరెడ్డి అనసూయమ్మ గత శనివారం అదృశ్యమైన సంగతి విధితమే.ఈఅదృశ్య మహిళ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన హాలియా పోలీసులు సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌లు తప్పిపోయిన అనసూయమ్మను కనిపెట్టేందుకు హాలియాలో గల సిసి ఫుటేజీలను పరిశీలించారు.ఇందులో శనివారం అనసూయమ్మ దేవరకొండ రోడ్డులో గల ధనలక్ష్మి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వెళ్లినట్లు కనిపించింది.అందులోకి వెళ్ళిన అనసూయమ్మ తిరిగి రాకపోవడంతో దీనిపై దృష్టి సారించిన పోలీసులు షాపు నిర్వహిస్తున్న చినపాక రాములు,ధనలక్ష్మి,గౌరీలను విచారించారు.ఈవిచారణలో అనసూయమ్మకు రూ.1300 ఇవ్వాలని తాము చేసిన అప్పులు తీరాలంటే అనసూయమ్మ మెడలో ఉన్న బంగారమే తమ సమస్యలకు పరిష్కారమని నిర్ణయించుకొని ఆమెను అంతమొందించినట్లు విచారణలో వారు వెల్లడించినట్టు తెలిసింది.ఒక వృద్ధ మహిళను మరొక మహిళ ధనలక్ష్మి హత్యలో భాగమై కత్తిపీటతో గొంతు కోసి అంతమొందించిన తీరు మనిషిలో మానవత్వం మాయమైపోతుందని రుజువు చేసింది.హాలియాలో సంచలనం రేపిన ఈ సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది.అనసూయమ్మను అంతమొందించిన ఆముగ్గురు తండ్రి,తల్లి,కొడుకులను మంగళవారం కోర్టుకు హాజరు పరచగా వారిని 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు సీఐ సతీష్ రెడ్డి తెలిపారు.






## ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగ వాణి కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించి వివిధ సమస్యల పై ఆర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని తెలిపారు.

# ఆశావహులకు టిక్కెట్ భయం



### కడుపుకు తిండి లేదు... కంటికి కునుకులేదు...

> **మున్సిపల్ ఎన్నికల్లో ఆయా పార్టీల నుండి పోటీ చేయాలనుకున్న ఆశావహులకు టిక్కెట్ భయం పట్టుకుంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగు వేయడంతోపాటు సర్వేల ఆధారంగానే టిక్కెట్లు కేటాయిస్తామని ప్రకటించడంతో తమకు టిక్కెట్ వస్తుందో రాదో అనే భయంతో కడుపు నిండా తిండి తినడం మానేయడంతో పాటు కంటి నిండి నిద్రపోకుండా దీని గురించే ఆలోచిస్తున్న పరిస్థితి.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం సాయంత్రం ప్రకటించింది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలు ఉండగా ఏ రాజకీయ పార్టీ కూడా నేటికి తమ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలబడే వార్డు అభ్యర్థులను నేటికి అధికారికంగా ప్రక టించలేదు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మున్సిపల్ పోరులో తమ పట్టును నిలుపు కునేందుకు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సర్వే ఆధారంగా టిక్కెట్లను కేటాయిస్తామని ముందే ప్రకటించి ఆశావ హుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తుంది. బిఆర్ఎస్ ప్రజాబలం, ఆర్థిక బలం ఉన్న వారిని పోటీలో నిలుపాలని చూస్తుంది. అధికార పార్టీలో ఒక్క వార్డుకు నలుగురి నుండి ఐదుగురు నాయకులు టిక్కెట్ కోసం పోటీపడుతుండగా ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్‌లో కూడా అదే పరిస్థితి ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా అభ్యర్థుల ఎంపిక ఖరారు కాకపోవడంతో టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు తమకు టిక్కెట్ వస్తుందో రాదో అనే భయం పట్టుకుంది. తమ పార్టీ అగ్రనేతల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతూ వేడుకుంటూనే ప్రచారంలో వెనుకపడితే నష్టంవస్తుందని మరోవైపు తాము పోటీ చేయాలనుకున్న వార్డులో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కడుపు నిండా తిండి తనకుండా రాత్రిపూట కంటి నిండా నిద్రపోకుండా టిక్కెట్ ధ్యాసలోనే గడుపుతున్న పరిస్థితి.

**టిక్కెట్ల కేటాయింపు నేటి నుండి కొలిక్కి వచ్చేనా?**

రాష్ట్ర ఎన్నికల కమీషన్ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో టిక్కెట్ల కేటాయింపు నేటి నుండి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతుంది. నామినేషన్ల దాఖలుకు ఎన్నికల కమీషన్ కేవలం నేటి నుండి మూడు రోజులు మాత్రమే గడువు పెట్టింది. దీంతో ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలో నిలిపే తమ అభ్యర్థుల పేర్లు వెంటనే ప్రకటించి బిఫామ్‌లు ఇవ్వకుంటే సమయాభావం వల్లే ఇబ్బంది పడే అవకాశం కూడా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీ లు కాలయాపన చేసే అవకాశం లేకుండాపోయింది.

## యాసిడ్ దాడుల వివరాలివ్వండి

### రాష్ట్రాలు, యుటిలకు 'సుప్రీం'ఆదేశాలు




**న్యూఢిల్లీ:** యాసిడ్ దాడుల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. యాసిడ్ దాడుల వివరాలను సంవత్సరాల వారీగా తమకు అందించాలని దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే చార్జిషీట్లు దాఖలైన కేసుల సంఖ్య గురించి కూడా సమాచారం అందించాలని కోరింది. కోర్టు స్థాయిలో విచారణలో ఉన్న, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య గురించి కూడా సమాచారం ఇవ్వాలని పేర్కొంది. 'హైకోర్టుల సహా అప్పీలేట్ కోర్టుల్లో దాఖలైన అప్పీళ్ల సంఖ్య గురించి సమాచారం అందించాలి. యాసిడ్ దాడి బాధితుల అర్హత, వైవాహిక స్థితి, చికిత్స, పునరావాసం వంటి వివరాలను అందించాలి. బాధితులను యాసిడ్ తాగమని బలవంతం చేసిన కేసుల వివరాలను సమర్పించాలి' అని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది.

## తిరోగమనంలో సంక్షేమం...పెరుగుతున్న అసమానత

### ఆర్థికస్థితిపై కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ:** దేశంలో సంక్షేమం తిరోగమనంలో ఉందని, అసమానత పెరుగుతోందని కాంగ్రెస్ విమర్శించింది. ఆర్థిక సర్వే విడుదల, కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతిస్తున్న సంఖ్యలను కాంగ్రెస్ ప్రశ్నించింది. ప్రతిపక్ష పార్టీ పరిశోధన విభాగం పార్లమెంటు బడ్జెట్ సమావేశానికి ఒక రోజు ముందు ఆర్థిక స్థితిపై ఒక నివేదికను విడుదల చేసింది. ప్రభుత్వం ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక సర్వే, కేంద్ర బడ్జెట్ ద్వారా తన ప్రచారాన్ని ప్రకటిస్తుంది కాబట్టి ప్రజల ముందు వాస్తవాలను బహిర్గతం చేయడం ముఖ్యమని పేర్కొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) పరిశోధన విభాగం చైర్మన్ రాజీవ్ గౌడ, పార్టీ సహోద్యోగి అమితాబ్ దుబేతో కలిసి పార్టీ ప్రధాన కార్యాలయం 'అసమానత పెరుగుదలలో, సంక్షేమం తిరోగమనంలో' ఆర్థిక వ్యవస్థ నిజమైన స్థితి 2026ను విడుదల చేశారు. దుబేతో విలేకరుల సమావేశంలో ప్రసంగించిన గౌడ... 'మోదీ ప్రభుత్వ సంఖ్యలను నమ్మడం అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఐఎంఎఫ్ భారతదేశ గణాంకాలకు 'సి' గ్రేడ్ ఇచ్చింది. 0.5 శాతం ద్రవ్యోల్బణ రేటు ప్రజల జీవితాల వాస్తవికత కాదు. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ప్రస్తుత వాస్తవికత కంటే జిడిపి గణాంకాలు కనీసం 2.5 శాతం ఎక్కువగా ఉన్నాయని లెక్కించారు' అని ఆయన అన్నారు.




2024లో జిడిపి కోసం ప్రభుత్వ ఉత్పత్తి మెట్రిక్ 9.2 శాతం జిడిపి వృద్ధిని చూపించింది, 4.9 శాతం వ్యయ మెట్రిక్ ద్వారా జిడిపి కంటే 47 శాతం ఎక్కువ అని గౌడ చెప్పారు. '2025–26 మొదటి అర్ధభాగంలో తయారీ రంగం 8.4 శాతం వృద్ధి చెందిందని నివేదించబడింది. కానీ ఎనిమిది ప్రధాన పరిశ్రమల సూచిక 2.9 శాతం వృద్ధిని మాత్రమే చూపించింది' అని ఆయన అన్నారు. 2025లో రూపాయి ఆసియాలో అత్యంత పేలవ పనితీరు కనబరిచిన కరెన్సీ అని గౌడ అన్నారు. రూపాయి విలువ పడిపోవడంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 2017–18, 2023–24 మధ్య తయారీ రంగంలో కార్మికుల వాటా 12.1 శాతం నుండి 11.4 శాతానికి పడిపోయిందని ఆయన అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా ఏమైంది? వ్యవసాయ వాటా 44.1 శాతం నుండి 46.1 శాతానికి పెరిగింది... ఉద్యోగ వృద్ధి తక్కువ విలువ, అనధికారిక గిగ్ ఆర్థిక వ్యవస్థలో కేంద్రీకృతమై ఉంది' అని గౌడ అన్నారు. 'పెరుగుతున్న అసమానత' సమస్యను ఎత్తిచూపుతూ, టాప్ 10 శాతం మంది జాతీయ ఆదాయంలో 58 శాతాన్ని సంగ్రహిస్తున్నారని గౌడ అన్నారు; దిగువ సగం మంది 15 శాతం మాత్రమే పొందుతారన్నారు. టాప్ 10 శాతం మంది భారతదేశ సంపదలో 65 శాతం కలిగి ఉన్నారు; దిగువ సగం మంది 6.4 శాతం కలిగి ఉన్నారు; టాప్ 1 శాతం మంది 40 శాతం కలిగి ఉన్నారు' అని ఆయన అన్నారు. 5 మంది భారతీయులలో 4 మంది రోజుకు రూ.200 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారని గౌడ అన్నారు. మూడింట ఒక వంతు మంది రోజుకు రూ.100 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. నికర గృహ ఆర్థిక పొదుపు ఐదు దశాబ్దాల కనిష్ట స్థాయి 5.2 శాతంగా ఉంది, గృహ రుణం 2019లో 35 శాతం నుండి 41 శాతానికి పెరిగిందని తెలిపారు. 'కొంతమందికి మాత్రమే ప్రయోజనం చేకూర్చే వృద్ధి విజయం కాదు. ఇది ఒక హెచ్చరిక సంకేతం. పెరుగుతున్న అసమానత, క్షీణిస్తున్న సంక్షేమం భారీ ఆర్థిక దుర్వినియోగానికి స్పష్టమైన గుర్తులు' అని దుబే అన్నారు. తయారీలో క్షీణత, ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎత్తి చూపడం ద్వారా మేక్ ఇన్ ఇండియా చొరవ 'వైఫల్యాలను కూడా దుబే గుర్తించారు.

## 'మహారాజుల' యుగానికి దేశం

### ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ:** 'ఎంజి నరేగా'ను ధ్వంసం చేయడం వెనుక ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశాన్ని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బయటపెట్టారు. అధికారం అంతా కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం చేసి కార్మికుల వేతనాలపై చర్చలు జరిపే హక్కును, పంచాయతీల అధికారాన్ని తొలగించడం, దేశాన్ని రాజుల యుగం నాటికి తిరిగి నెట్టడమేనని ఆయన ఆరోపించారు. మంగళవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో నరేగా కార్మికులతో తన ఇటీవలి సంభాషణ వీడియోను షేర్ చేశారు. ఎంజి నరేగా వారి జీవితాలను మార్చిందని ప్రకటించిన కార్మికులు.. ఇప్పుడు మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మారుస్తోందని చెబుతున్నారని అన్నారు. వీడియోతో పాటు హిందీలో తన పోస్ట్‌లో రాహుల్‌గాంధీ 'ఎంజి నరేగా'ను నాశనం చేయడానికి మోదీ జీ చేసిన ప్రయత్నం వెనుక ప్రేరణ ఏమిటి? కార్మికుల రోజువారీ వేతనాలపై చర్చలు జరిపే హక్కును తొలగించడం; పంచాయతీల అధికారాన్ని తొలగించి వారి చేతులు కట్టేయడం; రాష్ట్రాల అధికారాన్ని తొలగించి ఢిల్లీలో అధికారాన్ని కేంద్రీకరించడం; దేశాన్ని రాజులు, మహారాజుల యుగానికి తిరిగి నెట్టడం, అధికారం, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై' అని అన్నారు. కనీస వేతనాలు, ఏడాది పొడవునా పనికి హామీ, స్వేచ్ఛ, గౌరవంతో పనిచేసే హక్కు వంటి వాటిని దేశంలోని లక్షలాది మంది కార్మికులు ఒకే గొంతుతో వినిపిస్తున్నారన్నారు. వీడియోలో, ఒక నరేగా కార్మికుడు గాంధీకి ఈ ప్రభుత్వం 'కార్మికులను బానిసలుగా' మారుస్తోందని చెబుతున్న దృశ్యం కపిపించింది. జీవనోపాధి భద్రత కల్పించడంలో చట్టం తమకు ఎలా సహాయపడిందో నరేగా కార్మికులు మాట్లాడుకుంటున్నారు, కానీ ప్రభుత్వం పరివర్తన చొరవను నాశనం చేయాలని సంకల్పించుకుందని రాహుల్ ఆరోపించారు.

## నరేగా రద్దుకు వ్యతిరేకంగా కర్నాటకలో 'చల్ రాజ్‌భవన్'

### సిఎం సిద్ధ, డికె, సుర్జేవాలా పార్టీ ప్రజాప్రతినిధులు గవర్నర్‌కు మోమెరాండం సమర్పణ



**బెంగళూరు:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ 'ఎంజి నరేగా'ను రద్దు చేయాన్ని వ్యతిరేకిస్తూ కర్నాటకలో అధికార కాంగ్రెస్ మంగళవారం 'చలో రాజ్‌భవన్' నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఎంజి నరేగా స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి హామీ చట్టం అయిన 'విబి– జి రామ్ జి' ని తీసుకురావడాన్ని నిరసిస్తూ రాష్ట్ర గవర్నర్ అధికారిక నివాసం లోక్‌భవన్ వైపు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం బస్సులో లోక్‌సభవన్ వెళ్లి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు మెమోరాండం సమర్పించారు. నిరసన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కూల్చివేస్తోందని, పంచాయతీల హక్కులను కాలరాస్తోందని వారు ఆరోపించారు. అనంతరం నిరసనకారులనుద్దేశించి సిద్ధరామయ్య మాట్లాడుతూ, 'విబి– జి రామ్ జి' లోని 'రామ్' అనే పదం దశరథ్ రామ్ లేదా సీతా రామ్ కాదన్నారు. ఇది రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) కోసం వికసిత్ భారత్ హామీని సూచిస్తుందని చెప్పారు. యుపిఎ హయాంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) జీవనోపాధి, ఉపాధి హక్కు అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దానిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 'ఎంజిఎన్‌ఆర్ఇజిఎ ప్రజల హక్కు, కానీ ఇకపై కాదు. వికలాంగులతో సహా దాదాపు ఐదు కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. గతంలో పంచాయతీలు చేసే పని అయితే, ఇప్పుడు కేంద్రం ఏ పని చేయాలో నిర్ణయించాలనుకుంటోంది' అని సిద్ధరామయ్య ఆరోపించారు. పంచాయతీల పాత్రను తీవ్రంగా తగ్గించారని మండిపడ్డారు. ప్రతి పంచాయతీకి గతంలో సుమారు రూ. కోటి వరకు వచ్చేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు వారికి అది అందకుండా పోతుంది. గ్రామీణ భారతదేశంపై బిజెపి దాడి చేస్తోందని సిద్ధరామయ్య ఆరోపిస్తూ, 'గ్రామాలు అభివృద్ధి చెందకపోతే దేశం అభివృద్ధి చెందదని గాంధీజీ అన్నారు. నరేగాను రద్దు చేయడం ద్వారా బిజెపి మరోసారి మహాత్మా గాంధీని హత్య చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఆందోళనకు ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కర్ణాటక ఇన్‌చార్జ్ కూడా అయిన సుర్జేవాలా, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడానికి కేంద్రం పట్టుబడిందని ఆరోపించారు. 'కేంద్ర ప్రభుత్వం నరేగాను రద్దు చేయాలనుకుంటోందని, పంచాయతీ కేంద్రాలను మహాత్మా గాంధీ కేంద్రంగా పేరు మార్చాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. నరేగాను రద్దు చేయడం ద్వారా, బిజెపి తనకు తానుగా ఇబ్బందులను ఆహ్వానించిందని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు 'విబి– జి రామ్ జి'ని అంగీకరించరని శివకుమార్ అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసినందుకు వారు బిజెపిని క్షమించరని చెబుతూ, బిజెపికి రాజకీయ పరిణామాలపై శివకుమార్ హెచ్చరించారు. తర్వాత, వారు గెహ్లోట్‌కు మెమోరాండం సమర్పించారు. కాగా, కర్ణాటక కాంగ్రెస్ నాయకత్వం గవర్నర్‌ను తమ అభ్యంతరాలను గమనించాలని విజ్ఞప్తి చేసింది. నరేగాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. కోట్లాది మంది గ్రామీణ కార్మికుల ఉపాధి భద్రత, జీవనోపాధిపై దాడిగా వారు అభివర్ణించినందుకు క్షమాపణ చెప్పాలని వారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రివర్గాన్ని కోరారు.

## యుజిసి కార్యాలయం వెలుపల విద్యార్థుల నిరసన

### కొత్త నిబంధనలపై మండిపాటు : ఉపసంహరించుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) జారీ కొత్త నిబంధనలు క్యాంపస్‌లలో గందరగోళానికి దారి తీస్తాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలను వ్యతిరేకిస్తూ మంగళవారం ఢిల్లీ వ్యాప్తంగా ఉన్న కళాశాలల విద్యార్థుల బృందం యుజిసి ప్రధాన కార్యాలయం వెలుపల నిరసన చేపట్టింది. ఒక వైపు భారీ బారికేడింగ్, మరో వైపు వర్షం కురుస్తున్నప్పటికీ దాదాపు 100 మంది విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. నిబంధనలను పూర్తిగా ఉపసంహరించుకోవడంతో సహా తమ డిమాండ్ల జాబితాను విద్యార్థి బృందం యుజిసికి సమర్పించింది. 'యుజిసి అధికారులు మా మెమోరాండం స్వీకరించారు. మా డిమాండ్ల జాబితా నుండి కొన్ని అంశాలను చర్చించడానికి వారు అంగీకరించారు' అని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన పిహెచ్‌డి విద్యార్థి అలోకిత్ త్రిపాఠి పిటిఐకి తెలిపారు. ఈక్విటీ స్క్వాడ్‌లో జనరల్ కేటగిరి నుండి ఒకరిని నియమించాలనే డిమాండ్‌ను పరిశీలిస్తామని యుజిసి అధికారులు తెలిపారన్నారు. 15 రోజుల్లోపు, అంటే ఫిబ్రవరి 12లోపు ఒక పరిష్కారాన్ని కనుగొంటామని కమిషన్ తమకు హామీ ఇచ్చిందని, తప్పుడు ఫిర్యాదులను నిరుత్సాహపరిచేందుకు నిందితుడి గుర్తింపును ప్రైవేట్‌గా ఉంచబోమని అధికారులు చెప్పినట్లు అని త్రిపాఠి పేర్కొన్నారు. నిరసనకారుల గళాన్ని వినిపిస్తాయని వారు హామీ ఇచ్చారన్నారు. ఈనెల 13న యుజిసి నోటిఫై చేసిన 'ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం నిబంధనలు, 2026' కొత్త నియమాలు జనరల్ కేటగిరీ విద్యార్థుల నుండి విస్తృత విమర్శలకు దారితీశాయి. ఈ నియమాలు వారిపై వివక్షకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో కుల ఆధారిత వివక్షను ఆపడానికి ప్రవేశపెట్టిన కొత్త నిబంధనల ప్రకారం, ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థుల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్వహించడానికి ప్రత్యేక కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని జియుసి సంస్థలను కోరింది. కొత్త నిబంధనలు కళాశాలల్లో పూర్తి గందరగోళాన్ని సృష్టిస్తాయని, ఎందుకంటే రుజువు భారం ఇప్పుడు పూర్తిగా నిందితులపైకి మార్చబడుతుందజని, తప్పుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎటువంటి రక్షణలు లేవు అని విద్యార్థులు చెబుతున్నారు. కాగా, శ్రీ వెంకటేశ్వర కళాశాల బిఎ పొలిటికల్ సైన్స్ విద్యార్థి హర్ష్ పాండే మాట్లాడుతూ కొత్త నిబంధనలను తగిన పరిశీలన లేకుండా తీసుకువచ్చారని మండిపడ్డారు. ఈ నిబంధనలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని తాము డిమాంట్ చేస్తున్నామన్నారు. ఎందుకంటే అవి వ్యతిరేక వివక్షకు దారితీస్తాయని, క్యాంపస్‌లో అమాయక విద్యార్థులను నేరస్థులుగా చేయడానికి వీటిని ఉపయోగిస్తారని ఆయన పేర్కొన్నారు. యుజిసి నిబంధనలపై దేశవ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయి. అనేక రాష్ట్రాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థలకు ఎక్కువ న్యాయబద్ధత, జవాబుదారీతనం తీసుకురావడమే ఈ మార్పుల లక్ష్యం అని ప్రభుత్వం చెప్పినప్పటికీ, చాలా మంది అవి సామాజిక విభజనలను తీవ్రతరం చేస్తాయని, విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో కొత్త సవాళ్లను కలిగిస్తాయని భయపడుతున్నారు.

## భారత్–ఇయు వాణిజ్య ఒప్పందం హైలైట్స్

1. భారతదేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, యూరోపియన్ యూనియన్ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. రెండూ కలిస్తే ప్రపంచ స్థూల దే శీయోత్పత్తిలో 25 శాతం అవుతుంది. అంటే ప్ర పంచ వాణిజ్యంలో మూడోవంతుతో సమానం.
2. భారత్ ఎగుమతి చేసే 99 శాతం వస్తువులకు యూరప్ దేశాలలో ప్రవేశానికి ప్రాధాన్యత ఉం టుంది. దీంతో ఇప్పటివరకూ లభించని సామూ హిక వృద్ధి సామర్థ్య సాధనకు ద్వారాలు తెరచు కుంటాయి.
3. సూక్ష్మ చిన్న మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు ప్రారంభమవుతాయి. మహిళలు, చేతివృత్తిపనివారులకు, యువకులు, వృత్తినిపుణులకు కొత్త అవకా శాలు వస్తాయి.
4. టెక్స్‌టైల్స్,తోలుపరిశ్రమ,సముద్ర ఉత్పత్తులు, రత్నాలు, అభరణాలు వంటి శ్రామికులు ఎక్కువ గా పనిచేసే రంగాలకు చెందిన 33 బిలియన్ డా లర్ల విలువైన ఎగుమతులకు అవకాశాలు వస్తా యి. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కింద శ్రమాధిక్యతగల ఈ రంగాలకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుంది.
5. ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన మొదటి రోజున 33 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులపై సుం కాలను 10 శాతం తగ్గించడం వల్ల దాదాపు సుంకాలు లేనట్టే.
6. ఆటోమొబైల్స్, ఖచ్చితమైన కొలతలతో చేసిన వస్తువులు, చెక్కిన అలంకరణ వస్తువులు, కోటా ప్రాతిపదికపై ఉదారంగా సుంకాల సడలింపు ఉంటుంది.
7. యూరోపియన్ ఆటో ఉత్పత్తిదారులు భారతదేశంలో తమ కొత్త నమూనాలను భారీ ధరలతో పరిచయం చేయడానికి సులభంగా అనుమతించడం మాత్రమే కాకుండా, భవిష్యత్‌లో మనదేశంలోనే తయారు చేసి ఎగుమతులు చేసే అవకాశాలు కూడా ఇస్తారు.
8. హైటెక్ ఉత్పత్తుల నుండి, బ్రహ్మాండమైన పోటీ నుండి భారత వినియోగదారులు ప్రధానంగా లబ్ది పొందుతారు.
9. యూరోపియన్ యూనియన్‌లో పరస్పరం ఇచ్చిపుచ్చుకునే మార్కెట్ కూడా భారత్‌లో తయా రు చేసిన ఆటోమొబైల్స్‌కు అందుబాటులోకి వ స్తుంది.
10. పాల ఉత్పత్తులు,తృణ ధాన్యాలు, కోళ్ళపరిశ్రమ ,సోయా ఉత్పత్తులు, కొన్ని పండ్లు, కూరగాయలకు దేశీయ ప్రాధాన్యతలతో ఎగుమతులు చేయడానికి రక్షణలు సమకూరతాయి.
11. ఎఫ్‌టిఎ ద్వారా సుంకాల లేమి ఆటంకాలను పరిష్కరించేందుకు నియంత్రిత సహకారం అమలు చేస్తారు. బ్రహ్మాండంగా బాహాటత్వ విధానం అమలు చేస్తారు. నిబంధనలను క్రమ బద్ధీకరిస్తారు.
12. నైపుణ్యంగల, తక్కువ నైపుణ్యంగల భారత వృత్తినిపుణులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు విస్తరించేవిధంగా భవిష్యత్ వ్యవస్థను పటిష్టం చేస్తారు.
13. స్టీలు,సిమెంటు వంటి కార్బన్ ఉత్పత్తి చేసే వస్తువులపై పన్ను (సిబిఎఎం) నిబంధనలు ఉన్నప్పటికీ కూడా అత్యంత సన్నిహిత మిత్రదేశ హోదా కింద పట్టువిడుపులు ఉంటాయి.
14. కొన్ని మార్కెట్లను అందుబాటులోకి తెచ్చే విషయంలో వివక్షలేకుండా వ్యవహరిస్తారు, డిజిటల్ సేవలపై దృష్టి పెడతారు. దీనివల్ల భారత్ నుండి రాకపోకలు చేయడానికి ఉద్యోగులకు సేవల ఎగుమతులకు సులభతరంగా ఉంటుంది.
15. సమాచార సాంకేతికత, సమాచార సాంకేతికత ఆధారిత సేవలు వంటి యూరోపియన్ యూ నియన్‌లోని 144 ఉప రంగాలలోకి వృత్తి సేవలు, విద్యా సేవలు చొరబడేందుకు అవకాశాలుంటాయి.
16. భారతదేశం కూడా యూరోపియన్ యూనియన్‌కు 102 ఉప రంగాలలో చొరబడేందుకు అ వకాశం ఇచ్చింది.
17. భారత్ ఇచ్చే అవకాశం వల్ల హైటెక్ సర్వీసులు, పెట్టుబడులు యూరప్ నుండి మనదేశంలోకి వస్తాయి. రెండు వ్యవస్థలూ పరస్పర అంగీకృత విధానం ద్వారా ఈ ప్రయోజనాలకు ఏర్పాట్లు చేసుకున్నాయి.
18. ఇరువైపులా వృత్తి నిపుణులు స్వల్పకాలిక ప్రయాణాలు చేయడానికి చాలా సులభమైన విధానాలు అమలు చేస్తారు.
19. యూరోపియన్ యూనియన్ కాంట్రాక్టు సేవల సరఫరాలు చేయడానికి 37 రంగాలు, ఉప రంగాలను అనుమతించేందుకు కట్టుబడింది. అదేవిధంగా వ్యక్తిగతమైన నైపుణ్యకోసం కూడా 17 రంగాలు, ఉప రంగాలను అనుమతిస్తారు.
20. నియంత్రణలు లేనిచోట్ల భారతదేశ సంప్రదాయ వైద్య విధానాల ద్వారా సేవలు చే యడానికి యూరప్ దేశాలలో అనుమతులు ఉంటాయి.
21. ఇరు వ్యవస్థల మధ్యా డిజిటల్ చెల్లింపులకు అవకాశాలు ఉంటాయి.
22. భారతదేశం ఈ విధంగా యూరోపియన్ యూనియన్‌తో కలిపి ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా 22 స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకుంది.

### వరుసగా 9వసారి బడ్జెట్...

## 'చరిత్ర' సృష్టించనున్న నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి చరిత్ర సృష్టించబోతున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన ఆమె వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒకే ప్రధానమంత్రి హయాంలో వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా ఆమె రికార్డు సొంతం చేసుకోనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య ఈసారి బడ్జెట్‌లో కీలక సంస్కరణలు ఉండనున్నాయని అంచనాలు ఉన్నాయి. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలా సీతారామన్‌ను మహిళా ఆర్థిక మంత్రిగా నియమించారు. అప్పటి నుంచి వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెడుతూ వస్తున్నారు. 2024లో మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆర్థిక శాఖ బాధ్యతలు ఆమెకే కొనసాగాయి. ఇప్పటివరకు ఆమె ఎనిమిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా, 2024 ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ కూడా ఇందులో భాగమే. అయితే ఈసారి ప్రవేశపెట్టనున్న తొమ్మిదో బడ్జెట్‌తో ఆమె మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డుకు నిర్మలా సీతారామన్ మరింత దగ్గరవుతారు. దేశాయ్ మొత్తం 10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. అయితే వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఘనత మాత్రం నిర్మలా సీతారామన్‌కే దక్కనుంది.

**హల్వా వేడుక:** మరోవైపు, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ మంగళవారం హల్వా వేడుకను నిర్వహించారు. భారత్‌లో ఏ మంచి కార్యక్రమం ప్రారంభించినా ముందుగా తీపి పదార్థాలు పంచడం శుభప్రదంగా భావిస్తారు. అందుకే ఏటా బడ్జెట్‌కు ముందు సంప్రదాయం ప్రకారం, ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుక చేస్తుంటారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఆ హల్వాను పంచిపెడతారు. హల్వా వేడుకతో బడ్జెట్ లాక్‌ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సిసిటివి కెమెరాలు, ఇంటెలిజెన్స్ బ్యూరోల నిరంతర పర్యవేక్షణలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. అత్యవసర సమయాల్లో మాత్రం భద్రతా సిబ్బంది సమక్షంలో ఫోన్ చేసుకునే వీలు కల్పిస్తారు.

### 2026 యుజిసి నిబంధనలలో 'కుల వివక్ష నిర్వచనాన్ని' సవాల్ చేస్తూ..

## 'సుప్రీం'లో పిటిషన్

### విద్యార్థులను రక్షించడంలో యుజిసి విఫలమైందని పిటిషన్ ఆరోపణ పిటిషన్ దాఖలు చేసిన వినీత్ జిందాల్




**న్యూఢిల్లీ:** ఇటీవల నోటిఫై చేయబడిన విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఆ నిబంధన కుల ఆధారిత వివక్షకు ఒక చేర్పులేని నిర్వచనాన్ని స్వీకరించిందని, సంస్థాగత రక్షణ నుండి కొన్ని వర్గాలను మినహాయించిందని ఆ పిటిషన్ ఆరోపించింది. ఇటీవల యుజిసి (ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం ) 2026లోని నిబంధన 3(సి) 'చేర్చబడనిది' అని, విద్యార్థులను రక్షించడంలో విఫలమైందని, రిజర్వ్ కేటగిరీలకు చెందకుండా రక్షించుకోవడంలో విఫలమైందని పిటిషన్ తెలిపింది. వినీత్ జిందాల్ దాఖలు చేసిన పిటిషన్‌లో కుల ఆధారిత వివక్ష అనేది షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనకబడిన తరగతుల (ఒబిసి) సభ్యులపై జరిగిన హింసగా నిర్వచించబడిందనే నిబంధనల ఆధారాలను కొట్టిపారేశారు.'కుల ఆధారిత వివక్షత' పరిధిన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా యుజిసి సాధారణ లేదా రిజర్వ్ చేయని వర్గాలకు చెందిన వ్యక్తులకు సంస్థాగత రక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని సమర్థవంతంగా అందించిందని, వారు వారి కుల గుర్తింపు ఆధారంగా వేధింపు లేదా పక్షపాతాన్ని కూడా ఎదుర్కోవచ్చని తెలిపింది.( ప్రస్తుత మినహాయింపు రూపం రక్షణ సోపాన క్రమంలోని నిబంధన రాజ్యాంగ విరుద్ధం అని అది పేర్కొంది. ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), 15(1) (మతం, జాతి, కులం, జన్మస్థలం ఆధారంగా రాష్ట్రం వివక్షతను నిషేధించడం) కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక నిబంధనలను ఈ నిబంధన ఉల్లంఘిస్తుందని పిటిషన్ పేర్కొంది.ఈ నిబంధన ఆర్టికల్ 21 జీవితాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘిస్తుందని, ఇందులో రాజ్యాంగంతో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా ఉందని ఆరోపించింది.ప్రస్తుత రూపంలో రెగ్యులేషన్ (సి)ని అమలు చేయకుండా అథారిటీలను నిరోధించాలని, కుల ఆధారిత వివక్షతను కుల తటస్థంగా, రాజ్యాంగ బద్ధంగా ఫిర్యాదు చేసే పద్ధతిలో పునర్విర్వచించడానికి దిశా నిర్దేశం చేయాలని అది సుప్రీంకోర్టును కోరింది. ఈ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయబడిన 'సమాన అవకాశ కేంద్రాలు','ఈక్విటీహెల్ప్‌లైన్లు','అంబుడ్స్‌పర్సన్' యంత్రాంగాలను అన్ని విద్యార్థులు అందరికీ వివక్ష లేని విధంగా అందుబాటులో ఉంచాలని, నిర్వచనం అధికారిక పున: పరిశీలన వరకూ కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కి మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ కోరింది.

### అదానీ గ్రూప్, 'ఎంబ్రేయర్' ఆధ్వర్యంలో...

## భారత్‌లో ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు

**న్యూఢిల్లీ :** భారతదేశంలో ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అదానీ గ్రూప్, బ్రెజిలియన్ ప్రధానసంస్థ 'ఎంబ్రేయర్' ఒక వ్యూహాత్మక సహకారాన్ని ప్రకటించారు. ఇది దేశ స్వదేశీ తయారీ సామర్థ్యాలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇవ్వనుంది. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటిగా పేరొందింది. ఈ భాగస్వామ్యం టైర్ 2, టైర్ 3 నగరాలకు ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు సహాయపడుతుంది. దేశరాజధానిలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్, ఎంబ్రేయర్ అధికారులు భారతదేశంలో వ్యూహాత్మక సహకార ప్రాంతీయ రవాణా విమానాల కోసం అవగాహనా ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నారు. దేశంలో ఎంబ్రేయర్ ప్రాంతీయ విమానాల కోసం రెండు కంపెనీలు ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఎఎల్)ను ఏర్పాటు చేస్తాయి. భారతదేశంలో ప్రాంతీయ విమాన తయారీ కేంద్రం అయిన ఎంబ్రేయర్ సహకారాన్ని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ ప్రారంభించారు. ఎంబ్రేయర్ 150సీట్ల వరకూ వాణిజ్య జెట్‌లను తయారు చేస్తుంది. పెట్టుబడులు, సౌకర్యం ఉన్న ప్రతిపాదిత ప్రదేశం గురించి వివరాలు వెల్లడించలేదు. ఎయిర్ క్రాఫ్ట్ తయారీ, సప్లయ్ చైన్, ఆఫ్టర్ మార్కెట్ సర్వీసెస్, పైలట్ శిక్షణలో అవకాశాల కోసం కంపెనీలు సహకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ ఈ సహకారం కేవలం ప్రాంతీయ విమానాలను అసెంబుల్ చేయడానికి మాత్రమే కాదని, ప్రగతిశీల సాంకేతిక బదిలీ, నైపుణ్యాభివృద్ధి, బలమైన సరఫరాను కలిగి ఉండటం ద్వారా భారతదేశాన్ని ప్రాంతీయ విమానాలకు విశ్వసనీయ కేంద్రంగా మార్చడం ద్వారా ఒక స్థితిస్థాపకమైన, స్థిరమైన విమానయాన పర్యావరణ వ్యవస్థ దిగుమతులను పరిమితం చేయగలదని ఆయన తెలిపారు. తయారీ కేంద్రం కోసం రెండు స్థలాలను పరిశీలిస్తున్నామని, రాబోయే నెలల్లో పనులు ఖరారు అవుతాయని జీత్ అదానీ వెల్లడించారు. పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో తయారీ, వృద్ధి సామర్థ్యాలను హైలెట్ చేసేందుకు సరైన సమయం ఇది అన్నారు. ప్రస్తుతం భారతదేశంలో 2005లో ఇజెట్స్ కార్యకలాపాలు ప్రారంభించిన ఎంబ్రేయర్ దేశంలో దాదాపు 50విమానాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రభుత్వ సంస్థలు, వ్యాపార జెట్ ఆపరేటర్లు, వాణిజ్య విమానయాన సంస్థ స్టార్ ఎయిర్‌కు సేవలు అందిస్తుంది. ఎంబ్రేయర్ కమర్షియల్ ఏవియేషన్ ప్రెసిడెంట్, సిఇఒ అర్జన్ మీజెర్ మాట్లాడుతూ భారతదేశం ఎంబ్రేయర్‌కు కీలకమైన మార్కెట్ అని, ఈ భాగస్వామ్యం అదానీ బలమైన పారిశ్రామిక సామర్థ్యాలతో మా ఏరోస్పేస్ నైపుణ్యం, స్వదేశీకరణకు నిబద్ధతతో కలిసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రక్షణ మంత్రిత్వ శాఖ దృక్కోణం నుండి ఇటువంటి భాగస్వామ్యాలు దిగుమతి ఆధారపడటాన్ని తగ్గించడం, కార్యాచరణ సంసిద్ధతను పెంచడం, ప్లాట్‌ఫారమ్‌లు, విడిభాగాలు సకాలంలో లభ్యతను నిర్ధారించడం అనే లక్ష్యాలను నేరుగా విరుద్ధంగా ఉంటాయని అన్నారు.

# రాజకీయ పార్టీలకు 'మున్సిపల్' పరీక్ష

రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) మున్సిపల్ నగారా మోగించింది. 116 మున్సిపాలిటీలు, 7మున్సిపల్ కార్పొరేషన్లకు మంగళ వారం ఎన్నికల నిర్వహణ షెడ్యూలు ప్రకటన ఆకస్మికంగా వచ్చినట్లు అనిపించినా, కనిపించినా పిడుగుపాటు మాత్రం కాదు. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల సన్నాహాల్లో మునిగిఉన్నాయి. గత నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి కొత్త పాలక విభాగాలు కొలువుతీరిన నాటి నుంచే మున్సిపల్ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి; ఎస్ఇసి ఓటర్ల జాబితాలు తాజాపరచటం, రిజర్వేషన్ల ఖరారు, శాంతి–భద్రతల యంత్రాంగాన్ని అప్రమత్తం చేయటం వంటి ఎన్నికల సన్నాహాలు పరిపూర్తి చేసింది – ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం వేచిచూస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్‌నుంచి అమెరికా వెళ్లినప్పటికీ అంతకు మునుపు జనవరి 18న మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం లోనే మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా మంత్రివర్గ ఆదేశం ఎన్నికల కమిషన్‌కు అందింది.

> మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఎన్నికల గుర్తులపై జరుగుతాయి. అందువల్ల, పార్టీ టిక్కెట్లలో 42 శాతం ఒబిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారు. మిగతా పార్టీలకూ అదే విజ్ఞప్తి చేశారు. అయితే ఏ పార్టీ పాటిస్తుందో, పాటించదో వేచి చూడాలి. ఇది ముఖ్యంగా మేయర్, చైర్మన్ పదవుల్లో ప్రతిఫలించినపుడే బిసిలకు ఆచరణలో న్యాయం జరుగుతుంది.

నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని కొద్ది రోజుల క్రితం వెల్లడించారు.

మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినీదేవి ప్రకటన ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2996 వార్డులు, డివిజన్‌లున్నాయి. ఓటర్లసంఖ్య 53లక్షలు. నామినేషన్ల దాఖలు గడువు జనవరి 28–30 తేదీలు. 31న స్క్రూటినీ. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12న అవసరమైన చోట రీపోలింగ్, 13న ఓట్ల లెక్కింపు, 16న కార్పొరేషన్స్‌లో మేయర్, డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్–చైర్‌పర్సన్ల ఎన్నిక నిర్వహిస్తారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల, జిల్లా పరిషత్ పాలక మండళ్ల ఏర్పాటు నిమిత్తం ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు బహుశా మార్చి/ఏప్రిల్ మాసాల్లో జరుగుతాయి.

స్థానిక సంస్థల్లో ఒబిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన లీగల్, చట్టబద్ధ ప్రయత్నాలన్నీ కేంద్రప్రభుత్వ మహా ద్వారం వద్ద నిలిచిపోవటంతో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఆలస్యమైంది. 73, 74 రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థలను మూడవ దొంతర ప్రజాపాలనగా(పార్లమెంటు, అసెంబ్లీల తదుపరి) గుర్తించి, వాటి పాలక మండళ్లకూ విధిగా ఐదు సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించాయి. అయితే రిజర్వేషన్ల ఖరారు వంటి అధికారాలు రాష్ట్రాలకు అప్పగించినందున, అత్యధిక రాష్ట్రాల్లో రాజ్యాంగ ఆదేశం పాటింపు జరగటం లేదు. అదలావుంచితే, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఎన్నికల గుర్తులపై జరుగుతాయి. అందువల్ల, పార్టీ టిక్కెట్లలో 42 శాతం ఒబిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారు. మిగతా పార్టీలకూ అదే విజ్ఞప్తి చేశారు. అయితే ఏ పార్టీ పాటిస్తుందో, పాటించదో వేచి చూడాలి. ఇది ముఖ్యంగా మేయర్, చైర్మన్ పదవుల్లో ప్రతిఫలించినపుడే బిసిలకు ఆచరణలో న్యాయం జరుగుతుంది. చట్టరీత్యా 42 శాతం బిసి రిజర్వేషన్లు కల్పించేవరకు స్థానిక ఎన్నికలు జరపరాదని అప్రజాస్వామిక డిమాండ్ చేస్తూ వస్తున్న బిసి సంఘాల నాయకులు, ఎన్నికలు జరిపితే భూకంపం సృష్టిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అది సాధ్యం కాలేదు. పురపాలక ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి కాబట్టి పార్టీలు పోటీ చేసే సీట్లలో 42 శాతం తమకు కేటాయింపు కోసం రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేస్తే కొంత ఫలితం ఉండవచ్చు.

ఈ రోజు (బుధవారం) నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్నందున అభ్యర్థుల నిర్ణయం, స్థానిక సర్దుబాట్లకు సమయం బహుతక్కువ ఉన్నందున రాజకీయ పార్టీలకు ఉరుకులు పరుగుల పరిస్థితి ఎదురవుతోంది. అయితే ప్రధాన పోటీదారులైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ఇప్పటికే ఎన్నికల సన్నాహాల్లో మునిగి ఉన్నాయి. అయినా స్థానిక వైరాల కారణంగా కొన్నిచోట్ల రెబల్స్ బెడద తప్పకపోవచ్చు. ఏమైనా ఎన్నికలు జరిగి కిందిస్థాయిలో ప్రజాస్వామ్యయుత పాలన పునఃప్రారంభమయ్యే ప్రక్రియ ఆహ్వానించదగింది.



## నా మూలాలు గోవాలో...

నేను యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడిని. అలాగే నేను ఓవర్సీస్ ఇండియన్ సిటిజన్‌ను కూడా. నా మూలాలు గోవాలో ఉన్నందుకు గర్వపడుతున్నాను. నా తండ్రి కుటుంబం అక్కడి నుంచే యూరోప్‌కు వెళ్ళింది. కాబట్టి యూరోప్, భారత్‌ల అనుబంధం నాకు వ్యక్తిగతమైంది. భారతదేశంతో యూరోపియన్ యూనియన్ చర్చలు ఇవాళ పూర్తయ్యాయి. మా సమావేశం ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపిస్తుంది. ప్రపంచ క్రమం మౌలికంగా పునఃపొందిక జరుగుతున్న సమయంలో ఇయు, భారతదేశం వ్యూహాత్మక, విశ్వసనీయ భాగస్వాములుగా కలిసికట్టుగా నిలబడ్డాయి. రెండు దేశాలు కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాక ప్రాధాన్యత కలిగింది.

- యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా







# యువతకు ప్రేరణ 'పంజాబ్ కేసరి' జీవితం

పంజాబ్, దుడుకే గ్రామంలో ఒక సాధారణ కుటుంబంలో మున్షీ రాధా కృష్ణ, గులాబ్ దేవి దంపతులకు 28 జనవరి 1865న జన్మించిన లాలా లజపతి రాయ్ చిన్ననాటి నుంచే తల్లి తండ్రుల నుంచి ప్రేరణను పొంది దేశభక్తి, అంకితభావం, క్రమశిక్షణలతో పెరిగారు. స్వంత గ్రామంలో పాఠశాల విద్యను పూర్తిచేసి లాహోర్ ప్రభుత్వ కళాశాలలో న్యాయ పట్టా పొందారు. ఆర్య సమాజ్ ఉద్యమం నడిపిన స్వామి దయానంద్ సరస్వతి ప్రేరణతో సంఘ సంస్కర్తగా, జాతీయ భావాలను నరనరాన జీర్ణించుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రచయిత, దార్శనికుడు అయిన లాలా లజపతి రాయ్ ధైర్యసాహసాలు అనన్య సామాన్యమైనవి. బెంగాల్ విభజన, సహాయ నిరాకరణ, సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని వేలమంది సాధారణ ప్రజలను స్వతంత్ర పోరాటంలో పాల్గొనే విధంగా మేల్కొలిపారు. 'నా శరీరంపై తెల్లోడి ప్రతి దెబ్బ బ్రిటీష్ పాలన శవపేటికకు మేకులు అవుతాయి' అనే వాక్యం లాలా లజపతి రాయ్ దేశభక్తి, భరతమాత స్వేచ్ఛా కాంక్షకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్వయం పాలన కోసం స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్న లాలా లజపతి రాయ్ తన మిత్రులు బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్‌లతో కలిసి లాల్ బాల్ పాల్ అనే పేరుతో త్రయంగా పోరాటాలు కొనసాగించారు.

స్వతంత్ర పోరాటంతో పాటు ప్రముఖ రచయితగా యంగ్ ఇండియా, ఇంగ్లాండ్స్ డెట్ టు ఇండియా, ది స్టోరీ ఆఫ్ మై డిపోర్టేషన్ అనే పుస్తకాలు రచించారు. దీనికి తోడుగా విద్య ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన, మహిళా సాధికారత లాంటి సంఘ సంస్కరణ యజ్ఞాల్లో సమిధగా సేవలు అందించారు. అంతే కాకుండా పంజాబ్ నేషనల్ బ్యాంక్, గులాబ్ దేవి స్మారక ఆసుపత్రి, సర్వెంట్స్ ఆఫ్ ది పీపుల్స్ సొసైటీ లాంటి సంస్థలను ప్రారంభించి స్థానికపు మెప్పుపొందారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయంగా లాలా లజపతి రాయ్ నిలుస్తున్నారు. 28 జనవరి 2026న నిర్వహించుకుంటున్న లాలా లజపతి రాయ్ జయంతి ఉత్సవాల్లో యువతరానికి ఆయన జీవిత విశేషాలను వివరించడం లేదా పోటీలు నిర్వహించడం, నివాళులు అర్పించడం, పబ్లిక్ ర్యాలీలు లాంటి కార్యక్రమాలు అనేకం చేయవచ్చు.

1928లో, యునైటెడ్ కింగ్‌డమ్ భారతదేశంలోని రాజకీయ పరిస్థితులను నివేదించడానికి సర్ జాన్ సైమన్ నేతృత్వంలో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్‌ను భారతీయ రాజకీయ పార్టీలు బహిష్కరించాయి, ఎందుకంటే ఇందులో భారతీయ సభ్యులు ఎవరూ లేరని, దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కమిషన్ 30 అక్టోబర్ 1928న లాహోర్‌ను సందర్శించినప్పుడు, దానికి నిరసనగా లజపత్ రాయ్ ఒక మార్చ్‌కు నాయకత్వం వహించి 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాన్ని ఇచ్చాడు. లాహోర్‌లోని పోలీసు సూపరింటెండెంట్, జేమ్స్ ఏ.స్కాట్, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేయమని పోలీసులను ఆదేశించాడు, రాయ్‌పై వ్యక్తిగతంగా దాడి చేశాడు. 1928 నవంబరు 17న లాలాజీ కన్నుమూశారు. పోలీసు దెబ్బలవల్లే ఆయన మరణించారని వైద్యులిచ్చిన నివేదిక బ్రిటన్ పార్లమెంటులో ఆందోళనకు దారితీసింది. కానీ, బ్రిటిష్ ప్రభుత్వం మాత్రం ఈ ఘటనతో తమకు ఎలాంటి ప్రమేయం లేదని బుకాయించింది. కానీ లాలాపై దాడికి ప్రత్యక్ష సాక్షులైన భగత్‌సింగ్ వంటి యువ ఉద్యమకారులు.. తర్వాతి రోజుల్లో అగ్గిపిడుగుల్లా మారి బ్రిటిష్ ప్రభుత్వానికి చెమటలు పట్టించటమే గాక భారతావనిలో స్వాతంత్ర్య ఆకాంక్షను రగిల్చారు. భారత స్వాతంత్ర్యోద్యమానికి దశ దిశను నిర్దేశించి, తన జీవితకాలమంతా అవని భారతి సేవకే అర్పించిన మహనీయుడు లజపతిరాయ్ 161వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి.

*(28 జనవరి లాలా లజపతి రాయ్ జయంతి సందర్భంగా)*

## మొజాంబిక్ హక్కుల యోధకు

# ఇందిరాగాంధీ శాంతి బహుమతి

**జగ్‌మోహన్ థాకెన్**

'ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి–2025'కు మొజాంబిక్ నాయకురాలు గ్రాసా మాషెల్ ఎంపికయ్యారు. అందరికీ మరింత న్యాయమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడం ద్వారా,స్వయం పాలన ,మానవ హక్కుల రక్షణ కోసం పోరాటం చేసి బలహీన వర్గాల జీవితాలను మెరుగుపరిచేందుకు తన జీవితాన్ని అంకితం చేసినందుకు ఆమెకు ఈ బహుమతి ప్రకటించబడింది.

ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి కింద రూ.1 కోటి నగదు, ప్రశంసా పత్రంతో కూడిన ట్రోఫీ లభిస్తుంది.న్యూఢిల్లీలోని శక్తి స్థల్ వద్ద ఇందిరా గాంధీ సమాధికి ఉపయోగించిన హెమటైట్ జాస్పర్ అనే రాయి చదరపు ముక్కతో ఈ ట్రోఫీ తయారుచేయబడింది. భారతదేశంలో లభించే అత్యంత గట్టిగా ఉండే రాళ్ళలో ఇదొకటి. ఇది 200 కోట్ల సంవత్సరాల పురాతనమైందని అంచనా.

వెండి అంచుతో ఉన్న రాయిలో ఇందిరా గాంధీ చిత్రపటాన్ని చొప్పించారు. దీనిని జైపూర్ మినియేచర్ (సూక్ష్మ వస్తువు) సంప్రదాయంలో నిపుణుడైన హస్తకళాకారుడు బాబులాల్ మరోటియా చిత్రించారు. దేవనాగరి లిపిలో ఇందిరా గాంధీ పురస్కార్ అనే పదాలు కింద లఖించబడ్డాయి. ఈ ట్రోఫీని వెండి అంచులు కలిగిన రోజ్‌ఉడ్ పెట్టెలో ఉంచారు.

భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ జాతీయ, ప్రపంచ శ్రేయస్సుకు చేసిన విశేష కృషిని స్మరించుకునేందుకు, ఆమె ప్రతిపాదిత లక్ష్యాలను ప్రోత్సహించేందుకు భారతదేశం 1985లో ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతిని ఏర్పాటు చేసింది. దీనిని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తుంది.

అంతర్జాతీయ శాంతి, నిరాయుధీకరణ, జాతి సమానత్వం, దేశాల మధ్య సద్భావన, సామరస్యాన్ని ప్రోత్సహించడం, ఆర్థిక సహకారాన్ని కల్పించడం, కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం; అభివృద్ధి చెందుతున్న దేశాల సర్వతోముఖాభివృద్ధిని వేగవంతం చేయడం; సైన్స్, ఆధునిక జ్ఞాన ఆవిష్కరణలను మానవ జాతి విస్తృత ప్రయోజనం కోసం ఉపయోగించబడుతున్నాయని నిర్ధారించడం; స్వేచ్ఛ పరిధిని విస్తృతం చేయడం, మానవ స్ఫూర్తిని సుసంపన్నం చేయడం వంటి సృజనాత్మక ప్రయత్నాలను గుర్తించి, జాతీయత, జాతి లేదా మతం అనే తేడా లేకుం డా ఒక వ్యక్తి లేదా సంస్థకు ఈ బహుమతిని ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్నారు.





2025 సంవత్సరానికి బహుమతిని ప్రకటిస్తూ, అవార్డు నిర్ణయ జ్యూరీ ఇలా పేర్కొంది : 'భారత ప్రభుత్వ మాజీ జాతీయ భద్రతా సలహాదారు, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి శివశంకర్ మీనన్ అధ్యక్షతన ఉన్న ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి అంతర్జాతీయ జ్యూరీ, 2025 సంవత్సరానికి బహుమతిని ప్రకటించినందుకు సంతోషం వ్యక్తం చేస్తుంది. ఒక విశిష్ట ఆఫ్రికన్ రాజనీతిజ్ఞురాలు, రాజకీయ నాయకురాలు, మానవతావాది మేడమ్ గ్రాసా మాషెల్. స్వయం పాలన, మానవ హక్కుల రక్షణ కోసం పోరాటంలో ఆమె జీవితం పెనవేసుకుంది. అందరికీ మరింత న్యాయమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడం ద్వారా బలహీన వర్గాల జీవితాలను మెరుగుపరచడానికి ఆమె తన జీవితాన్ని అంకితం చేశారు.'

ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ 2026 జనవరి 21వ తేదీన ఒక ప్రకటనలో ఇలా వెల్లడించింది:' 1945 అక్టోబర్ 17న గ్రామీణ మొజాంబిక్‌లోని గ్రాకా సింబినేలో జన్మించిన మేడమ్ గ్రాసా మాషెల్, లిస్బన్ విశ్వవిద్యాలయంలో జర్మన్ అధ్యయనం చేయడానికి స్కాలర్‌షిప్ పొందే ముందు మెథడిస్ట్ మిషన్ పాఠశాలలకు హాజరయ్యారు. అక్కడ ఆమెలో మొదటిసారి స్వాతంత్ర్యం గురించి రాజకీయ స్పృహ రగిలింది. 1973లో మొజాంబిక్‌కు తిరిగి వచ్చిన తర్వాత, ఆమె మొజాంబికన్ లిబరేషన్ ఫ్రంట్ (ఫ్రిలెమో)లో స్వాతంత్ర్య సమరయోధురాలు,ఉపాధ్యాయురాలిగా చేరారు. 1975లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆమె మొజాంబిక్ మొదటి విద్య, సంస్కృతి శాఖ మంత్రి అయ్యారు. ఆమె పదవీకాలంలో పాఠశాలల్లో నమోదులో భారీ పెరుగుదల కనిపించింది. ప్రాథమిక,మాధ్యమిక విద్యార్థుల భాగస్వామ్యం పురుషులలో 40 శాతం నుండి 90 శాతం కంటే ఎక్కువ, మహిళలలో 75 శాతం పెరిగింది.'

1990లలో తన దిశను మాచెల్ ప్రపంచ స్థాయికి మార్చుకున్నారు. పిల్లలపై సాయుధ పోరాట ప్రభావంపై ఒక సెమినల్ అధ్యయనానికి నాయకత్వం వహించేందుకు ఆమెను ఐక్యరాజ్యసమితి నియమించింది. 'ది ఇంపాక్ట్ ఆఫ్ ఆర్మ్‌డ్ కాన్ఫ్లిక్ట్ ఆన్ చిల్డ్రన్ ( పిల్లలపై సాయుధ ఘర్షణల ప్రభావం)' అనే అంశంపై 1996లో ఆమె నివేదిక యుద్ధ ప్రాంతాలలో పని చేసే యుఎన్, దాని సభ్యులు ప్రభావాన్ని తెలియజేసింది. ఆమె అవిశ్రాంత కృషికి ఐక్యరాజ్య సమితి నాన్సెన్ రెఫ్యూజీ అవార్డు లభించింది. 1997లో ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ గౌరవ డేమ్ కమాండర్‌గా నియమించబడినట్లు ట్రస్ట్ తెలిపింది.

'ఆమె నాయకత్వం, అనేక ఉన్నత స్థాయి అంతర్జాతీయ సంస్థలకు విస్తరించిన ఆమె ప్రయత్నాలు సామాజిక–ఆర్థిక అభివృద్ధి రూపాంతరం చెందేలా చేశాయి. ఆమె ది ఎల్డర్స్ వ్యవస్థాపక సభ్యురాలు, గర్ల్స్ నాట్ బ్రైడ్స్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె యుఎన్ సెక్రటరీ జనరల్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అడ్వొకసీ గ్రూప్ సభ్యురాలిగా కూడా పనిచేస్తున్నారు. ఆమె ఆఫ్రికా చైల్డ్ పాలసీ ఫోరం పోషకురాలిగా, మండేలా ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్మెంట్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా ప్రమాదంలో ఉన్న పిల్లలు, యువత లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి విధానాలు, కార్యాచరణపై ప్రభావితం చేస్తున్నారు' అని ఆ ప్రకటన వివరించింది.

'ఇటీవలి సంవత్సరాలలో మాచెల్ తన సొంత సంస్థలు, విద్యావిషయక నాయకత్వం ద్వారా సామాజిక పరివర్తనపై దృష్టి సారించారు.

2010లో, ఆమె గ్రాసా మాషెల్ ట్రస్ట్‌ను స్థాపించారు. ఇది మహిళల ఆర్థిక సాధికారత, ఆహార భద్రత, సుపరిపాలనను ప్రోత్సహిస్తుంది. ఆమె జిజిలే ఇన్‌స్టిట్యూట్ ఫర్ చైల్డ్ డెవలప్‌మెంట్‌ను కూడా స్థాపించారు. 2018లో మహిళలు, యుక్తవయస్కుల శ్రేయస్సుకు ఆమె చేసిన ప్రశంసనీయమైన కృషికి గాను ఆమెకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యున్నత గౌరవం అయిన డబ్ల్యుహెచ్ఓ బంగారు పతకం లభించింది'. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత, క్లిష్ట పరిస్థితులలో మానవతావాద కృషిలో ఆమె చేసిన విప్లవాత్మక కృషికి, మరింత సమానమైన, న్యాయమైన ప్రపంచాన్ని నిర్మించడానికి లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించినందుకు, 2025 సంవత్సరానికి ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకర ణ, అభివృద్ధి బహుమతిని మేడమ్ గ్రాసా మాచెల్‌కు ప్రదానం చేయనున్నారు.

2024 ఇందిరా గాంధీ బహుమతిని చిలీ మాజీ అధ్యక్షురాలు హెచ్.ఇ.వెరోనికా మిచెల్ బాచెలెట్ జెరియాకు ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు, పురుషులకు ఆమె ఒక ఉదాహరణగా, ప్రేరణగా నిలిచి, క్లిష్ట పరిస్థితులలో శాంతి, లింగ సమానత్వం, మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, అభివృద్ధి కోసం స్థిరంగా కృషి చేయడంలో, చిలీతో భారతదేశ సంబంధాలకు ఆమె చేసిన కృషికి గాను ఈ బహుమతిని ప్రదానం చేశారు.

# మేడారం మహా జాతరలో ప్రకృతి–పర్యావరణ రక్షణ ముఖ్యం

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అడవి తల్లి ఒడిలో జరిగే ఆధ్యాత్మిక వేడుక మేడారం జాతర. అయితే, ఈ భక్తి ప్రవాహం వెనుక పర్యావరణ విధ్వంసం పొంచి ఉన్న పరిస్థితుల్లో ప్లాస్టిక్ రహిత జాతర సాధ్యమేనా అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. ఈ తరుణంలో గిరిజన సంస్కృతిని కాపాడుతూనే ప్రకృతిని రక్షించుకునేలా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందనేది మరువకూడదు.

ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో జరిగే ఈ జాతరకు గతంలో సుమారు కోటిన్నర మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా. ఈసారి రెండు కోట్ల జన సముద్రం తప్పదని అంచనాలు కూడా వస్తున్నాయి. వనదేవతల జాతరను ఆధునికరిస్తూ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో జనాలు పాల్గొనే అవకాశం గతంకంటే ఎక్కువగా ఉన్నది. పర్యావరణపై ఒత్తిడి పడటం సహజం.

జాతరలో పారిశుద్ధ్య, ప్లాస్టిక్ నిర్వహణ, జాతర ముగిశాక మిగిలే ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు పొంచి ఉంది. అడవి తల్లి ఒడిలో చేరుతున్న ప్లాస్టిక్ పర్యావరణాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నది. ఇది ప్రభుత్వానికి,అధికారులకు, నిర్వహాకులకు పెద్ద సవాల్ గా మారనున్నది. ఏటా జాతర తర్వాత అభయారణ్యంలో విచ్చలవిడిగా పేరుకపోతున్న ప్లాస్టిక్ ఇటు పర్యావరణానికి, అటు మూగజీవులకు ప్రాణసంకటంగా మారుతున్నది. గత జాతరలో ఏకంగా 12 వేల టన్నుల చెత్త పేరుకుపోగా.. అందులో సగభాగం ప్లాస్టిక్ భూతమే. ఈసారి 2 కోట్ల మందికి పైగా జనం వస్తుండటంతో. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

జాతరకు వచ్చే భక్తులను ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్స్ తీసుకురావద్దని ఫారెస్ట్ ఆఫీసర్లు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ.. ప్రధాన జాతర జనవరి 28 నుండి 31 వరకు ఉన్నందున లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇప్పటికే గత నెల రోజులుగా వేల సంఖ్యలో భక్తులు వచ్చి పోతున్నారు. టన్నుల కొద్దీ త్రాగి పారేసిన ఖాళీ బాటిల్స్ ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. దీనితో నేల, నీరు, గాలి కలుషితం.. అటవీ ప్రాంతం కావడంతో వన్యప్రాణులపై ఎఫెక్ట్. జాతర ముగిసిన తర్వాత టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇస్తరాకులు, గాజు సీసాలు అడవిలోనే మిగిలిపోతున్నాయి. ఇది వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారుతుంది.

**నేల, నీరు, గాలి కలుషితం కాకుండ చూడాలి!**

ఇక మరోవైపు పవిత్రంగా భావించే జంపన్న వాగులో భక్తులు స్నానాలు ఆచరించే సమయంలో సబ్బులు, షాంపులు వాడటం దుస్తులు వదిలి వేయడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఇలాంటి గతకాలపు అనుభవాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. ఇంకోవైపు ప్రభుత్వం ప్రతి ఏటా కోట్లాది రూపాయలను జాతర ఏర్పాట్ల కోసం ఖర్చు చేస్తుంది. గతం కంటే కూడా ఈసారి బడ్జెట్ పెంచి అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రణాళికలు కూడా రచించింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఈసారి ఈ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. వేల సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి, ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా 'స్వచ్ఛ మేడారం' కార్యక్రమం తోడ్పాటును అందించాలి. అడవికి హాని కలగకుండా పర్యావరణహితమైన తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అలాగే 'మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడకండి.. పర్యావరణాన్ని రక్షించండి ' అని ప్రభుత్వం నినాదంగా ముందుకు సాగడం మంచి విషయమే. కానీ, ఈ జాతరలో లక్షలాది మంది భక్తుల వసతికి సంబంధించి తాత్కాలిక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించాలి. కల్తీ మద్యం, మాంసం పట్ల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత సర్కార్ దే.



**ప్లాస్టిక్ ఫ్రీ మేడారానికి భక్తులు సహకరించాలి:**

నదులు, అడవులు కాలుష్యం కావటం, పర్యావరణానికి ప్రమాదం. ఇవి జాతర ప్రభావంతో మరింత తీవ్రమవుతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రయత్నాలు ఎన్ని ఉన్నా, క్షేత్రస్థాయిలో కొన్ని సవాళ్లు ఎదురవక తప్పదు. ఇలాంటి స్థితిలో భక్తుల్లో పర్యావరణం పట్ల అవగాహన పెరగాలి. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించడం పుణ్యంగా భావించేవారు, అడవిని శుభ్రంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. జంపన్న వాగు శుద్ధి కోసం అత్యాధునిక ఫిల్టరేషన్ పద్ధతులను ప్రవేశపెట్టాలి. జాతర పరిసరాల్లోనే వ్యర్థాలను వేరు చేసి అవకాశాలు ఉంటాయి.

మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం ట్రస్ట్ ఏర్పాటు చేసింది. ఈ ట్రస్టు ప్రత్యేకంగా జాతరకొచ్చే అసంఖ్యాక భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఈ చెత్తనంతా ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు 24 గంటలు షిఫ్టుల్లో పనిచేసేలా 10 వేల మంది పారిశుద్ధ కార్మికులను నియమించారు. చెత్త తరలింపునకు ట్రాక్టర్లు, జెసిబిలు, డోజర్లను సిద్ధం చేశారు. జాతరలో బలి ఇచ్చే కోళ్లు, మేకల వ్యర్థాలతో దుర్వాసన రాకుండా వాటిని బయో ప్లాంట్ కు తరలించి శాస్త్రీయంగా నిర్మూలించనున్నారు. వాష్ రూమ్, మరుగుదొడ్ల నుంచి వాసన రాకుండా కెమికల్స్ స్ప్రే చేస్తున్నారు. ఫినాయిల్ ఇతర రసాయనాలను వాడనున్నారు. రోజు ఫాగింగ్ చేసేలా ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. భక్తుల సహకారం లేనిదే ప్లాస్టిక్ ఫ్రీ మేడారం సాధ్యం కాదని, ఇంటి నుంచి వచ్చేటప్పుడే ప్లాస్టిక్ సంచులు తీసుకురావద్దని, గుడ్డ సంచులు తెచ్చుకోవాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు.

మేడారం కేవలం ఒక జాతర మాత్రమే కాదు, అది గిరిజన అస్తిత్వానికి ప్రతీక. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, భక్తులు సమన్వయంతో పని చేసినప్పుడే అడవి తల్లి ఒడి చల్లగా ఉంటుంది. పర్యావరణాన్ని కాపాడుకుంటూ జరుపుకునేదే అసలైన జాతర.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె..
## స్తంభించిన లావాదేవీలు




ప్రజాపక్షం/కౌటాల : బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా మండలంలో ఆర్థిక లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయాయి. వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు మంగళవారం ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో కౌటాల మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలు మూతపడ్డాయి. సమ్మె కారణంగా ప్రజలు రోజు బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, ఉపసంహరణలు వంటి ముఖ్యమైన సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల నిమిత్తం బ్యాంకులకు వచ్చిన వారు తిరిగి వెనుదిరగాల్సి వచ్చింది. బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోవడంతో వ్యాపార, వాణిజ్య లావాదేవీలపై కూడా ప్రభావం పడింది



## బైక్‌పై ఎమ్మెల్యే గిరిజన గ్రామాల పర్యటన

ప్రజాపక్షం/నేరడిగొండ : మండలంలోని కనీస అవసరాలైన రోడ్డు మార్గం లేని మారుమూల గిరిజన ప్రాంతాలైన దంప్ప తండా,సుద్దాపూర్,రేంగన్వాడి,గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్,తన వాహనంపై వెళ్ళి పరిస్థితులలో ద్విచక్ర గ్రామాలను పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామ ప్రజలు వారి సమస్యలను ఏకరుపెట్టారు.ఈ సదర్భంగా మాకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లయితే అన్ని సమస్యలకు పరిష్కారం దొరికినట్లేనని అన్నారు.ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే రాని గ్రామానికి మీరు వచ్చినందుకు సంతోషంగా ఉన్నామని మా సమస్యలు తీరుస్తారని దానికి నిదర్శనమే నూతనంగా నిర్మించిన గ్రామసీటీ బోరు అని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మారుమూల గ్రామ ప్రజలకు భరోసాని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అక్షర ఆయుధం 'ప్రజాపక్షం'

ముధోల్ గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజొద్దీన్

ప్రజాపక్షం/ముధోల్ : ప్రజల సమస్యలను వెలికితీసి పరిష్కారమయ్యేలా అక్షరంతో ఆయుధంలా ప్రజాపక్షం ముందుకెళ్తోందని ముధోల్ గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజొద్దీన్ కొనియాడారు.మంగళవారం మండల కేంద్రంలో ముధోల్ మండల పాత్రికేయులు సునీల్‌తో కలిసి ప్రజాపక్షం 2026వ నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సమాచారం అందించడంలో కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం కథనాలు రాస్తూ ప్రజా పత్రికగా నిలుస్తోందన్నారు. అదేవిధంగా తాము ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ప్రజాపక్షం పత్రికలో ప్రచురిస్తున్నందుకు పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్ రెడ్డి, అబిద్, ఇమ్రాన్ ఖాన్, అజీజ్ ,అజర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హక్కు కోసం కార్మికుల పోరాటం

కూలీలకు మద్దతుగా నిలిచిన సర్పంచ్

ప్రజాపక్షం/నిజాంసాగర్ : నిజాంసాగర్ మండలంలోని బంజేపల్లి పంచాయతీలో ఉపాధిహామీ చట్ట పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ బలమైన సందేశం ఇచ్చింది. ఏఐసీసీ మరియు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆదేశానుసారం ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు సూచనలతో సర్పంచ్ ఏలే సుగుణమ్మ ఆధ్వర్యంలో కార్మికులు బలమైన సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ హక్కులను యథాతథంగా కొనసాగించాలని, దాని స్థానంలో తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఉపాధిహామీ హక్కు ప్రజల మౌలిక హక్కు అని స్పష్టం చేస్తూ కేంద్రప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భీంరావు, ఉపసర్పంచ్ అనిల్ పటేల్, రమేష్, లక్ష్మణ్‌రావ్, జమీల్, పసుల రాములు, సత్యగౌడ్, కిషోర్, రాములుగౌడ్, కృష్ణమూర్తి, ప్రశాంత్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

## షెడ్యూల్ విడుదలతో నగరంలో సందడి

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాపక్షం/నిజామాబాద్ : నిజామాబాద్ బల్దియాలోని 60 డివిజన్లలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపనుంది. ఈసారి మాత్రం ఇరు పార్టీల మధ్య పోరు గట్టిగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా మజ్లిస్ పార్టీ 25 డివిజన్లలో పోటీ చేయనున్నట్లు సమాచారం. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో ప్రధాన పార్టీల నుంచి నగరంలోని ప్రముఖులు పోటీకి సై అంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న సమాచారంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నగరంలో గత వారం రోజులుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి తమ అధిపత్యాన్ని చాటుకున్నారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లోతో ఒక్కసారి సందడి నెలకొన్నది.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలన

ప్రజాపక్షం/బోధన్ : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని విజయ మేరీ హై స్కూల్‌లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం బోధన్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల సామాగ్రిని పంపిణీ కోసం విజయ మేరీ పాఠశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతపరమైన అంశాలను పరిశీలన చేశారు. సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఇతర అధికారులతో డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట హసీల్దార్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

### ఎన్నికల సంఘం నియమనిబంధనలకు అనుగుణంగా...
# ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలుగా సిద్ధం

మున్సిపల్ ఎన్నికలను సాఫీగా నిర్వర్తించాలి

కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం




ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎలాంటి అవాంతరాలు, లోటుపాట్లకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా సాఫీగా జరిపించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డిలతో కలిసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమనిబంధనలకనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్నివిధాలుగా సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, బీమ్‌గల్ మున్సిపాలిటీలు ఉన్నాయని మొత్తం 146 వార్డులకు ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తూ బుధవారం నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కామారెడ్డి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ మధుమోహన్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్‌కలెక్టర్లు వికాస్‌మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మేడారం భక్తుల కోసం
# 24 గంటల వైద్య శిబిరం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్.అనిత

ప్రజాపక్షం/మంచిర్యాల : శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం 24 గంటల పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్.అనిత తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో ఆర్టీసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం బస్సుల శిబిరం వద్ద ఆమె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యులను, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. శిబిరంలో అత్యవసర మందులతో పాటు 108 అంబులెన్స్ సేవలను కూడా సిద్ధంగా ఉంచామని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య పరమైన జాగ్రత్తలు పాటిస్తూ అమ్మవార్లను దర్శించుకోవాలని ఆమె సూచించారు. జాతరకు వెళ్లే ప్రతి భక్తుడికి వైద్య ఆరోగ్య శాఖ తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తిన వెంటనే శిబిరాన్ని సందర్శించి చికిత్స పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మునిసిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారిణి ఐ.రాణి కుమిదిని మంగళవారం మునిసిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్‌లకు రెండవ సాధారణ ఎన్నికలు 2026 ఎన్నికల షెడ్యూల్ ప్రకటన ప్రకారం బుధవారం 28న నామినేషన్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడుతుంది. 28వ తేదీ బుధవారం రిటర్నింగ్ అధికారి ద్వారా యూఎల్‌బిల వార్డుల వారి ఓటరు జాబితా ప్రదర్శన ఉంటుంది. 30వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి చివరితేదీ, సమయం ప్రకటించారు.

31వ తేదీ శనివారం నామినేషన్ల పరిశీలన పూర్తిచేయడం, ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం నామినేషన్ల తిరస్కరణపై అప్పీలు, సాయంత్రం 5 గంటల వరకు, ఫిబ్రవరి 2వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల వరకు అప్పీళ్ల పరిష్కారం, 3వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థి నామినేషన్ల ఉపసంహరణ, మూడోతేదీ మంగళవారం పోటీచేస్తున్న అభ్యర్థుల తుదిజాబితా ప్రచురణ, మధ్యాహ్నం 3గంటల నుండి ఉంటుంది. పోలింగ్ 11వ తేదీ బుధవారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, 12వ తేదీ గురువారం అవసరమైన చోట రీపోలింగ్, 13వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఉంటుందని రాష్ట్ర ఎన్నికల అధికారిణి రాణి కుమిదిని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్

ప్రజాపక్షం/హాజీపూర్ : జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి పక్కాగా చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన వసతులు, భద్రతాపరమైన చర్యలు పూర్తిస్థాయిలో ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. అన్వేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

ప్రజాపక్షం/నస్పూర్ : రాష్ట్రంలో పారదర్శకమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ప్రవర్తన నియమావళి పక్కాగా అమలులో ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. అధికారుల సమన్వయంతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

ప్రజాపక్షం/మంచిర్యాల : షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని పట్టుదలతో చదవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌సి వసతి గృహంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రేరణ, అవగాహన తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని, తద్వారా తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విషయ నిపుణులైన ఉపాధ్యాయులు అందించే మెలకువలను పాటించి అన్ని సబ్జెక్టులలో వంద శాతం మార్కులు సాధించాలని ఆయన సూచించారు. వార్షిక ఫలితాల్లో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. వసతి గృహాల్లో విద్యార్థుల కోసం స్పెషల్ డైట్, స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్ రావు, ఎస్‌సి అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, విద్యాధికారి యాదయ్య, సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, బిసి అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి




కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు.నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని,ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ,ఎన్నికల ప్రక్రియను పారదృకంగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.వీడియో కన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందింరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల,అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్‌కుమార్,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీసీఈవో శంకర్,డీఈవో భోజన్న, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు సాఫీగా నిర్వర్తించాలి

కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం దిశానిర్ధేశం

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎలాంటి అవాంతరాలు, లోటుపాట్లకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా సాఫీగా జరిపించాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిలతో కలిసి రాష్ట్ర ఎ న్నికల కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, మున్సిపల్ కమీషనర్లకు దిశా నిర్ధేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, బీమ్‌గల్ మున్సిపాలిటీలు ఉన్నాయని మొత్తం 146 వార్డులకు ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల కమీషనర్ దృష్టికి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తూ బుధవారం నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు కమీషనర్ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కామారెడ్డి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ మధుమోహన్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమీసనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు కలెక్టర్ పాఠాలు



ప్రజాపక్షం/బోధన్ : బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థినులను వారి తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలన్నారు. అంతకుముందు 8వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి వారి సామార్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.

కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఎంఈఓ నాగయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

నేటి నుంచి 30వ తేదీ వరకూ నామినేషన్లు

11వ తేదీన ఎన్నికలు,13 న కౌంటింగ్ ఫలితాలు

కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/మెదక్ : మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. మెదక్, రామయంపేట్, నర్సాపూర్,తూప్రాన్ మున్సిపాలిటీలల్లో జరిగే ఎన్నికలకు ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే విడుదల చేశారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ, వార్డులకు రిజర్వేషన్లను సైతం ప్రకటించారు. నాలుగు మున్సిపాలిటీలల్లో 75 వార్డులు ఉన్నాయి.మెదక్ మున్సిపాలిటీ లో 32 వార్డులు, నర్సాపూర్ లో 15 వార్డులు, తూప్రాన్ లో 16 వార్డులు, రామాయంపేటలో 12 వార్డులు ఉన్నాయి.జిల్లాలో 75 వార్డులకు 150 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 87,615 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి..కలెక్టర్ రాహుల్ రాజ్**

ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల కోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో మెదక్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా , పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణకు 28 వ తేదీ నుంచి 30 వరకు ఉంటుంది.31 వ తేది నామినేషన్ల పరిశీలన,నామినేషన్లపై అభ్యంతరాలు 01 వ తేదీ,అభ్యంతరాలకు 02 వ తేదీ, నామినేషన్ల ఉపసంహరణకు 03 వ తేదీ వరకు గడువు,



బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను 03 విడుదల చేస్తారు. పోలింగ్ 11వ తేదీ, రీపోలింగ్‌కు 12 న అవకాశం. కౌంటింగ్ 13 వ తేదీ ఉదయం 8 గంటల నుండి ఉంటాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు కలెక్టర్ నగేష్ , జెడ్పి సీఈవో ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎస్పీలు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.




## ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ

**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పట్టణ కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు పట్టణంలోని అర్హులైన 168 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల మంజూరు పత్రాలను మున్సిపల్ కమిషనర్ ఆద్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ భూంరెడ్డి, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ కొట్టె అశోక్, నాయకులు వొల్లాల కృష్ణహరి, మునిగాల చందు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఏర్పాట్లు పూర్తి చేయాలి



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్‌ఓసీ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ఉన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఈ టెక్నో విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాషలో పట్టు సాధించాలని, పట్టు సాధించడం ద్వారా అనేక అవకాశాలు ఉంటాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ చాలా అవసరమని, భాష ద్వారా అనేక ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంగ్లీష్ భాష మీద పట్టు సాధించడానికి శ్రద్ధ వహించాలని, సాధన చేయటానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన ఎస్ఓఎఫ్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందినపలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. సైదా ఝూన్ జహాన్ (5వ తరగతి), సిహెచ్ ప్రజ్ఞసాయి (6వ తరగతి), పి.శాన్వి (6వ తరగతి), ఎస్.విశాల్ (6వ తరగతి), ఆయేషా (7వ తరగతి), ఏ.అక్షయగ్న రెడ్డి (7వ తరగతి), మొహమ్మద్ అబ్దుల్ అర్హమ్ (7వ తరగతి), సిహెచ్ విగ్నేష్ (8వ తరగతి), పి.శృతి సాగర్ (8వ తరగతి) అత్యుత్తమ ప్రదర్శనే కాకుండా బంగారు పతకాలు గెలుచుకోవడం హర్షించదగ్గ విషయమని తెలుపుతూ విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విమర్శలు వారి విజ్ఞతకే వదిలేస్తున్నా

జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** సీనియర్ నాయకులు పని కట్టుకొని విమర్శలు చేస్తున్నారని స్పందిస్తూ మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం బిఆర్ఎస్‌లో గెలిచి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక నిధులు 62.5 కోట్లు జగిత్యాలకు మంజూరు అయ్యాయని సీనియర్ నాయకులు పని కట్టుకొని విమర్శలు చేస్తున్నారన్నారు. జగిత్యాల మున్సిపాలిటీ అవినీతి మయం అని సీనియర్ నాయకులు అంటున్నారు. అవినీతి చేసిన అధికారులపై ఏసీబీ దాడులు విజిలెన్స్ దాడులు జరిగి అవినీతి అధికారులు జైలుకు వెళ్లారు. నేను ఎమ్మెల్యేగా అధికార పార్టీలో ఉంటే నాకు అవినీతితో సంబంధం ఉంటే వారు జైలుకు వెళ్లేవారా.. నాకు సంబంధం లేదు కనుకనే వారు జైలుకు వెళ్లారు. రాయికల్ జగిత్యాల పట్టణ అభివృద్ధికి టెండర్లు ఇంకా ఆన్లైన్లో తెరిచి ఉన్నాయి. సీనియర్ నాయకులు మీ దగ్గర వారితో టెండర్ వేయించి పనులు పూర్తి చేసి జగిత్యాల అభివృద్ధికి మీ వంతుగా కృషి చేయండి అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువల జ్యోతి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గట్టు సతీష్, దామోదర్ రావు, జిలానీ, దుమాల రాజ్ కుమార్, జగిత్యాల పట్టణ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన జింక గంగాధర్ (48) సోమవారం స్నానం చేస్తున్న క్రమంలో కాలుజారి కెనాల్లో పడి గల్లంతయ్యాడు. మంగళవారం కుటుంబ సభ్యులు గాలిస్తున్న క్రమంలో గ్రామ శివారులో మృతదేహం లభించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తమ్ముడు జింక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# జిల్లాల కుదింపు ఇప్పట్లో లేదు

రాజన్న ఆలయ అభివృద్ధిపై రాజకీయాలొద్దు

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/ వేములవాడ :** తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల కుదింపు అపోహ మాత్రమే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భీమేశ్వరాలయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినానంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శవంతంగా నిలుపుతామన్నారు. ప్రజా పాలనలో పేద ప్రజలందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలను జిల్లాలను కుదిస్తున్నారంటూ ప్రతిపక్షాలు అసత్య ప్రచారాన్ని చేస్తున్నాయని ప్రజలు అపోహలకు తావు ఇవ్వద్దని అన్నారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పొన్న ప్రభాకర్ ఆరా తీశారు. రాజన్న ఆలయంతో పాటు పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరి పై ఉండాలనీ వేడుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సందర్భంలో ఫిబ్రవరిలో ఎన్నికలు జరగున్నాయనీ 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయనీ అనివార్య కారణాల వల్ల 10 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగడం లేదన్నారు. వేములవాడ బస్ స్టేషన్ ఆది శ్రీనివాస్ కోరిక మేరకు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్‌కు సహకరించాలని రాబోయే ఎన్నికల్లో మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**దేవాలయ అభివృద్ధిపై సమీక్షించాం : ఆది శ్రీనివాస్**

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజన్న ఆలయ అభివృద్ధిపై, కొనసాగుతున్న పనులపై సమీక్షించామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో, సర్పంచ్ ఎన్నికల్లో మీరు ఇచ్చిన ఆశీర్వాదం మున్సిపల్ ఎన్నికల్లో ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధార్మిక కార్మిక క్షేత్రం. కవిత హరీష్ రావు , కేటీఆర్, సంతోష్‌రావుపై చేసిన ఆరోపణలు గత ప్రభుత్వంలో అక్రమాలు అవినీతి జరిగిందని చెప్పిందనీ వాటికి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్‌లో నూతన వాహనాలు ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్ :** నగర పారిశుద్ధ్యాన్ని, మంచినీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను వాడుకలోకి తెచ్చామని స్పెషల్ ఆఫీసర్ పమేలా సత్పతి, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం నగరంలోని కోర్టు సమీపంలోని మంచినీటి రిజర్వాయర్‌లో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి జిల్లా కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ పమేలా సత్పతి చెత్త సేకరణ వాహనాలతో పాటు నీటి సరఫరా ట్యాంకర్లను వాడకలోకి తీసుకొచ్చారు. నగరపాలక సంస్థ నిధులతో నూతనంగా 25 ట్రాక్టర్లు, 10 స్వచ్ఛ ఆటోలు మరో 10 వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేశారు. పారిశుధ్యం మెరుగు, వేసవి కాలంలో మంచి నీటి సరఫరాపై ఇంజనీరింగ్, సానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. నగరంలో పారిశుధ్య పనులను ఇంకా మెరుగు పరచాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వాహనాన్ని వినియోగించి పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఎక్కడ రోడ్లపై చెత్త కనపడకుండా స్వీపింగ్ పనులు చేయాలని అన్నారు. వచ్చే వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా అవసరమైన చోట ప్రజలకు నీటిని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ దిలిప్ కుమార్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, ఈఈ శివానందం, డీఈ లచ్చిరెడ్డి, ఎంహెచ్ఓ సుమన్, సానిటేషన్ సూపర్ వైజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాల్టీలకు ఎన్నికలు

నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ



**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో మూడు మున్సిపాల్టీలతో పాటు ఒక కార్పోరేషన్‌కు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంటతో పాటు కరీంనగర్ కార్పోరేషన్‌కు ఎన్నికలు జరుగనున్నాయి. జమ్మికుంట మున్సిపాల్టీలో 30 వార్డులుండగా 34,455 మంది ఓటర్లున్నారు. అందులో మహిళలు 17,639 మంది, పురుషులు 16815 మంది కాగా ఇతరులు ఒకరు ఉన్నారు. హుజురాబాద్ మున్సిపల్ లో 30 వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా 29,531 మంది ఓటర్లున్నారు. అందులో మహిళలు 15,170, పురుషులు 14,357 మంది కాగా ఇతరులు నలుగురు ఉన్నారు. చొప్పదండి మున్సిపాల్టీలో 14 వార్డులలో 13,916 మంది ఓటర్లుండగా మహిళలు 6743 మంది, పురుషులు 7173 మంది ఉన్నారు. కరీంనగర్ కార్పోరేషన్‌లోని 66 డివిజన్ లలో 3,40,580 మంది ఓటర్లున్నారు. ఇందులో 1,70.858 మహిళా ఓటర్లుండగా 1,69,679 మంది పురుషులు, 43 మంది ఇతర ఓటర్లున్నారు. కరీంనగర్ కార్పోరేషన్ మేయర్ పదవిని బిసి జనరల్ కు కెటాయించారు.జమ్మికుంట మున్సిపల్ చైర్ పర్సన్ పదవి ఎస్సీ జనరల్ కు కెటాయించగా, హుజురాబాద్, చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ ను ఎస్సీ మహిళకు కెటాయించారు. బరిలో నిలిచే అభ్యర్థులు ఇప్పటికే అన్ని విధాలుగా ఎన్నికలకు సిద్ధం కాగా రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాలను సర్వేల ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

**నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్ల పరిశీలన**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించి డివిజన్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభ్యర్థులు వచ్చే మార్గం వెళ్లే మార్గం వేరువేరుగా ఉండాలని, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్‌కు చేసిందేమీ లేదు



మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్


**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ నగరంలోని తొమ్మిదవ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంగళవారం ప్రారంభించారు. కోతి బొమ్మ చౌరస్తా నుంచి, డివిజన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ పార్టీల ప్రభుత్వాల పాలనలో తెలంగాణ రాష్ట్రం నలబై, యాబై ఏళ్లు దరిద్రాన్ని అనుభవించిందన్నారు. ఈ రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ నగరానికి రెండు రూపాయల కూడా తీసుకురాలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన నిధులతో అభివృద్ధి చేస్తూ తామే ఆ నిధులు తీసుకువచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటూ ఫోటోలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాలకాలంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏంటో, రెండేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన విధ్వంసం ఏంటో విజ్ఞులైన ప్రజలు గమనించాలనీ కోరారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు ఓటేస్తే మళ్లీ 50 ఏళ్లు దరిద్రానికి స్వాగతం పలికనట్టు అవుతుందన్నారు. ఈ రెండేళ్ల కాలంలో చేయని అభివృద్ధి మూడేళ్లలో ఏం చేస్తారని ప్రశ్నించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ పీఠం బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు బిఆర్ఎస్ పార్టీ నగరశాఖ అధ్యక్షులు చల్ల హరి శంకర్, స్థానిక డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జంగిలి లత ఐలెందేర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు మర్రి భావన సతీష్, దిండిగాల మహేష్, గందె మాధవి మహేష్, నలువాల రవీందర్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్, మీడిదొడ్డి నవీన్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో వేడెక్కిన రాజకీయాలు

నేటినుండి నాలుగు మున్సిపాల్టీల్లో నామినేషన్ల స్వీకరణ

ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్న ప్రధాన రాజకీయపార్టీలు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ షెడ్యూల్ వెలువడటంతో సిద్దిపేట జిల్లాలో 5 మున్సిపాల్టీలకు గాను నాలుగు మున్సిపాల్టీలకు ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలోని స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీ సిద్దిపేటకు మరో మూడు నెలలకుపైగా గడువు వుండటంతో ఎన్నికలు జరగటం లేదు. జిల్లా పరిధిలోని గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాల్టీలకు ఎన్నికలు జరుగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలు జరిగే నాలుగు మున్సిపాల్టీలు, 72 వార్డులకు నేటి నుండి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల కోసం ఆయా మున్సిపాల్టీలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించి 13న ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. హుస్నాబాద్‌లో 20 వార్డులు, దుబ్బాకలో 20, గజ్వేల్‌లో 20, చేర్యాలలో 12 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. హుస్నాబాద్ చైర్మన్ ఎస్సీ జనరల్, చేర్యాల మున్సిపల్ చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు. గజ్వేల్, దుబ్బాక చైర్మన్ పదవులకు బిసి మహిళలకు రిజర్వు కాబడినాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. హుస్నాబాద్ నుండి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఎలాగైన మున్సిపల్ పీఠాన్ని హస్తగతం చేసుకోవటానికి పావులు కదుపుతున్నారు. అలాగే చేర్యాల మున్సిపాల్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపాల్టీకి డిసిసి అధ్యక్షురాలు అంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలు, దుబ్బాక మున్సిపాల్టీని ఎమ్మెల్యే కొత్త ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నారు. అలాగే ఎంపి రఘునందన్‌రావు సైతం మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవటానికి తనదైన శైలీలో ఎత్తులు వేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలో కౌన్సిలర్ల టికెట్లకు తీవ్ర పోటీ నెలకొంది. అలాగే ప్రధాన పార్టీల నుండి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు టికెట్ రాని పక్షంలో స్వతంత్రంగా రంగంలో బరిలో ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వీరితో పాటు కొంతమంది స్వతంత్రులు సైతం ఈ మున్సిపల్ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి.




## ఆసక్తి కలిగేలా బోధన ఉండాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాల అంటే విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా తనిఖీ బృందం నోడల్ అధికారి కోమ్మిడి లక్ష్మన్న అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని సాతారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా తనిఖీ బృందం పరిశీలించింది. ఈ మేరకు పాఠశాలలోని మౌలిక వసతులు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల రికార్డుల నిర్వహణ ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించి పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతుల నిర్వహణ ,స్లిప్ టెస్ట్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి ఫలితాల ఆధారంగా గ్రూపులుగా విభజించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పాఠశాల అంటే ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు శ్రీనివాసరావు ,రామస్వామి, ధర్మేందర్, శ్రీధర్ ,రవీందర్, శ్రీనివాస్, శంషుద్దీన్, లక్ష్మీ నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేషగిరి, ప్రకాష్, మల్లేశం ,హరికృష్ణ, అర్చన, కాజా మొయినుద్దీన్, స్వామి, చంద్రకళ ,గీత, రాజేంద్రప్రసాద్, శేషగిరి, తదితరులు ఉన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో యూఎఫ్‌బియూ నాయకత్వం ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం నిరసన, ర్యాలీ విజయవంతమైంది. యూనియన్ బ్యాంక్ బస్‌స్టేషన్ శాఖ నుండి గీతాభవన్ మీదుగా తిరిగి బస్‌స్టేషన్ వరకు సుమారు 500 మంది బ్యాంక్ ఉద్యోగులు ర్యాలీగా సాగారు. అనంతరం యూనియన్ బ్యాంక్ బస్ స్టేషన్ శాఖ ముందు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని, 5 రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయాలి అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల ఐక్యత, ఉద్యమ సంకల్పం మరింత స్పష్టంగా కనిపించిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, దామోదర్ వి (యూఎఫ్‌బియూ సెక్రటరీ), నిఖిల్, సిహెచ్.పోచయ్య (ఎస్‌బిఐ), శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్. సిహెచ్, ప్రవీణ్ (కెడిసిసి బ్యాంక్), మాధవరావు, రాజు, హరి, శరత్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.


## జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సుల్తానాబాద్‌కు చెందిన విద్యార్థి ఎం.మల్లేష్ అద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు.నారాయణపేట జిల్లాలో ఈ నెల 18, 19, 20 తేదీలలో నిర్వహించిన 35వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ అండర్14 బాలుర ఖోఖో పోటీలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సుల్తానాబాద్‌కు చెందిన విద్యార్థి ఎం.మల్లేష్ అద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ఎంపికతో అతడు తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమాచార్య, వైస్ ప్రిన్సిపల్ కే.కోటి, పి.రాజ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పీడీ.డి.ప్రసాద్, పీఈటీ సురేందర్లు వెల్లడించారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరగనున్నట్లు తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థిని పెద్దపల్లి జిల్లా పీఈటీ అధ్యక్షులు వి.సురేందర్ కార్యదర్శి డీ.రమేష్, సుల్తానాబాద్ పీఈటీ కార్యదర్శి ప్రణయ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్, పెద్దపల్లి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి వేల్పుల కుమార్, అధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి ఈ.నరేష్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


## కెటిఆర్ ఇలాకాలో బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ కౌన్సిలర్లు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిరిసిల్ల కేటీఆర్ ఇలాకాలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది, సిరిసిల్లలో అధికార పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతుంది, సిరిసిల్ల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు వెల్దండి దేవదాస్, దూస వినయ్ ,గౌడరాజు పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్,నాయకులు మండల సత్యం,గోవిందు రవి, ఆడెపు భాస్కర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిలు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరామని తెలిపారు. 10 సంవత్సరాల పరిపాలనలో ప్రజలకు న్యాయం జరగలేదని ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాలను, దృష్టిలో ఉంచుకొని ప్రజాపాలన కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. ఇక్కడ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, గడ్డం నరసయ్య, ఆకునూరి బాలరాజు, వెలుముల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్ తదితరులు ఉన్నారు.

## రేకుర్తిలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన సుడా చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** రేకుర్తిలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మంగళవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# క్రికెట్‌కే కాదు.. మానవాళికి అతిపెద్ద శత్రువు రాజకీయాలే!



భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలు దెబ్బతిని పుష్కరకాలం దాటుతోంది. ద్వైపాక్షిక సిరీస్‌ల ఊసే లేకపోగా ఐసిసి ఈవెంట్లలోనే ఇరుజట్లు తలపడుతున్నాయి. నిరుడు ఆసియా కప్‌లో ఎదుపడిన చిరకాల ప్రత్యర్థులు.. ఈసారి పొట్టి ప్రపంచకప్‌లో శ్రీలంక వేదికగా ఢీ కొట్టనున్నాయి. దాయాదుల హైఓల్టేజ్ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. మాజీ స్పిన్నర్ సక్లెయిన్ ముస్తాక్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇరుదేశాల మధ్య క్రికెట్ సంబంధాలు క్షీణించడానికి రాజకీయాలే కారణమని అతడు మండిపడ్డాడు.

భారత్‌లో వరల్డ్ కప్ ఆడబోమని పట్టుపట్టిన బంగ్లాదేశకు మద్దతిచ్చిన పాకిస్థాన్.. చివరకు ఐసిసి ఇచ్చిన షాక్‌తో తోకముడిచింది. బంగ్లాదేశ్‌ను తప్పించగానే పిసిబి చీఫ్ మొహ్సిన్ నక్వీ 'మా జట్టు ఆడుతోందో లేదో తెలియద'ని కామెంట్ చేసి అగ్గి రాజేయాలనుకున్నాడు. కానీ, బంగ్లాకు పట్టిన గతే తమ జట్టుకు పడతుందని వెనక్కి తగ్గాడు. మరునాడు స్క్వాడ్ను ప్రకటించారు సెలెక్టర్లు. ఎప్పటిలానే భారత్, పాకిస్థాన్ జట్లు తటస్థ వేదికపై ఆడబోతున్నాయి. దాయాదుల క్రికెట్ సంబంధాల గురించి సక్లెయిన్ ముస్తాక్ మాట్లాడుతూ రాజకీయాలే ఇరుదేశాల మధ్య క్రికెట్‌కు అవరోధంగా మారాయని అన్నాడు. 'నా దృష్టిలో రాజకీయాలు మానవాళికి ప్రమాదకరం. కాబట్టి వీటిని రద్దు చేయాలి. రాజకీయాలు మనందరి శత్రువు. క్రికెట్‌కు మాత్రమే నాశనం చేయడం లేదు.. యావత్ మానవాళి ఈ రాకాసికి బలవుతోంది. పాలిటిక్స్ కారణంగా క్రికెట్కు, ఆటగాళ్లకు మాత్రమే నష్టం వాటిల్లడం లేదు. క్రికెట్ అనేది దేశాలను కలపాలి తప్ప విడగొట్టకూడదు. క్రికెట్ అనేది వినోదం కోసం. ఇదేమీ యుద్ధభూమి కాదు. భారత్‌లో ప్రపంచ కప్ ఆడకూడదనుకున్న బంగ్లాదేశ్‌పై నేను కామెంట్ చేయదలచుకోలేదు. నేను ఇదివరకే రాజకీయాలపై నమ్మకం లేదని చెప్పాను' అని ముస్తాక్ కామెంట్ చేశాడు. 2012–13లో చివరి ద్వైపాక్షిక సిరీస్ ఆడిన భారత్, పాక్ జట్లు.. ప్రపంచకప్, ఆసియా కప్ వంటి టోర్నీల్లో తటస్థ వేదికపైనే ఆడుతున్నాయి. ఫిబ్రవరిలో మొదలయ్యే టి–20 వరల్డ్‌కప్ 15వ తేదీన కొలంబోలో దాయాదుల పోరు జరుగనుంది.

## బంగ్లాదేశ్ జర్నలిస్టుల్లకు అక్రిడిటేషన్స్ తిరస్కరణ

పంతానికి పోయి టి–20 వరల్డ్‌కప్ అవకాశాన్ని చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఐసిసి మరో షాకిచ్చింది. ప్రపంచకప్ మ్యాచ్‌లో కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దేశానికి చెందిన క్రీడా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించింది. దాదాపు వందకుపైగా అప్లికేషన్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది దాంతో.. తమ బోర్డు చేసిన తప్పిదానికి మమల్ని శిక్షించవద్దని వారు వేడుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్స్ జారీని మరోసారి పరిశీలిస్తామని ఐసిసి వెల్లడించింది. భారత్‌లో ప్రపంచకప్ కోసం తమ జట్టును పంపబోమని బెట్టుచేసిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. భద్రతా కారణాలను సాకుగా చూపి మేము ఆడమంటే ఆడమని పంతం పట్టినందుకు బంగ్లాదేశ్‌ను తప్పించిన స్కాంట్లాండ్‌కు అవకాశమిచ్చింది ఐసిసి. ఇప్పుడు ప్రపంచకప్‌కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న క్రీడా జర్నలిస్టులకు అనుమితివ్వలేదు. ఈ విషయంపై బంగ్లా బోర్డు మీడియా అధ్యక్షుడు హంజద్ హొసేన్ తిరస్కరణకు కారణాలు తెలపాలని ఐసిసిని కోరాడు. 'మా దేశ క్రీడా జర్నలిస్ట దరఖాస్తులను తిరస్కరించారనే విషయం సోమవారం తెలిసింది. అందుకు కారణం తెలపాలని ఐసిసిని కోరాం. ఇది అంతర్గత వ్యవహారం. అయితే.. ఐసిసి ఎందుకు మావాళ్లకు అనుమతి ఇవ్వలేదో తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నాడు.

## వీడ్కోలు నిర్ణయాన్ని వాయిదా వేయను!

వ్యక్తిగత రికార్డులు, మైలురాళ్ల కంటే జట్టు కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడేవారు చాలా అరుదు. అలాంటి అరుదైన క్రికెటరే కేఎల్ రాహుల్. ఫార్మాట్ ఏదైనా టీమిండియా ఆపద్బాంధవుడి పాత్రలో ఒదిగిపోతున్న రాహుల్ వీడ్కోలుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదిగిన రాహుల్ రిటైర్మెంట్ గురించి పెద్దగా ఆలోచించనని, క్రికెట్ ఒక్కటే జీవితం కాదని అన్నాడు. ఇంగ్లండ్ మాజీకెప్టెన్ కెవిన్ పీటర్సన్తో యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. వీడ్కోలు పలకాలనే ఆలోచన తనకు వచ్చిందని.. అయితే.. అందుకు ఇంకాస్త సమయం ఉందని ఈ సొగసరి బ్యాటర్ వెల్లడించాడు. బ్యాటింగ్ ఆర్డర్ మారడం నా వల్ల కాదు.. కెప్టెన్సీ కాకుండా వైస్ కెప్టెన్సీ ఇస్తారా? వంటి ఫిర్యాదులకు ఆమడదూరంలో ఉండే రాహుల్ తన లో మరొకొన్ని రోజులు క్రికెట్ ఆడే సత్తా ఉందంటున్నాడు. యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడిన అతడు.. 'ఒకానొక సమయంలో వీడ్కోలు గురించి ఆలోచించాను. నా దృష్టిలో రిటైరవ్వడం కష్టమైనదేమీ కాదు. మనపట్ల మనం నిజాయతీగా ఉన్నప్పుడు.. సరైన సమయం వచ్చినప్పుడు వీడ్కోలు నిర్ణయాన్ని రోజుల తరబడి వాయిదా వేయడంలో అర్థముండదు. ప్రస్తుతానికైతే నేను అల్విదా చెప్పడానికి ఇంకా కొంచెం సమయం ఉంది. రిటైర్మెంట్ ప్రకటించాక.. కుటుంబంతో నచ్చినట్టుగా జీవితాన్ని గడిపేందుకు ప్రాధాన్యమిస్తాను.



ఒక క్రికెటర్ అలా ఉండడం కాస్త కష్టమే. కానీ, నేను అంత ముఖ్యమైన ఆటగాడిని కాదని నా ఉద్దేశం. ఎవరు వీడ్కోలు పలికినా సరే మనదేశంలో క్రికెట్ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే చెబుతున్నా.. జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు చాలా ఉంటాయి. నేను ఈమధ్యే తండ్రినయ్యాను. పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే దృక్కోణం ఎంతో మారింది' అని పేర్కొన్నాడు . అనుభవజ్ఞుడైన రాహుల్ కెప్టెన్గా జట్టును నడిపించాల్సింది. కానీ, గాయాల కారణంగా అతడు పలుమార్లు జట్టుకు దూరమయ్యాడు. ఇదేఅంశంపై స్పందించిన రాహుల్.. 'గతంలో నేను చాలా సార్లు గాయపడ్డాను. స్పోర్ట్స్ హెర్నియా కారణంగా ఆస్పత్రి పాలయ్యాను. గాయాలతో పోరాడి.. కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చేందుకు ఎంతో కష్టపడ్డాను. ఆరోజులు నిజంగా ఎంతో కష్టంగా గడిచాయి. మానసికంగా కొన్నిసార్లు కుంగిపోయేవాడిని. అలాంటప్పుడు ఇక చాలు. క్రికెట్ లేకుండా కూడా నువ్వు బతకగలవు అని మన మనసు చెబుతుంది' అని వెల్లడించాడు.

మహిళ

# బాధితులకు న్యాయం ఎక్కడ?

దేశంలో మహిళల భద్రత గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోతున్నది. ధరించే దుస్తుల నుంచి ఎంచుకునే మార్గం వరకూ అన్నిటా నిర్బంధాలే. మణిపూర్‌లో అత్యాచార బాధితురాలి మృతి ఈ దారుణ సత్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నది. ఆ విషాదానికి తాజా, అత్యంత హృదయవిదారక ఉదాహరణ, మూడేళ్ల క్రితం గ్యాంగ్ రేప్‌నకు గురై, న్యాయం కోసం ఎదురు చూస్తూనే ప్రాణాలు విడిచిన ఒక యువ కుకీజో మహిళ. 2023 మే నెలలో మణిపూర్‌లో మొదలైన మైతేయి–కుకీ సంఘర్షణలు కేవలం జాతుల మధ్య ఘర్షణలు మాత్రమే కాదు. అవి రాజ్యవ్యవస్థల వైఫల్యాన్ని, చట్టపరమైన రక్షణ ఎంత సులభంగా కూలిపోతుందో, మహిళ శరీరం ఎలా యుద్ధభూమిగా మారుతుందో బట్టబయలు చేశాయి. ఆ కల్లోలంలో, అప్పుడే 18 ఏళ్లు నిండిన ఒక యువతి అపహరణకు గురైంది, దారుణంగా లైంగిక హింసకు లోనైంది, ఆ తర్వాత మూడేళ్ల పాటు శారీరక–మానసిక నరకాన్ని అనుభవించింది. చివరకు ఈనెల 10న గౌహతిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమెకు న్యాయం లభించలేదు. ఇంఫాల్‌లో ఒక ఎటిఎం దగ్గర డబ్బు తీసుకునేందుకు వెళ్లిన ఆ యువతిని నలుగురు ఆయుధాలతో ఉన్న వ్యక్తులు బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లారు. నల్ల షర్టు ధరించిన వారు, ఆ కాలంలో చురుగ్గా ఉన్న మైతేయి మిలిటెంట్ గ్రూప్ అరంబై టెంగ్గోల్‌కు సంబంధించినవారిగా ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఎఫ్‌ఐఆర్ లోని ఆరోపణలు ఆందోళన కలిగించేవి కూడా. మైతేయి మహిళా విజిలాంటీ గ్రూప్‌గా పేరున్న మైరా పైబీ సభ్యులే తనను వారికి అప్పగించారని ఆమె పేర్కొన్నారు. ఇది కుకీ సంస్థలు పదేపదే లేవనెత్తిన ఆరోపణ. ఆమెను లాంగోల్, బిష్ణుపూర్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి, రాత్రంతా చిత్రహింసలు పెట్టి, పలుమార్లు అత్యాచారం చేశారు. కళ్లకు గంతలు కట్టి, ఆహారం–నీరు లేకుండా ఉంచి, చివరకు కొండపై వదిలేశారు. 'వాళ్లు చేయగలిగిన ప్రతి అమానుషం నాపై చేశారు' అని ఆమె 2023 జులైలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన మాటలు ఈరోజు కూడా మన మనసును గుచ్చుతాయి. అత్యంత తీవ్ర గాయాలైనప్పటికీ ఆ యువతి కాలకృత్యాలకు వెళ్తున్నానని చెప్పి పారిపోయి కూరగాయల లోడుతో ఉన్న ఆటోలో దాక్కొని ప్రాణాలు దక్కించుకుంది. ఆమె బయటపడిన విధానం ధైర్యానికి ప్రతీకగా కనిపించినా, నిజానికి అది ఒక వ్యవస్థ చేతిలో నలిగిపోయిన యువతి చివరిప్రయత్నం. కాగా, ఆ రోజుల్లో మణిపూర్‌లో పోలీస్ వ్యవస్థ దాదాపు కూలిపోయింది. భయం, అల్లర్లు, రోడ్డు బ్లాకులు .. ఈ పరిస్థితుల్లో బాధితురాలు రెండు



నెలల తర్వాతే, 2023 జులై 21న ఫిర్యాదు చేయగలిగింది. కాంగ్‌పోక్పి పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ ఐఆర్ నమోదు అయి, ఆ తర్వాత సిబిఐకి బదిలీ అయింది. గౌహతిలో ప్రత్యేక సిబిఐ కోర్టులో కేసు నడుస్తున్నట్టు అధికారిక సమాచారం ఉంది. కానీ మూడేళ్లకు దగ్గరగా గడిచినా, ఒక్క అరెస్టు కూడా జరగలేదు. ఛార్జిషీటు లేదు. బాధితురాలి కుటుంబానికి సరైన సమాచారం లేదు. ఇది కేవలం ఆలస్యం మాత్రమే కాదు.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇది, బాధితులకు న్యాయం దక్కడంలో ఏర్పడుతున్న ఒక పెద్ద శూన్యత. ఆమె శరీర గాయాలు మానలేదు. గర్భాశయ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, తరచూ ఆసుపత్రి పాలవడం.. ఇవన్నీ ఆమె రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కానీ వాటి కన్నా తీవ్రంగా ఆమెను చంపింది మానసిక వేదన. 'ఇంతకు ముందు నా కూతురు ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఆ సంఘటన తర్వాత ఆమె నవ్వు మాయమైంది. ఎక్కువగా మాట్లాడేది కాదు. ఇంట్లోనే ఉండేది. బైబిల్ చదివేది, టివి చూస్తూ కూర్చునేది' అంటూ ఆమె తల్లి చెప్పిన మాటలు మనల్ని కుదిపేస్తాయి. నిజానికి ఇది ఒక వ్యక్తిగత దుఃఖకథ కాదు. లైంగిక హింసకు గురైన వేలాది మహిళల ప్రతిబింబం. న్యాయం ఆలస్యం కావడం అనేది వారి మనసుపై పదేపదే అత్యాచారం చేసినట్టే.

న్యాయం ఆలస్యం కావడం వల్ల ఆ యువతి తన గౌరవాన్నే కాదు, చివరకు ప్రాణాన్నే కోల్పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మణిపూర్ హింసలో 260మందికిపైగా మరణించారు, 60 వేలమందికి పైగా నిర్వాసితులయ్యారు. రాష్ట్రం రాష్ట్రపతి పాలనలోకి వెళ్లినా, బాధితులకు న్యాయం దూరంగానే ఉంది. యుద్ధ ప్రాంతాల్లో మహిళల భద్రతను మన దేశం ఎంత గంభీరంగా తీసుకుంటోంది? అనే ప్రశ్న ఈ యువతి మరణం మన ముందుకు తెస్తున్నది. ఆమె 'మణిపూర్ కుమార్తె మాత్రమే కాదు, భారతదేశ కుమార్తె' అన్న మాటలు నిజం. ముగింపు లేకుండా ముగిసిన ఆమె జీవితం.. మన న్యాయవ్యవస్థపై మాయని మచ్చ. బాధితురాలి మరణం సమాజానికి చేస్తున్న ఒక హెచ్చరిక. న్యాయం ఆలస్యం అయితే, అది న్యాయం కాకుండా మరో హింసగా మారుతుందని గుర్తుచేసే విషాద వాస్తవం. మనం మౌనంగా ఉంటే, తదుపరి బాధితురాలు ఎవరో?

## ఒక కప్పు కాఫీతో ప్రపంచం మారింది

అది 1908 సంవత్సరం. జర్మనీలోని డ్రెజ్డెన్ నగరం. మెలిట్టా బెంచ్ అనే ఓ సాధారణ గృహిణి మరోసారి రుచీలేని కాఫీ కప్పును చూస్తూ చిరాకుపడిపోయింది. నీళ్ల మాదిరి ఉండే అలాంటి కాఫీ అంతగా రుచించేది కాదు. కానీ అది అప్పటి కాఫీ. గరుకుగా, చేదుగా, మట్టితో నిండినట్టు ఉండేది. 'సిసలైన కాఫీ ఇదే' అనుకుంటూ ప్రపంచమంతా అదే తాగేది. కానీ మెలిట్టా అలా ఒప్పుకోలేదు. కాఫీని ఇంతకంటే బాగా చేయలేమా? అని ఆమె తనను తానే ప్రశ్నించుకుంది. ఏదో ఒకటి చేయాలి... కాఫీరంగును.. రుచిని మార్చాలి. కానీ, ఎలా? అదే ఒక పెద్ద ప్రశ్న. సమాధానం కోసం మెలిట్టా నిరంతరం ఆలోచిస్తునే ఉండేది. ఒకరోజు యాదాలాపంగా చూస్తున్న ఆమె కళ్లు తన కుమారుడి నోటుబుక్‌లోని బ్లోటింగ్ పేపర్‌పై పడ్డాయి. వెంటనే ఫ్లాష్ లాంటి ఆలోచన. ఆ బ్లాటింగ్ పేపర్‌ను తీసుకుంది. ఒక రంధ్రాలున్న పాత్రపై ఆ కాగితాన్ని ఉంచింది. దానిపై కాఫీ పొడి వేసి, పై నుంచి వేడి నీరు పోసింది. బ్లాటింగ్ పేపర్ నుంచి, మెల్లిగా కింద జార్‌లోకి కాఫీ పడింది. బహుశా అదే నిజంగా తాగగలిగిన తొలి నిజమైన కాఫీ కావచ్చు. ఆ కాఫీ ఎంతో మృదువు గా. శుభ్రంగా. చేదు లేకుండా ఉండడాన్ని గమనించిన మెలిట్టాకు తాను కేవలం కాఫీ కాదు... ఒక అలవాటునే మార్చానని అర్థమైంది. ఆమె ఆ ఆలోచనను దాచుకోలేదు. పేటెంట్ తీసుకుంది. ఇంటి నుంచే చిన్న కంపెనీ ప్రారంభించింది. తానే తయారు చేసి, తానే కాఫీ ఫిల్టర్ తయారు చేసి అమ్మింది. మొదట ప్రజలు నవ్వారు. ఆ తర్వాత అందరూ మారిపోయారు. ఒక మహిళ రుచిగా లేని కాఫీతో రాజీ పడకపోవడమే కాఫీ ప్రపంచాన్ని పూర్తిగా మార్చేసిన వైనాన్ని స్మరించుకోవాలి.



## కార్మికుల హక్కులు హరిస్తున్న కేంద్రం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి యండి ఇమ్రాన్, సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు కల్లూరి మల్లేశం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచకొండ జనార్ధన్‌లు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలో జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ఎండి ఇమ్రాన్, కల్లూరి మల్లేశం, ఆర్.జనార్ధన్‌లు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలో సమ్మె విజయవంతం కోసం ఫిబ్రవరి 3న కార్మిక సంఘాల జిల్లా సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో సిఐటియు, ఏఐటిసియు, ఐయన్‌టియూసీ, ఐఎఫ్టీయు, బిఆర్‌టియు, హెచ్ఎంఎస్, ఇతర అన్ని కార్మిక సంఘాల మండల, జిల్లా నాయకత్వం పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి శోభన్ బాబు, ప్రజాసంఘాల నాయకులు దయ్యాల నరసింహ, వనం రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాధవరెడ్డి జ్ఞాపకార్థం భారీ స్థూపం

సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రొండ్ల మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం రేపాకలో భారీ స్థూపం నిర్మాణం చేయాలని పార్టీ నిర్ణయించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం రేపాకలో రొండ్ల మాధవరెడ్డి స్థూపం నిర్మాణం కోసం స్థలం పరిశీలించి, కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1947 మార్చి 14 న హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గుట్టల్లో అమరులైన 12 మందిలో 6 గురు మన ఇల్లంతకుంట మండల వాసులే కావడం అందులో రొండ్ల మాధవరెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 14 ఏండ్ల మైనర్ బాలుడు అశ్వమిత్ గౌతమ్ కు, 90 శాతం వికలాంగుడైన జి. యన్. సాయి బాబాలాంటి వికలాంగులకు, అమరవీరుల శవాలకు, స్థూపాలకు ఎందుకు భయపడుతోందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రశ్నించడమే నేరంగా పరిగణిస్తూ ప్రజలపై దారుణ మారణ కాండను కొనసాగిస్తున్న పాలకులు ఎంతో కాలం మనుగడ సాదించలేరని ఇలాంటి నియంతలు కాలగర్భంలో కలిసిపోకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇల్లంతకుంట మండల కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మంద అనిల్, వండాపెల్లి లక్ష్మణ్, దళిత హక్కుల పోరాట సమితి నాయకురాలు పవిత్ర, రాజశేఖర్ రాజు, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

కార్మిక సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఆల్ ట్రేడ్ యూనియన్లు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో జిల్లాస్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికులకు ఉరికొయలుగా మారిన లేబర్‌కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఫిబ్రవరి 12న జరిగే సమ్మె విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి పి.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి ఎం.రామ్మోహన్ ,టీఎన్టియుసి జిల్లా నాయకులు ధన్వాడ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్, టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక ప్రజా వ్యతిరేక లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ చట్టం, విభిజి రాంజీ ఉపాధి హామీ చట్టాన్ని విత్తన సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె చేసే హక్కును లేబర్ కోడ్‌లు హరిస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా ఫిబ్రవరి



12 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సకల కార్మికులు రైతు వ్యవసాయ కూలీలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు అభ్యుదయవాదులు విజయవంతం చేయాలని చేయడానికి కంకణబద్దులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి కార్యదర్శి సురేష్, అధ్యక్షులు కృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, బికే యం యు జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి , టియుసిఐ జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి సాంబశివుడు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.లక్ష్మయ్య, బాలు వెంకటన్న, చంద్రకాంత్, రాజ్ కుమార్, వి.కురుమూర్తి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ వినతి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 10వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి, యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలేష్, ప్రధాన కార్యదర్శి షకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, ఉపాధ్యక్షుడు పర్వేజ్, కోశాధికారి అంజి తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వాయర్ల నీటిని రైతులకోసం విడుదల చేయాలి

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్


**ప్రజాపక్షం/గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బావులలో నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని, వీటిని దృష్టిలో పెట్టుకొని మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నుండి నీటిని పంట పొలాలకు అందించాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, జిల్లాలో బలమున్న చోట సిపిఐ పార్టీ అభ్యర్థులను బరిలో దిగుతున్నట్లు సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు జిల్లాలో వంద ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో బరిలో ఉంటారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే, ప్రశ్నించే గొంతుకలైన సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలలో నిరంతరం తిరుగుతూ, ప్రజల సమస్యలను తీర్చడమే లక్ష్యంగా సిపిఐ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా రోజుకు రోజుకు పట్టణ ప్రాంతాల్లో బిజెపి బలపడడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుండగా, మతతత్వ శక్తులను ఓడగొట్టాలంటే కాంగ్రెస్, సిపిఐ పార్టీలు ఎన్నికల్లో కలిసి పనిచేస్తామని చెప్పారు. జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి సిపిఐగా నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే కమ్యూనిస్టులను ఆదరించాలని, రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి శివలింగ కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య, నాయకులు కొండి రాజం, చింత శీను, రామచంద్రం, స్వర్గం రాములు, కొండి రాజ్యం, పోతుల శంకరయ్య, రుద్రారం బిక్షపతి, శివలింగ నారాయణ, రుద్రారం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్‌పై సిపిఐ పట్టు సాధిస్తోంది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ శ్రేణులు అందిస్తున్న సేవలు పార్టీ మరింత బాలోపేతం కావవడానికి దోహదపడుతోంది. మంగళవారం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పోరేషన్ పరిధిలోని 50,43 డివిజన్లకు చెందిన 110 కుటుంబాలు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సమక్ష్యంలో పార్టీలో చేరాయి. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామాటాకీస్ ఏరియాలో 50వ డివిజన్‌కు చెందిన యెర్ర రాజు, తండూరి అరుణ్, కోసరబోయిన రమేష్, అజయ్, సలీం, శ్రీను, చంటి నేతృత్వంలో 60 కుటుంబాలు, 43వ డివిజన్‌కు చెందిన వెంకటేష్, అవినాష్, ప్రశాంత్, మురళీకృష్ణ, నాగమణి, వెంకటేశ్వర్లు నేతృత్వంలో 50 కుటుంబాలు సిపిఐలో చేరాయి. వీరికి సాబీర్ పాషా కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో 60 డివిజన్ల నుండి ప్రజాదరణ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, యాంద్ర మహేష్, బోయిన విజయ్ కుమార్, దాసరి శ్రీనివాస్, నరేందర్, రాకేష్ పాల్గొన్నారు.



# అంత 'ఈజీ' కాదు



**మున్సిపల్ ఎన్నికల గెలుపు కోసం మల్ల గుల్లాలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలో బరిలో దింపే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కానీ విపక్షాలకు కానీ గెలుపు అంత తేలికగా లేదు. విపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా అన్ని పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు అధికారం కలిసి వచ్చే అవకాశమే అయినా స్థానిక నాయకుల వ్యవహారం ఆ పార్టీకి కొంత ఇబ్బందికరమే. కాంగ్రెస్ నాయకులలో కొంత మంది మంత్రుల స్థాయిని మించి ఊహించుకుంటూ సామాన్య ప్రజలను పట్టించుకునే స్థితిలో లేరు. అంతే కాదు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను పార్టీ పెద్దలను సైతం తప్పుదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. జనం మధ్య ఉండే వారి కంటే పైరవీకారులకు ప్రాధాన్యతనిస్తున్నారు. మరి కొంత మంది మిగిలిన రాజకీయ పార్టీలను లెక్కచేసే పరిస్థితి లేకపోవడంతో అధికార పార్టీకి ఎదురు గాలి తగిలే అవకాశం ఉంది. అధికారం ఉన్నా లేకున్నా ఓటర్లలో మెజార్టీ ఒకే అభిప్రాయంతో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ కూడా మున్సిపల్ ఎన్నికలపై కసరత్తు చేస్తుంది. మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలను నియమించడంతో ఇప్పటికే ఒక దఫా ఎన్నికల సమావేశాలను నిర్వహించారు. విపక్షంలో ఉన్న బిఆర్ఎస్ తరుపున పోటీ చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొత్తగా ఏర్పడిన కల్లూరు, అశ్వారావుపేట, ఏదులాపురం మినహాయిస్తే పాత మున్సిపాలిటీలలో పార్టీ ఫిరాయించిన వారు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఆయా వార్డులు లేక డివిజన్లలో పోటీ చేసిన కాంగ్రెస్ నాయకులను కాదని ఇటీవల పార్టీలో చేరిన వారికి టికెట్ కేటాయించడం ఇబ్బందికరంగా మారనుంది. సత్తుపల్లి, వైరా, ఇల్లందు, మధిర మున్సిపాలిటీలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. స్థానిక పరిస్థితులు నాయకత్వ వ్యవహార శైలి ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఖర్చు చేయగలిగితేనే గెలుపు :**

గత కొంత కాలంగా గెలుపును డబ్బు ప్రభావితం చేస్తుంది. ఖర్చు చేసే అభ్యర్థులకు గెలుపు అవకాశాలు దక్కుతున్నాయి. సాధారణ ఎన్నికల మొదలు స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఓట్ల కొనుగోలు ఓ సాధారణ ప్రక్రియగా మారిపోయింది. గడిచిన పంచాయతీ ఎన్నికల్లో ఆయా పరిస్థితులను బట్టి ఓటు ధర రెండు వేల నుంచి పదివేల రూపాయల వరకు పలికింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండకపోవచ్చు. అందుకే రాజకీయ పార్టీలు పేరు, పలుకుబడితో పాటు గెలుపు గుర్రాల పేరిట ఆర్థికంగా బలంగా ఉండి ఖర్చు చేయగలిగిన వారిని రంగంలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నాయి. రిజర్వేషన్, జనరల్ స్థానాలు అనే బేధం లేకుండా ఖర్చు పెడితేనే గెలుపు దక్కుతుండడంతో రాజకీయ పార్టీలు ఆర్థికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించుతున్నాయి.

**జిల్లాలో వామపక్షాలు కీలకం :**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎన్నికలు జరుగుతున్న కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీలలోనూ వామపక్షాలు కీలకం కానున్నాయి. కొత్తగూడెంలో సిపిఐ కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని మేయర్ స్థానం కోసం పోటీ పడుతుంది. మిగిలిన అన్ని మున్సిపాలిటీలలోనూ వామపక్షాలకు గణనీయమైన సంఖ్యతో ఓట్లు ఉండి ఎన్నికల్లో గెలుపును ప్రభావితం చేయగలిగిన స్థాయిలో ఉన్నాయి. ఏదులాపురం, ఇల్లందు, వైరా, అశ్వారావుపేట, మధిరలో సిపిఐ తన అభ్యర్థులను బరిలోకి దించనుంది. సిపిఎం బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయనుంది. ఏదులాపురంలో ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు సిపిఐ ప్రకటించింది.

## కొత్తగూడెం కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలో ఎన్నికలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు, ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు గాను 117 వార్డుల్లోనూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందులో 24, అశ్వారావుపేటలో 22 మున్సిపల్ వార్డులకు , కొత్తగూడెం కార్పోరేషన్‌లోని 60 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. బరిలో నిలిచే అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే ఒక దఫా పార్టీలు పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేశాయి. ఖమ్మం జిల్లాలో సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు ఎన్నికల పొత్తుతో బరిలో దిగనుండగా ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగనుంది. మిగిలిన మున్సిపాలిటీల్లో వివిధ పార్టీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. కొత్తగూడెం కార్పోరేషన్‌లో కలిసి వచ్చే పార్టీలతో సిపిఐ బరిలోకి దిగేందుకు నిర్ణయించుకుంది. ఇక్కడ మేయర్ స్థానాన్ని సిపిఐ ఆశిస్తుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలోని 2వ వార్డుకు చెందిన అన్వర్‌పాషాకు రూ.2.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంత్రి క్యాంప్‌కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించింది. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న అన్వర్‌పాషా మంత్రి, తనకు సహకరించిన ఏనుగు మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల ఆందోళన



ఐదు గంటల పనిదినాల కోసం డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఐదు గంటల పనిదినానికై బ్యాంకు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. యూనైటెట్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వైరా రోడ్డు ఎదుట బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు వైరా రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని అన్ని బ్రాంచీల నుంచి ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. సమ్మెను ఉద్దేశించి ఎఫ్‌బియు నాయకులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి ఐదు రోజుల పనిదినం అమలు జరపాలన్న డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యుఎఫ్‌బియు నాయకులు షేక్ ఇబ్రహీం, రాంబాబు, రాజేష్, శివకుమార్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, మంగయ్య తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహలక్ష్మి, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు లు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు.

## జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు దాడి



ఆందోళన చేపట్టిన తల్లితండ్రులు, విద్యార్థులు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలోగల ముస్లిం మైనార్టీ కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు సోమవారం రాత్రి దాడిచేశారంటు మంగళవారం ఉదయం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థుల తల్లితండ్రులు కళాశాలవద్దకు చేరుకొని కళాశాల సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. గతంలో కూడా ఇలాగే సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులైన తమ పిల్లలను రెండుసార్లు దాడి చేశారని ఈవిషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా ఇలాంటివి ఇంకోసారి జరగకుండా చూస్తానని హామినిచ్చారని కాని వారి పద్ధతి మారలేదని అన్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జూనియర్ విద్యార్థులు గదిలోకి వెళ్లి నిద్రపోతున్న వారిని లేపి బూతులు తిట్టుకుంటు కొట్టారని ఆరోపించారు. సుమారు 12 మంది విద్యార్థులను కొట్టారని విద్యార్థులు, తల్లితండ్రులు అన్నారు. ఇరువర్గాల తల్లితండ్రులు కళాశాలకు చేరుకోవడంతో ప్రిన్సిపాల్ జితేష్ వారితో చర్చలు జరిపారు. ఏదైనా కళాశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది సరైన పర్యవేక్షణలేదని ఈవిషయంతో తేటతెల్లమయింది. ఇప్పటికైనా ఈ ఘర్షణలు ఆగుతాయా తిరిగి యధాతదంగా కొనసాగుతాయో అధికారులు ముందున్న ప్రశ్న. ఉన్నతాధికారులు ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణకోరగా 5 గురు సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను కొట్టినట్లుగా ఒప్పుకుంటున్నారని ఇరువర్గాల తల్లితండ్రులతో మాట్లాడుతున్నానని మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నాని తెలిపారు.

## అశ్వారావుపేటలో పర్యటించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాల్టీలో శాసనసభ్యులు జారే ఆదినారాయణ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలకు దగ్గరగా ఉండే కాంగ్రెస్ పార్టీ పాలన, అభివృద్ధి దృక్పథం, సంక్షేమ కార్యక్రమాలు అమలు పట్ల ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని కొత్తగా చేరిన నాయకులు వెల్లడించారు. ఎమ్మెల్యే జారే వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, పేదల కోసం రైతుల కోసం, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, అశ్వారావుపేట అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను దీవించండి

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/మధిర :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించి పెద్ద ఎత్తున గెలిపించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అంతా ఉమ్మడి కుటుంబంగా భావించి ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పట్టణ ప్రాంతాల్లో రకరకాల ప్రణాళికలతో పేద, మధ్య తరగతి వర్గాల అభివృద్ధికి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మెప్మా ద్వారా మున్సిపాల్టీల్లో మహిళలకు రూ.6వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలో అనేక క్లస్టర్లుగా విభజన చేసి అభివృద్ధి ప్రణాళికాలు రూపొందించి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి మున్సిపాల్టీ సమీపంలోని గ్రామాల్లో ఉపాధి, ఆదాయం పొందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో రేషన్ కార్డుల కోసం చూసి చూసి ఆలసిపోయిన వారందరికీ కొత్తగా రేషన్‌కార్డులు పంపిణీ చేశామని, రాష్ట్రంలో 1.15కోట్ల కుటుంబాలు ఉండగా 1.03కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని అల్పాదాయ వర్గాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, వినియోగదాల తరుపున విద్యుత్ శాఖకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. హైద్రాబాద్ పట్టణంలోనే కాకుండా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ డెవలప్మెంట్ కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని, ప్రపంచ స్థాయి విద్యను పేద బడుగు బలహీన వర్గాలకు అందించేందుకు యంగ్‌ఇండియా రెడిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు.

**దివ్యాంగులకు ప్రభుత్వం అండ**

గత ప్రభుత్వం పదేళ్లలో దివ్యాంగులకు చేయలేనటువంటి పనులని ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేస్తుందని, అందులో భాగంగానే ఈ రెండేళ్లలో దివ్యాంగుల కోసం రూ.100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో ఆయన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన అనంతరం ప్రసంగించారు. చదువుకుంటున్న దివ్యాంగులకు ఐపాడ్లు, కంప్యూటర్లు ట్యాబ్స్ ప్రజా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు.

**రూ.140కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

మధిర పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. పట్టణంలోని వైరా నదికి రూ.70కోట్లతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.75కోట్లతో నిర్మించనున్న వరదకాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మధిర పట్టణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మధిర మున్సిపాల్టీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంత ఎమ్మెల్యేగా అభివృద్ధి నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి పనులు పూర్తి చేయాలి : భట్టి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పలు, అభివృద్ధి పనులను పరిశీలించి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మహాశివరాత్రి జాతరకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు, మల్లు రామకృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రశాంతం



రోడ్ల విస్తరణతోనే అభివృద్ధి : మంత్రి తుమ్మల

రజక భవనానికి, యుపిహెచ్‌సికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రశాంత, పచ్చని ప్రగతిశీల నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 36వ డివిజన్‌లో రూ.63 లక్షలతో నిర్మించనున్న రజక భవన నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూ.2.43 కోట్ల వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్స్, సిబ్బందిని పెంచి 12 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ పిహెచ్‌సిలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి భారం తగ్గుతుందన్నారు. ఆరోగ్య కేంద్ర సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటి విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ డిజిటల్ విద్యను అందించే కార్యక్రమంలో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 34 మంది విద్యార్థులు పాల్గొనడటం పట్ల జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టుకు తమ కళాశాల విద్యార్థులు భాగస్వామ్యమయ్యారని ఆయన తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంస పత్రాలు అందుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునీక విద్యను అందించడంతో పాటు కళాశాల విద్యార్థులకు స్కేల్ ఆఫ్ ఇంటర్న్‌షిప్‌గా ఇది ఇరువురికి ఉపయోగపడేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి మాట్లాడుతూ జెఎన్‌టియు హైదరాబాద్ రిజిస్టర్ సూచన మేరకు తమ కళాశాలకు ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ కెజిబివి, జెడ్పిహెచ్ఎస్ సింగరాయపాలెం, టిఎస్ఆర్‌ఈఐఎస్ ఏన్కూరు, టిజిఎంఎస్, కారేపల్లి నాలుగు పాఠశాలలను అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంచార్జిలు నూనె సరిత, ఎస్‌డి పాషా, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి

'తెలంగాణ వన జీవన్ ధార' ఖమ్మం

పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన ఎంపి రామసహాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మంజిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'తెలంగాణ వన జీవన్ ధార' ఖమ్మం పైలెట్ ప్రాజెక్టును ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ విజన్ 2047కు అనుగుణంగా అరణ్యాలపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడం, ఆక్రమణలను నియంత్రించడం, మానవ వన్యప్రాణి సంఘర్షణలను నివారించడమే ప్రధాన లక్ష్యంగా ఖమ్మం జిల్లా అటవీశాఖ ముందడుగు వేసిందని ఎంపి తెలిపారు. అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆదాయ గ్రీన్ జీవనోపాదులను అభివృద్ధి చేయడం పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందన్నారు. వన సంరక్షణ సమితులను, స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్‌లుగా తీర్చిదిద్దే ఈ ప్రయత్నాన్ని ఎంపి ప్రశంసించారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అరణ్య సంరక్షణ ఫలితాలు, సముదాయ ఆదాయం రెండింటిని ఒకే పాలన వ్యవస్థలో అనుసంధానిస్తూ స్థిరమైన జీవనోపాదులను అమలు చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్ ప్రైజెస్‌లుగా తీర్చిదిద్ది పర్యావరణ భద్రతతో పాటు గ్రామీణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి, యూనిట్ల స్థాపన, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వ, కార్పోరేట్ సంస్థల భాగస్వామ్యాల ద్వారా విఎస్ఎస్‌లను అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎఫ్‌డివో మంజుల, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కనుసన్నల్లోనే 'బెల్ట్ షాపులు'

- ఎంఆర్‌పిపై అదనపు బాదుడు
- మద్యం వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బెల్ట్ షాపులు ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. బెల్ట్‌షాపుల నిర్వహణ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికి తెలుసు. ఏ బెల్ట్ షాపుకు ఏ మద్యం దుకాణం నుండి మద్యం సరఫరా అవుతుందనే విషయం మొదలు ఎంఆర్‌పి కంటే ఎంత అదనంగా విక్రయిస్తున్నారనే విషయం తెలుసు. మద్యం వ్యాపారులు, బెల్ట్ షాపు యజమానులు కుమ్మకై మద్యం ప్రియులను దోపిడీ చేస్తుంటే ఎక్సైజ్ శాఖ శక్తికి మించి సహకరిస్తుంది. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన ఖరీదైన మద్యం కూడా బెల్ట్‌షాపుల్లో విక్రయించడంతో పాటు కొందరు మద్యం వ్యాపారులే మద్యం దుకాణాలకు అత్యంత సమీపంలో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయించి మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ వ్యాపారులకు దన్నుగా నిలవడంతో తాము ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్న వ్యాపారుల్లో నెలకొంది.

**నాలుగు రోజులు ఆపండి :** మద్యం విక్రయాలకు సంబంధించి నాలుగు రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోండి అంటూ ఓ ఎక్సైజ్ అధికారి మద్యం వ్యాపారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. మీడియాలో బెల్ట్‌షాపుల నిర్వహణ మద్యం అధిక ధరకు విక్రయించటం తదితర విషయాలపై వార్తలు వస్తున్నందున మేము చెప్పే వరకు నిబంధనలు పాటించండి అంటూ సూచనలు చేస్తున్నారు. మద్యం వ్యాపారులు బెల్ట్‌షాపులకు సరఫరా చేసే మద్యానికి సంబంధించి ఎంఆర్‌పిపై ఐదు నుంచి పది రూపాయల వరకు వసూలు చేస్తున్నందున లాభాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అధికారి చెప్పినా సూచనలను పాటించడం లేదు. ఆదేశించే స్థాయి నుంచి బతిమిలాడుకునే స్థాయికి ఎక్సైజ్ అధికారులు దిగజారారు. మామూళ్ల మత్తు ఎక్సైజ్ అధికారులకు ఈ దుస్థితిని తెచ్చిపెట్టిందన్న ప్రచారం జరుగుతుంది.

**బెల్ట్‌షాపులు లేనిదెక్కడ...?** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో బెల్ట్ షాపులేనిదెక్కడ. పల్లె, పట్టణం అనే తేడా లేకండా ఎక్కడపడితే అక్కడ మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొన్ని బెల్ట్‌షాపుల ద్వారా బార్లను తలదన్నే రీతిలో సిట్టింగ్‌లను ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట మద్యాన్ని విక్రయించకూడదన్న నిబంధన బెల్ట్‌షాపులకు వర్తించడం లేదు. బెల్ట్‌షాపుల ద్వారా మద్యం ప్రియులను దోచుకోవడమే గాక బెల్ట్‌షాపులు ఘర్షణలకు కేంద్రాలుగా మారుతున్నాయి. పోలీస్ అధికారులు కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో బెల్ట్‌షాపుల నిర్వహణకు సహకరిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖకు లేని పట్టింపు మనకు ఎందుకు అనుకున్నారో ఏమో కానీ ఆ వైపు దృష్టి సారించడం లేదు.

**దోపిడికే మద్యం సిండికేట్స్ :** మద్యం ప్రియులను దోచుకునేందుకే మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. అంత కుమ్మకై తాము అనుకున్న రీతిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ సిండికేట్స్ ఎక్సైజ్ శాఖను నియంత్రిస్తున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ ఇప్పటికైనా మామూళ్ల మత్తు వీడి మద్యం వ్యాపారుల దోపిడిని అరికట్టాలి. బెల్ట్‌షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ప్రజలు బెల్ట్‌షాపుల నిర్వహణపై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇది ఆందోళనకు దారి తీయక ముందే ఎక్సైజ్ అధికారులు మేల్కొంటే మంచిది.

# చింతలగట్టు ‘వట్టివాగు’ జాతరకు సర్వం సిద్ధం

రూ. 52 లక్షలతో మౌలిక వసతుల అభివృద్ధి
రేపటి నుంచి జాతర ప్రారంభం



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా లో మరో ప్రసిద్ధిగాంచిన చింతలగట్టు వట్టివాగు జాతర మహా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ మహాజాతరను ఘనంగా నిర్వహించేందుకు జాతర కమిటీసభ్యులు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.జాతర ప్రాంగణం మొత్తం శుభ్రపరిచి భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేశా రు. గూడూరు మహబూబాబాద్ 365 జాతీయ రహదారిపై మచ్చర్ల దామరవంచ గ్రామాల శివారు వట్టివాగు ఒడ్డున ఆదివాసీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ చింతలగట్టు సమ్మక్కసారలమ్మ జాతర రెండు దశాబ్దాలుగా క్రమంగా భారీ జాతరగా ఎదుగుతూ వచ్చింది.రెండేళ్లకొకసారి జరిగే మహాజాతర యేటేటా జరిగే మీనీ మేడారం భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తే స్థాయికి చేరుకుంది.పచ్చని అడవి ప్రకృతి నీడలో ప్రధాన రహదారిపై ఉన్న అడవుల్లో జరిగే ఈ జాతర భక్తులను ఆకర్షిస్తూ ప్రత్యేకతను సంతరించుకుంది. మచ్చర్ల దామరవంచ సరిహద్దు అడవి ప్రాంతాల్లో నాలుగు రోజుగా చింతగట్టు మేడారం కనుచూపు మీద భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సుమారు 5 లక్షల నుండి 10 లక్షల వరకు భక్తులు ఆతల్లిను దర్శించుకు ంటారు.సమ్మక్క పున్నమిగా చెప్పుకునే మాఘశుద్ధపౌర్ణమి శుద్దిదేవతలను కొలుచుకునే భక్తులకు ఎంతో ప్రతిష్టమైనది .సమ్మక్క సారలమ్మ తల్లులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకునేందుకు ఆరోజు కోసం ఎదురు చూస్తుంటారు.అతిధి కలిసి వచ్చే విధంగా ప్రతి రెండు సంవత్సర కోసారి మేడారంలో నాలుగు రోజులపాటు జరిగే జాతర విశిష్టత సమ్మక్క పూర్ణమి గా చెప్పుకునే మాఘ శుద్ధపౌర్ణమితిధి వనదేవతలు కొలుచుకునే భక్తులకు ఎంతో ప్రతిష్టమైనది.సమ్మక్క సారలమ్మ తల్లులకు పూజులు చేసి మొక్కులు చెల్లించుకునేందుకు ఆ రోజు కోసం ఎదురుచూస్తుంటారు.

**మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు: జాతర కమిటి సభ్యులు**

జాతర ప్రాంగణంలో విద్యుత్ సరఫరా తాగునీటి వసతి పారిశుద్ధ్య ఏర్పాటు పూర్తిచేశారు. భక్తులు సులభంగా ఆలయానికి చేరుకునేలా రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హైమాస్క్ లైట్లను ఏర్పాటు చేశారు.రూ .52 లక్షలతో ప్రభుత్వ వట్టివాగు జాతర అభివృద్ధికి రూ .52 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈనిధులతో ఆలయ ప్రాంగణం అభివృద్ధితాగునీటి ట్యాంకులు పనులు పూర్తవడంతో భక్తులు హర్షం వ్యక్తిం చేస్తున్నారు.

**భద్రత ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి**
**వైద్యఅత్యవసర సేవలు సిద్ధం**

జాతర సందర్భంగా భక్తులకు రద్దీ దృష్ట్యా మహబూబాబద్ జిల్లా గూడూరు ఫోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాటు రూపొందించారు.మహిళలు వృద్ధులు పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.తాగునీరు ఆహార సరఫరాలో శుభ్రత పాటించాలని అధికారలు అదేశించారు.

**భక్తుల హర్షం**

సకల సౌకర్యాలతో మహాజాతర నిర్వహణకు ఏర్పాటు చేయడంతో భక్తులు స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.జాతరను శాంతి యుతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జాతర కమిటి సభ్యులు కోరుతున్నారు.రెండు రోజుల్లో జాతర ఈనెల 28 వతేదీ నుండి జాతర ప్రారంభం కానుండగా 31 వ తేదీ జాతర ముగుస్తుంది. కాగా 21 వ తేదీన ఆదివాసిల సంప్రదాయం ప్రకారం మండ మెలిగే పూజలు చేయడం జరిగింది.గద్దెలను శుద్ధిచేసి అలంకరించారు.

## నవచేతనలో ‘మదింపు’ పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత గణతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా డాక్టర్ కాసర్ల రంగారావు రాసిన ‘మదింపు’పుస్తకాన్ని స్థానిక నవచేతన బుక్ హౌజ్ లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర అరసం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలు దాటిన మన రాజ్యాంగ రచనకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.ఎందరో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలకు చెందిన ప్రముఖులు తమతమ త్యాగనిరతులు దేశ పురోభివృద్ధికి దోహదం చేశాయన్నారు. అలాంటి వారి సేవలను,అభిప్రాయాలను శాస్త్రీయంగా విశ్లేషించి రంగారావు ఈ పుస్తకంలో ఎంతో విలువైన సమాచారాన్ని అందించారన్నారు. సభాధ్యక్షత వహించిన నాగరాజు తన అభిప్రాయంగా ఈ పుస్తకం నేడు కాంపిటేటివ్ పరీక్షలు రాసే వారికి రెఫరెన్స్ బుక్ గా ఉపయోగపడుతుందని అన్నారు..ఈ సమావేశంలో గోలి సాంబమూర్తి, ఉస్మాన్ పాషా,సూర్య,రమేశ్ పాల్గొన్నారు.

## పీచర మినీ మేడారం జాతర పనుల పర్యవేక్షణ



**ప్రజాపక్షం/వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులో జరుగబోయే మినిమేడారం సమ్మక్క సారక్క జాతర పనులను వరంగల్ వెస్టు జోన్ డిసిపి దార కవిత కాజిపేట ఎసిపి పింగిళి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పర్యవేక్షించారు .ఈసంధర్భంగా డిసిపి కవిత మాట్లాడుతూ ఈనెల 28 నుంచి 31 వరకు నిర్వహించే జాతరకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని అమ్మవారి దీవెనలు పొందుతారు. కనుక జాతర ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సకలవసతులను సంబంధితశాఖ అధికారులను సంప్రదించి ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆలయ చైర్మన్ రమేష్ కు కమిటీ సభ్యలకు, గ్రామస్తులకు పలుసూచనలు చేశారు.కార్యక్రమంలో వరంగల్ వెస్టు జోన్ డిసిపి కవిత,కాజిపేట ఎసిపి ప్రశాంత్‌రెడ్డి,ఎస్ఐఎ సురేష్,ఆలయ చైర్మన్ గొల్లెన రమేష్,వైస్ చైర్మన్ సట్ల రవిందర్,మాజీజడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు,గొల్లెన శ్రీకాంత్,నక్క సంపత్,తదితరులు పాల్గొన్నారు.

## డెస్క్ జర్నలిస్టుల సంబురాలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా మీడియా కార్డు స్థానంలో అక్రిడిటేషన్ కార్డు జారీ చేస్తామని జిఒ నెంబర్ 252 లో మార్పులు చేయడం జర్నలిస్టు యూనియన్‌ల సమష్టి విజయమని పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాత అక్రిడిటేషన్ జిఒలో మార్పులు చేయడాన్ని స్వాగతిస్తూ డెస్క్ జర్నలిస్టులు,టియుడబ్ల్యుజె (ఐజెయు), టియుడబ్ల్యుజె(143) జిల్లా యూనియన్ ల ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్రిడిటేషన్ జిఒలో మార్పులు చేయడం జర్నలిస్టుల సమష్టి పోరాట విజయమని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె(ఐజెయు), టియుడబ్ల్యుజె (143)రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బిఆర్ లెనిన్, డెస్క్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శంకర్ రావు శెంకేషి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, జిల్లా అధ్యక్షులు మస్కపురి సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, డెస్క్ జర్నలిస్టుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శరీర దానానికి ముందుకు వచ్చిన తల్లి, కొడుకు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** శరీర దానం కోసం ముందుకు వచ్చిన తల్లి సుశీల, కొడుకు లింగారెడ్డిల సంకల్పం వెల కట్టలేనిదని పలువురు అన్నారు. తమ మరణానంతరం తన మృత దేహాలను వైద్య కళాశాలకు అప్పగిస్తూ, ఆదర్శ తల్లి కొడుకులు హామీ పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సమాజంలో సేవ చేయడం కన్నా గొప్ప అనుభూతి ఏది లేదని,సేవ చేయడం ద్వారా మన మనస్సుకు ఆనందం,సంతృప్తి కలుగుతుందనీ,తెలంగాణ రాష్ట్ర నేత్ర,అవయవ,శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొన్రెడ్డి మల్లా రెడ్డి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పరికి పండ్ల వేణు అన్నారు. హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ సమీపంలోకు చెందిన సీనియర్ సిటిజన్ రిటైర్డు పోస్టల్ ఉద్యోగి పత్తి లింగా రెడ్డి, వారి తల్లి అయిన సుశీల (85) తమ మరణానంతరం ,భౌతిక దేహాలని కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగిస్తూ తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం ప్రతినిధులకు హామీ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి, పోరెడ్డి రమణా రెడ్డి అనగోని సదానందం గౌడ్ లు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు ములుగు నుండి ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు

**ప్రజాపక్షం/ములుగు:**ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిఎస్‌ఆర్‌టిసి) సికింద్రాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ములుగు కేంద్రంగా చేసుకొని మేడారానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. సికింద్రాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి నేతృత్వంలో ఈ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆత్మకూర్, మల్లంపల్లి, ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి తదితర ప్రాంతాల నుండి నేరుగా మేడారం చేరుకునేలా ప్రత్యేక బస్సులను ప్రారంభించినట్లు వెల్లడించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను అవసరమైన మేరకు పెంచనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. జాతర కాలంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అధిక సంఖ్యలో సర్వీసులు, అదనపు ట్రిప్పులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బస్సుల రాకపోకలను పర్యవేక్షించేందుకు ములుగు డిపో పరిధిలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయడంతో పాటు డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మేడారం జాతరకు వచ్చే భక్తులు ప్రయివేట్ వాహనాల కంటే ఆర్‌టిసి బస్సులను వినియోగించి రద్దీ, ట్రాఫిక్ సమస్యలను నివారించడంలో సహకరించాలని ఆర్‌టిసి అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారంభూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని యాదవకాలనీ 5వ వార్డులో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం మున్సిపాలిటీకి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ 63 కోట్లతో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ ఈసంపల్లి జోన, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, నాయకులు పైడిపల్లి రమేష్, 5, 6 వార్డు ఇన్‌చార్జి ఉడుత మహేందర్, మాజీ కౌన్సిలర్ ఉడత సరోజన, లోడింగ్ అన్ లోడింగ్ అధ్యక్షుడు బౌత్ విజయ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన ప్రతీ దివ్యాంగుడి కి అండగా ప్రజా ప్రభుత్వం**

అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన అర్హులైన దివ్యాంగులకు ఎలక్ట్రికల్ స్కూటీలు, విద్యార్థులకు ల్యాప్ టాప్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు, పెన్షన్లు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దివ్యాంగులు స్వావలంబనతో గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ మల్లేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పం కిషన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పగిడిద్ద రాజు ఆలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ములుగు:**పగిడిద్ద రాజు ఆలయంలో మంత్రి సీతక్క మంగళ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారానికి బయలుదేరనున్న పగిడిద్దరాజు బుధవారం సాయంత్రానికి సారలమ్మ గద్దెలకు చేరి కొలువుదీరనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ సాంప్రదాయల పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క డోలు సన్నాయి వాయిద్యాల మధ్య మహిళలతో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య, స్టేట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, కొత్తగూడెం గంగారం మండలాల అధ్యక్షులు వజ్జే సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు, పూజారులు, తదితరులు పాల్గొన్నారు

## పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు పూర్తి

రూ.35 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం పనులకు ఎమ్మెల్యే నాయిని శ్రీకారం



**ప్రజాపక్షం/హనుమకొండ :** గడిచిన పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు కేవలం రెండేళ్లలో పూర్తి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున 31 వ డివిజన్ పరిధిలోని హంటర్ రోడ్డు నంది హిల్స్ కాలనీలో సూమరు రూ.35 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు.ఈ మేరకు స్థానిక డివిజన్ నాయకులు,కాలనీ వాసులతో కలసి కొబ్బరికాయ కొట్టారు.స్థానికంగా పర్యటిస్తూ రోడ్డు డ్రైనేజీ పరిస్థితులను పరిశీలించారు.ప్రధాన రోడ్డు వెంట ఉన్న మురుగు కాల్వలు వెంటనే శుభ్రం చేయాలని సంబధిత అధికారులకు ఆదేశించారు.శంకుస్థాపన చేసిన రోడ్లను తరగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం శాయంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రకాష్ రెడ్డి,తిరుమల ఆధ్వర్యంలో ఉచితంగా టిఫిన్ బాక్స్ లు, కంప్యూటర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠాలకు అందజేశారు.పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న కిచెన్ షెడ్ నిర్మాణ పనులను చూసిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి అంచనా వ్యయం తీసుకు రావాలని కోరారు.పాఠశాల మౌలిక సదుపాయాల క ల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చా రు. శాయంపేటలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వారి వెంట కార్పొరేటర్ మా మిండ్ల రాజు,మాజీ కార్పొరేటర్ మోహన్ రా వు,డివిజన్ అధ్యక్షులు సురేందర్ నాయకులు జ గన్ మోహన్ రెడ్డి, రాజ్ కుమార్,సత్తు రమే ష్,నాయిని లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.3 లక్షల కోట్లు

బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు డిమాండ్

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ లో ఉపాధి హామీ పథకానికి మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని, విబిజి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు చిన్న, సన్న కారు రైతులకు పనులు కలిగించి వలసలను నిరోధించేందుకు 2005 లో యుపిఎప్రభుత్వం తెచ్చిన ఎంజి నరేగా చట్టాన్ని మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా సక్రమంగా అమలు జరపకుండా ప్రతి సంవత్సరం నిధులలో కోత పెడుతూ చివరికి ఆ చట్టాన్ని రద్దుచేసి గాంధీ పేరు తొలగించి విబిజిరామ్‌జి చట్టాన్ని చేసి ఉపాధి కూలీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు ఉధృతం కాకముందే నూతన చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని అమలు పరచాలన్నారు. కోట్లాదిమంది కూలీల జీవితాలతో చెలగాటమాడితే తగినమూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో జాబ్ కార్డులు కలిగిన 15 కోట్ల కుటుంబాలకు పనులు కలిగించేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ. 3 లక్షలకోట్లు కేటాయించాలని, సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు రూ.700 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపజేసి పనులు కల్పించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

## నోడల్ అధికారుల నియామకం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భూపాలపల్లి మున్సిపాలిటీకి నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికలను సజావుగా ని ర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రా హుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్నికల నిర్వహణలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, ర వాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్ష ణ, మీడియా, హె ల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో అబ్జర్వర్లు తదితర కీ లక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశా ల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఎలాంటి పొరపాటుకు తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ ఆదేశించారు.

## లారీ, కారు ఢీ..



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ ఉర్సు బైపాస్ రోడ్డులో ఓ లారీ, కారు ఢీకొన్న సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లో వెళితే హనుమకొండ నుండి ఐనవోలు మండలం కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న ఉదయశ్రీ, కవిత, సురేఖ, నర్సింహా రెడ్డి, పెద్దకుంట తండా హైస్కూల్ వీరలింగం లు కారులో డ్యూటీకి వెళ్తుండగా కారు పక్క నుండి గుర్తు తెలియని లారీ ఓవర్ టెక్ చేస్తూ వెళ్తున్న క్రమంలో లారీ వెనుక భాగంలో కారును ఢీకొట్టింది. దీనితో అదుపు తప్పిన కారు డివైర్‌ను ఢీకొట్టగా రోడ్డుకు అటువైపు పడింది. ప్రమాదం దాటికి కారు నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ప్రయాణిస్తున్న టీచర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికుల సహాయంతో కారులో నుండి వారిని బయటకు తీశారు. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వాజేడు పోలీస్ స్టేషన్‌లో ‘మిస్ ఫైర్’

**ప్రజాపక్షం/వాజేడు:**ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ జవాన్లు గన్నులు క్లీన్ చేస్తుండగా యుజీబీఎస్ గన్ మిస్ ఫైర్ అయింది. భారీ శబ్దం రావడంతో వాజేడు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జవాన్లు గన్నులు క్లీన్ చేస్తుండగా మిస్ ఫైర్ అయ్యి గోడకు తగలడంతో ఆ రేణువులు ఇద్దరు జవాన్లకు తగలడంతో చిన్నచిన్న గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణహాని జరగలేదు. బుల్లెట్ తుప్పర్లు తగిలిన జవాన్లు 1 వెంకటసుబ్బయ్య, 2 కోటేశ్వరరావు అనే ఇద్దరు జవాన్ల భారీ ప్రమాదం నుండి బయటపడ్డారు. ఇది తెలుసుకున్న సిఆర్పిఎఫ్ పోలీసులు వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ములుగు వైద్యశాలకు 108 వాహనం సహాయంతో తరలించారు.

## మున్సిపల్ పోరు సర్వం సిద్ధం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం




**ప్రజాపక్షం/జనగామ:**మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా 13ను ఓట్ల లెక్కింపు జరగనుంది. బుధవారం నుండే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. జనగామ జిల్లాలో రెండు మున్సిపాల్టీలు ఉన్నాయి. జనగామ మున్సిపాల్టీతో పాటు కొత్తగా స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీగా ఏర్పడింది. జనగామ మున్సిపాల్టీలో 30 వార్డులు ఉండగా స్టేషన్‌ఘనపూర్‌లో 18 వార్డులు ఉన్నాయి. ఇటీవలనే వార్డుల రిజర్వేషన్లు పూర్తి అయ్యాయి. ఎన్నికల కమీషనర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుండి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ఈ నెల 30 వరకు నామినేషన్లు వేయనుండగా 31న స్కూటిని నిర్వయించి అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తారు. అప్పీళ్లను ఒకటి వరకు తీసుకుంటారు. అప్పీళ్లను ఫిబ్రవరి ఒకటిన ప్రకటించి వాటిరి 2వ తేదీన డిస్‌పోజ్ చేశారు. మూడున విత్‌డ్రాలు ఉండనుండగా అదే రోజు ఫైనల్ లీస్టు ప్రకటిస్తారు. 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 13వ తేదీన 8 గంటలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. పై విధంగా ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ప్రకటించింది.

**ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి:కలెక్టర్**

మున్సిపల్ ఎన్నికలకు సిద్దంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డిజిపి శివదర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా ఎన్నికలు నిర్వయించేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల సామాగ్రి పరిశీలన సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్, జడ్పి సిఈఓ మాదురిషా, జనగామ స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ కమీషనర్లు మహేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
బుధవారం
28-01-2026
www.prajapaksham.in

వీ ఆర్ జీ ఆర్ మూవీస్ బ్యానర్‌పై గంగాధర్ సమర్పణలో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు జీవి నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం క్యాట్ ఫస్ట్ కాపీ రెడీ చేసుకుని త్వరలో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ప్రముఖ దర్శకులు బుచ్చి బాబు హైదరాబాద్‌లో విడుదల చేశారు.

# రీల్

## మోహన్‌బాబుకు ఎక్సలెన్స్ అవార్డు



కోల్‌కత్తాలోని లోక్ భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుండి ప్రతిష్ఠాత్మక గవర్నర్ అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్‌ను నటుడు డా. మంచు మోహన్ బా బు అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఈ అవార్డును విశిష్ట అతిథుల మధ్య ప్రదానం చేశారు. తరువాత సాంప్రదాయ ఎట్ హోమ్ రిసెప్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో మోహన్ బాబు కుమారుడు, మా అధ్యక్షుడు విష్ణు మంచు, మా కోశాధికారి శివ బాలాజీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ బాబు తన స్పందను తెలియజేస్తూ ప్రస్తుత భారతదేశం అంతటా తెలుగు సినిమా ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక తె లుగు నటుడికి ఇటువంటి గౌరవాన్ని ప్రదానం చేయడం ఓ ప్రత్యేక చరిత్రను సృష్టించినట్లుగా నిలిచింది. మోహన్ బాబు 50 సంవత్సరాల సినీ జీవితంలో కళామతల్లికి చేసిన సేవ, అట్టడుగు స్థాయి నుండి భారతదేశం గర్వించదగ్గ నటుడిగా ఎదగడం, విద్య, దాతృత్వంలో సమాజం పై చెరగని ముద్ర వేయడం గురించి అందరికీ తెలిసిందే. ఆయన సినీ, వ్యక్తిగ త జీవితం, పాటించే క్రమశిక్షణ మందికి స్ఫూర్తినిస్తుంది అని అన్నారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' డబ్బింగ్ పనులు షురూ



పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. సాధ్యమైనంత త్వరగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి విడుదల కు సిద్ధం చెయ్యాలనే ఉద్దేశంతో ఈ సినిమా డబ్బింగ్ పనులను మొదలు పెట్టారు. పవన్ కళ్యాణ్ త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' గీతం శ్రోతలను ఉర్రూతలూగించింది.'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్లను త్వరలోనే నిర్మాతలు వెల్లడించనున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథనం: కె. దాశరథ్, రమేష్ రెడ్డి, రచనా సహకారం: ప్రవీణ్ వర్మ, చంద్ర మోహన్, కూర్పు: కార్తిక శ్రీనివాస్, కళ: ఆనంద్ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లు: ఆర్. చంద్రశేఖర్, దినేష్ నరసింహన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: హరీష్ పై, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, నబకాంత్, పృధ్వీ.


## రణబాలి' గ్లింప్స్ రిలీజ్




విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న మూవీకి 'రణబాలి' అనే టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ గ్లింప్స్ విడుదలతో పాటు సినిమా రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. తన మాతృభూమి కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడే రణబాలి పాత్రలో విజయ్ ఒదిగిపోయారు. హీరోయిన్ రశ్మిక మందన్న జయమ్మగా కనిపించింది. ప్రతినాయకుడు సర్ థియోడోర్ హెక్టార్ పాత్రలో 'మమ్మీ' సినిమా ఫేమ్ నటుడు ఆర్నాల్ వోస్లూ నటించారు. పచ్చటి పైరులతో అలరారే మన గ్రామసీమలను బ్రిటీష్ క్రూర పాలకులు కరువు ప్రాంతాలుగా ఎలా మార్చారో ఈ గ్లింప్స్ లో బాధాకరంగా చూపించారు. ఆర్థికంగా పీల్చిపిప్పి చేస్తూ మన సమాజంలో హిట్లర్ ఊచకోతను మించిన మారణహోమాన్ని బ్రిటీషర్స్ ఎలా సృష్టించారో గ్లింప్స్ రిఫ్లెక్ట్ చేసింది. బ్రిటీష్ అధికారిని గుర్రానికి కట్టి రైల్వే ట్రాక్ పై రణబాలి ఈడ్చుకుంటూ వెళ్లే సీన్ గ్లింప్స్ కు హైలైట్ గా నిలుస్తోంది.19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పనిచేస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత 'రణబాలి'లో మూడో సారి రశ్మిక, విజయ్ జంటగా నటించారు.

## వీరారెడ్డి పాత్ర వెరీ పవర్‌ఫుల్

సంగీత దర్శకుడు, నటుడు రఘు కుంచె



పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం 'దేవగుడి'. ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. 'దేవగుడి' సినిమా ఈ నెల 30న రిలీజ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డి, నటుడు రఘు కుంచె మీడియాతో చిట్ చాట్ చేశారు. నటుడు రఘుకుంచె మాట్లాడుతూ ఈ నేను దేవగుడి వీరారెడ్డి అనే పాత్రలో నటించాను. ఆయన ఆ చుట్టు పక్కల ఏరియాలో పవర్ ఫుల్ వ్యక్తి. నాకు పలాస సినిమా తర్వాత అలాంటి రోల్స్ వస్తున్నాయి. ఈ సినిమాలో వీరారెడ్డి పాత్ర కోసం దర్శకుడు రామకృష్ణా రెడ్డి ఎలా చెబితే అలా చేశాను. రాయలసీమ యాసలో డైలాగ్స్ చెప్పాను. ఈ సినిమా షూటింగ్ అంతా రియల్ లొకేషన్స్ లో చేశాం. ఎక్కడైతే కొన్ని ఇన్సిడెంట్స్ జరిగాయని దర్శకుడు స్క్రిప్ట్ రాశారో అక్కడే షూటింగ్ చేశాం.

## ఒక్కసారైనా ఇలాంటి పాత్ర చేయాలి అనుకున్నా

ఈషా రెబ్బా



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ జంటగా వస్తున్న తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈ సినిమా జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాకు కొంచెం గ్యాప్ వచ్చిన మాట నిజమే. నా లాస్ట్ మూవీ సినిమా సరిగ్గా వర్కౌట్ కాలేదు. క థ, పాత్ర సినిమాలో ఫైనల్ గా ఉంటుందని నమ్మకం కుదిరిన తర్వాతే చేద్దామని అనుకున్నాను. అలా నమ్మక ంగా కుదిరిన కథ ఇది. 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమా ఒరిజినల్ నాకు చాలా ఇష్టం. అందులో హీరోయిన్ క్యారెక్టర్ నాకు చాలా నచ్చుతుంది. ఇది అందరూ యూనివర్సల్ గా కనెక్ట్ అయ్యే సోరీ.మన తెలుగు నేటివిటికి తగ్గట్టు కథలో పాత్రల్లో చాలా మార్పులు చేశారు. ఇందులో ఉండే ఎమోషన్స్ అందరు కూడా కనెక్ట్ అయ్యేలాగా ఉంటా యి. సినిమా చూస్తున్నప్పుడు రీమేక్ అనే ఫీలింగ్ రాదు. ఇందులో అన్ని క్యారెక్టర్స్ కి ఆడియన్స్ రిలేట్ అవుతారు.నాకు శాంతి క్యారెక్టర్ చేయడం చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కెరీర్‌లో ఒక్కసారైనా ఇలాంటి పాత్ర వస్తే చేయాలని అనుకునేదాన్ని. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. ఈ సినిమాకి హండ్రెడ్ పెర్సెంట్ ఎఫర్ట్ పెట్టాను. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇందులో మెయిన్ కాన్సెప్ట్ చాలా ఫన్నీగా అలాగే ఎంటర్టైనింగ్ గా చెప్పడం జరిగింది. ఎక్కడ కూడా మెసేజ్ ఇచ్చినట్లుగా ఉండదు. కొంచెం యాక్షన్ ఉన్న సినిమాలని ఇష్టపడతాను. ఇందులో చెంప దెబ్బలు ఉన్నాయి. ఒక దెబ్బ చెంపకి తగిలేలా ఉండాలి. చట్నీ చెంపకి అంటుకునేలా ఒక సీన్ ఉంది. అది రావాలంటే ఖచ్చితంగా కొట్టాల్సిందే. ఆ రకంగా నిజంగానే గట్టిగా ఒక చెంప దెబ్బ తగిలింది. ఆ సీన్‌లో నా కళ్ళల్లో వచ్చిన నీళ్లు రియల్. ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్ ఉంది. ఆ సీన్‌లో తరుణ్ కి నాకు ఇద్దరికీ దెబ్బలు తగిలాయి. కోవిడ్ సమయంలో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను.గోదావరి యాస విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే మా అమ్మగారిది రాజమండ్రి. నేను సమ్మర్ హాలిడేస్‌కి ప్రతిసారి అక్కడికి వెళ్ళేదాన్ని. అయితే తరుణ్ కి యాస ఒక ఛాలెంజ్. ఆయన యాస కోసం చాలా శ్రమించారు. ఎందుకంటే ఇప్పటివరకు అయినా తెలంగాణ తప్పితే మరో యాస పాత్రలు చేయలేదు. ఈ సినిమాకు మాత్రం చాలా కష్టపడ్డారు. అవుట్ పుట్ చాలా అద్భుతంగా వచ్చింది. తెరపై మీకు ఓంకార్ నాయుడు పాత్ర మాత్రమే కనిపిస్తుంది. మంచి సమ్మర్లో ఈ సినిమా షూటింగ్ చేసాము. చాలా వేడి వాతావరణం ఉండేది. ఆ వేడి పెద్ద చాలెంజ్ అనిపించలేదు. ఎందుకంటే నాకు చిన్నప్పటినుంచి ఆ ప్రాంతం అలవాటే. కాకపోతే ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఒక సీన్ చేసాము. నాకు నీళ్లంటే భయం. ఆ సీన్ చేస్తున్నప్పుడు నిజంగా భయపడ్డాను.

## 'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా డేవిడ్ రెడ్డి. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా డేవిడ్ రెడ్డి సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మారియా ర్యబోషప్క హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. 'డేవిడ్ రెడ్డి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్ లాంఛ్ చేశారు. డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ పోస్టర్స్ లో రూత్ లెస్, బ్రూటల్ అనే రెండు లుక్స్ లో మంచు మనోజ్ ఇంటెన్స్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఈ రెండు లుక్స్ చూస్తే మూవీలో టెర్రిఫిక్ యాక్షన్ ఉంటుందని తెలుస్తోంది. మంచు మనోజ్ తన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, లుక్స్, పర్ఫార్మెన్స్ తో డేవిడ్ రెడ్డి పాత్రకు లైఫ్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో డేవిడ్ రెడ్డి సినిమా బజ్ క్రియేట్ చేస్తోంది.1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలాన్ని నేపథ్యంగా తీసుకుని 'డేవిడ్ రెడ్డి' సినిమాను ప్రతిష్టాత్మకంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో బ్రిటీష్ క్రూర పాలనకు ఎదురునిలిచి పోరాడిన యోధుడి పాత్రలో మనోజ్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ రవి జక్కుల, యాక్షన్ సుప్రీమ్ సుందర్. ఎడిటింగ్ ఉజ్వల్ కులకర్ణి,డీవోపీ ఆచార్య వేణు, మ్యూజిక్ రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొట్టు రవికుమార్.

---

## విషప్రచారం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా ఖండించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్యంలో క్యాబినెట్ అనేది ఒక యూనిట్. పరిపాలనా పరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం ఏర్పడకుండా ఉండటానికి సీనియర్ మంత్రులుగా మేము చర్చించుకుంటే అందులో తప్పేముంది? అది ప్రభుత్వ సమష్టి బాధ్యత. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారిక నివాసంలో మేము భేటీ అయి పరిపాలనా పరమైన అంశాలను చర్చించాం' అని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మేరకు మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'లోక్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం ముగిసిన తర్వాత అందరి ముందే మంత్రులమంతా ఒకే కారులో వెళ్లాం. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత. దీనికి కూడా లేనిపోని రంగులు పూయడం సమంజసం కాదు' అని మంత్రి పేర్కొన్నారు. 'నిర్మాణాత్మకమైన విమర్శలను మేము ఎప్పుడూ స్వాగతిస్తాం. కానీ వ్యక్తిత్వ హననానికి, ఊహాజనిత కథనాలకు పాల్పడితే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. రాష్ట్రాభివృద్ధి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న మా ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం ఇకనైనా మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి' అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.

## ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి విత్తనం

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రైతుల చేతులో ఉండాల్సిన విత్తనం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ఎరువుల వాడకం పెరిగడంతో భూమి, నీరు, వాతావరణం కాలుష్యమవుతోందని, ఈ పంటల కారణంగా రోగాల భారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని, కూరగాయల సాగు చేసే రైతులకు మార్కెట్లు అందుబాటులో ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్, దెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ' సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని కాన్ఫరెన్స్ హల్‌లో 'తెలంగాణ వ్యవసాయ రంగం భవిష్యత్ ప్రణాళికల' మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషన్ చైర్మన్ ఎం.కోందండరెడ్డి అధ్యక్షత వహించగా, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కమిషన్ సభ్యులు రాములునాయక్, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహారెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, నాబార్డు సిజిఎం ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయి, అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహారావు, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికలర్చర్ ఫౌండర్ రామాంజనేయులు, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ దివ్య, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నల్లమల వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డితో పాటు రైతు సంఘం నాయకులు, వ్యవసాయ రంగ నిపుణులు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ఎరువులు, విత్తనాలు కల్తీ కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కమిషన్ వివిధ రాష్ట్రాల్లో పర్యటించిందని వివరించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ వ్యవసాయ రంగంపైన ఆధారపడిన 60శాతం ప్రజలను ఆర్థికంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. చిన్న, సన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని వారిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయరంగంలో భవిష్యత్ ప్రణాళికలు ఉండాలని సూచించారు. అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనం అందాలన్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు వద్ద ఉత్పత్తి అయ్యే విత్తనాలను వ్యవసాయ యూనివర్సిటీలో తయారుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు ఆగ్రోస్, విత్తనాభివృద్ధి సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాములు నాయక్ మాట్లాడుతూ వరి తరహాలో చిరుధాన్యాలకు కూడా బోనస్ ఇవ్వాలని సిఎంను కోరితే, అందుకు అంగీకరించినట్టు తెలిపారు. గోపాల్ రెడ్డి ప్రతి రైతు ఆర్గానిక్ వ్యవసాయం చేసేలా చూడాలన్నారు. భవానీ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర చాలా కీలకమని, మరింత ఎక్కవ మంది మహిళలు వ్యవసాయం చేసేందుకు ముందుకురావాలని కోరారు. రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు ఎరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలనన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సారం పల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి, అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కాగా వర్క్‌షాపులో వ్యక్తమైన అభిప్రాయాలను ఒక నివేదికగా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ తెలిపింది.

## సర్వే సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

కిలోమీటర్ల మేర కార్నివోర్ సైన్ సర్వే, రోజుకు 2 కిలోమీటర్ల ట్రాన్సెక్ట్ సర్వే నిర్వహించి అటవీ వృక్షజాలం, ఆహార జంతువుల సాంద్రతను అంచనా వేశారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఎంస్ట్రిప్స్ యాప్‌లో నమోదు చేసి, వైల్డ్‌ఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రిమోట్ సర్వర్‌కు అప్‌లోడ్ చేశారు. ప్రాథమిక గణాంకాల ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా పులులు, ఇతర మాంసాహార జంతువుల ఉనికికి సంబంధించి 994 ఆధారాలు లభించాయి. అలాగే 552 పెద్ద శాకాహార జంతువులకు సంబంధించిన ఆధారాలను అధికారులు గుర్తించారు. ఇతర వన్యప్రాణుల ఆనవాళ్లు కూడా పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయి. ఈ సర్వేలో 4,512 మంది అటవీ శాఖ సిబ్బందితో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన 1,677 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.సర్వే సమయంలో కొన్ని విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. విధి నిర్వహణలో ఒక అటవీ వాచర్ గుండెపోటుతో మృతి చెందగా, ఎలుగుబంటి దాడిలో ఒకరు గాయపడ్డారు. మరొక వాలంటీర్‌కు కాలు విరిగింది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య అటవీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి సర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తెలంగాణ అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఈ సర్వే ద్వారా వెల్లడైందని అధికారులు తెలిపారు.పులుల గణన సర్వే నివేధికను కేంద్రానికి పంపించారు. అన్ని రాష్ట్రాల నుంచి అందిన నివేధికల ఆధారంగా దేశంలో పులల సంఖ్యపై కేంద్రం ప్రకటన చేస్తుంది.

---

## సోషల్ మీడియా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన చర్చలు మంగళవారం ఉదయం వరకూ కొనసాగాయి. ఎట్టకేలకు 131–21 తేదీతో బిల్లును సభ్యులు ఆమోదించారు. ఇక ఈ బిల్లును ఇప్పుడు ఎగువసభకు పంపుతారు. ఎగువసభ ఆమోదం పొందిన తర్వాత ఈ బిల్లు చట్టరూపం తీసుకుంటుంది. మేక్రాన్ రినైజాన్స్‌పార్టీకి దిగువసభలో నాయకత్వం వహిస్తున్న గాబ్రియేల్ అత్తల్ ఒక ప్రకటన చేస్తూ ఫిబ్రవరి నాటికి ఎగువసభ బిల్లును ఆమోదిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికలు పిల్లల్లో వలస మనస్తత్వాన్ని పెంచుతున్నాయని విమర్శించారు. 'యూరప్‌లో మేమే మార్గదర్శిగా ఉంటాం, మా పిల్లలు, యువకుల మనసులను తీర్చిదిద్దుతాం, దేశ విధిరాతను స్వతంత్ర ఆలోచనల దిశగా మారుస్తాం' అన్నారు. బిల్లు ఆమోదం ఫ్రాన్స్‌లో పిల్లలను, వారి బాల్యాన్ని కాపాడేందుకు తీసుకున్న అతిపెద్ద చర్యగా దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మేక్రాన్ అభివర్ణిస్తూ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గత ఏడాది డిసెంబరులో అండర్–16 పిల్లలకు సోషల్ మీడియాను అందుబాటులో లేకుండా చేస్తూ ఆస్ట్రేలియా పార్లమెంటు చట్టం చేసింది. ఆ స్ఫూర్తితో అనేక దేశాలు పునరాలోచనలో ఉన్నాయి. సోషల్ మీడియా వల్ల స్క్రీన్ టైమ్ పెరిగిపోయి పిల్లల్లో నిద్రలేమి సమస్యలు వస్తున్నాయని, వారు బాల్యాన్ని కోల్పోతూ, తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని అనేక ఫిర్యాదులు సర్వత్రా వస్తున్నాయి. 'అమెరికా వేదికలైనా, చైనా వేదికలైనాగానీ మా పిల్లలు, టీనేజర్ల భావోద్వేగాలు అమ్మకానికి సిద్ధంగా లేవు లేదా వారికి అనుగుణంగా మార్చుకోవడానికి సిద్ధంగా లేవు,' అని గడచిన శనివారంనాడే ఒక వీడియో ప్రసారంతో మేక్రాన్ హెచ్చరిక చేశారు.




## ఐదు రోజులే పనిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వర్, శ్రీకాంత్ మిశ్రా (ఎల్ఐసి), ఎఐబిఇఎ నేతలు రవీంద్రనాథ్, పి.వి.కృష్ణా రావు, సమద్ ఖాన్ (ఎఐబిఇఎ), శాండిల్య(ఎన్‌సిబిఇ), ఫణికుమార్(ఎఐబిఒఎ), రాజ్‌కుమార్ (ఎఐబిఒసి), అర్జున్(ఐఎన్‌బిఒసి), వెంకటరామయ్య (బిఇఎఫ్ఐ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుఎఫ్‌బియు కన్వీనర్ అంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)తో పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ, తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ లభించలేదన్నారు. ఐదు రోజుల పని దినాల అమలు వల్ల ఉద్యోగుల పనితీరు, జీవన సమతుల్యత మెరుగవుతుందని తెలిపారు. 2015 నుంచి తమ డిమాండ్ పెండింగ్‌లోనే ఉందని, ఆర్‌బిఐ, నాబార్డ్, సెబి, ఎల్ఐసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోందని, బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగంతో ముడిపడి ఉన్న అన్ని సంస్థలకు శని, ఆదివారాలు సెలవు అమలవుతున్నదని, బ్యాంకు ఉద్యోగులకు కూడా అమలు చేయాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారి మద్దతుతో సాధించాలని చెప్పారు. వెంకటరామయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 8లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు రూ.400లక్షల కోట్ల లావాదేవీలు జరుపుతున్నారని, బ్యాంకుల్లో సిబ్బంది కొరత, పని ఒత్తిడితో ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, గత సంవత్సర కాలంలో నలుగురు ఉన్నత స్థాయి బ్యాంకు ఉద్యోగులు పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 90శాతం బ్యాంకింగ్ లావాదేవీలు డిజిటల్ రూపంలోనే జరుగుతున్నాయని ప్రభుత్వాలే చెబుతున్నాయని, ఇప్పటికే రెండవ, నాలుగవ శనివారాలు సెలవు అమలవుతున్నందున ప్రభుత్వం ఇచ్చిన హామీ మేర కు మిగతా రెండు శనివారాలు కూడా సెలవు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పని దినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు. బ్యాంకు ఉద్యోగుల నాణ్యమైన డిమాండ్ అమలు చేయకపోతే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మె చేసి ఐదు రోజుల పనిదినాలను సాధించుకుంటామని ఉద్యోగులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఐబిఇఎ నాయకులు ఉదయ్ భాస్కర్, అజయ్‌కుమార్, నల్లప రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వనజాతరకు వెళ్లొద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్నారు. అలాగే 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్‌టిసి కార్యాచరణ రూపొందించింది. భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు నీటిపారుదలశాఖ, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదిరత శాఖలన్నీ కూడా సిద్ధమయ్యాయి. భక్తులకు సెల్ సిగ్నల్స్ సమస్య ఉత్పన్నం కాకుండా భారీగా మొబైల్స్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. మేడారం జా తరలో అత్యంత కీలకమైనది పోలీస్ శాఖనే. ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్ర తల భారం ఆ శాఖపైనే ఉండటంతో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత జాతరలో సుమారు 30వేల మంది భక్తులు తప్పి పోయిన నేపథ్యంలో ఈసారి జియోట్యాగ్ టెస్ట్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకవచ్చారు. వృద్ధులు, పిల్లలకు పస్రా తాడ్వాయి మార్గాల్లో క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడుతారు. దీంతో ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. అపుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్ను కూడా సిద్ధం చేశారు. అలాగే టీజీ క్వెస్ట్ అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను జాత రలో వినియోగిస్తున్నారు. ఎఐ డ్రోన్లు జాతరలో గస్తీ నిర్వహించనున్నాయి. అలాగే జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్‌ప్లే ప్యానల్స్ వినియోగిస్తున్నారు. క్లౌడ్ కౌంటింగ్ కెమెరాలు, పేస్ రికగ్నైజేషన్ కెమెరాలను కూడా క్యూలైన్లు, అధికంగా భక్తులు ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు. చేస్తున్నారు. అలాగే 42 పార్కింగ్ స్థలాలు, 37 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి పస్రా వరకు నాలుగు కిలో మీటర్లకు ఒకటి చొప్పున పోలీస్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేశారు.

### వైద్యఆరోగ్యశాఖ సేవలు

మేడారం జాతరలో వైద్యశాఖ సేవలు కీలకంగా మారాయి. ఈసారి 50 పడకల ఆస్పత్రితో పాటు ప్రత్యేకంగా 30 హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేశారు. 5,192 మంది మెడికల్, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. జాతర అనంతరం కూడా వ్యాధులు ప్రబలకుండా 10మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు ములుగు జిల్లా ఆస్పత్రి, ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రిల్లో వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 108 వాహనాలను 15 అందుబాటులో ఉంచుతున్నారు. మరో 15 మొబైల్ అం బులెన్స్ లను కూడా జాతరకు తరలిస్తున్నారు.

### టిజిఎస్ ఆర్‌టిసి ఏర్పాట్లు

మేడారం మహాజాతరకు ఆర్‌టిసి విస్తృతంగా ఏర్పాట్లు చేసిం ది. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి 20 లక్షల మంది భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 4వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. 10,441 మంది సిబ్బందిని నియమించి సేవలను విస్తృత పరిచేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజియన్‌లో 51 పాయింట్లను ఏర్పాటు. చేసింది. అలాగే జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ వినూత్న తరహాలో కొత్త స్కీం ప్రవేశ పెట్టింది. 30మంది భక్తులు ఉంటే ఇంటికే ఆర్టీసీ బస్సును పంపి స్తుంది. ఇప్పటికే మేడారం ప్రసాదాన్ని (బెల్లం) భక్తులకు ఇంటికి చేర్చేందుకు ప్రత్యేకంగా కార్గో సర్వీసు ప్రారంభించింది. అలాగే బస్సు సౌకర్యాలు, చార్జీలు, రూట్ మ్యాప్ తదితర వివరాల కోసం ప్రత్యేకంగా మేడారం విత్ ఆర్టీసీ పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com